www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గాల్లో తేలినట్టుందే..

ధైర్యంగా నడుద్దాం.. చలో

విశాఖలో దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన: ఎంపీ భరత్


కైలాసగిరిపై సముద్ర మట్టానికి 1,020 అడుగుల ఎత్తున ఏర్పాటు

కైలాసగిరిపై ప్రారంభమైన గాజు వంతెన

14

మంగళవారం | 2-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 266 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం, తిథి: ద్వాదశి మ.3:57 తదుపరి త్రయోదశి. నక్షత్రం: అశ్విని రా.8:52 తదుపరి భరణి, వర్జ్యం: సా.5:16-6:42, తె.5:19 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8:46-9:30, రా.9:51-10:41, అమృతఘడియలు: మ.2:23-3:50, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:33, సూర్యాస్తమయం: 5:35 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో కిడ్నీ వ్యాధి బాధితురాలు నాగలక్ష్మికి పింఛన్ అందజేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఫొటో దిగిన సీఎం చంద్రబాబు

మాతోనే సుస్థిరాభివృద్ధి

15 ఏళ్లపాటు అధికారంలో ఉండాలనేది పవన్ ఆకాంక్ష

మా ఇద్దరిదీ ఒకే ఆలోచన.. మాకు మోదీ సాయం: సీఎం


- 18 నెలల్లో 50,766 కోట్ల విలువైన పెన్షన్లు
- పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం
- ఉచిత బస్సుల్లో 25 కోట్ల మహిళల ప్రయాణం
- వరి ఒక్కటే కాదు, ఇతర పంటలూ వేయాలి
- జనవరి నాటికి రోడ్లపై గుంతలన్నీ పూడుస్తాం
- అభివృద్ధి దిశగా విశాఖ, తిరుపతి, అమరావతి
- ఏలూరు జిల్లా నల్లమాడులో బాబు ఉద్ఘాటన

ఏలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): "ఎన్డీయేతోనే ఏపీ సుస్థిరాభివృద్ధి చెందుతుంది. మా మిత్రుడు పవన్‌కల్యాణ్ చెప్పినట్టు, పదిహేనేళ్ల పాటు మా ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉండాలి. అప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన సాకారమవుతాయి. సంక్షేమం, అభివృద్ధి విషయంలో నాదీ, పవన్‌దీ ఒకే ఆలోచన. మాకు ప్రధాని నరేంద్ర మోదీ సహకరిస్తున్నారు" అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో

మిగతా 13వ పేజీలో...

గంజాయి వల్లే లేడీ డాన్లు తయారు: సీఎం

ఏలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గంజాయిని ఏ మాత్రం అడ్డుకోలేదని.. దానిని విక్రయించడంతో పాటు తాగడం వల్ల కొందరు మహిళలు లేడీ డాన్లుగా తయారయ్యారని సీఎం చంద్రబాబు అన్నారు. 'వామ్మో.. లేడీ డాన్లు' శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ ప్రజావేదికపై ఘాటుగా స్పందించారు. గంజాయి నివారణను జగన్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మహిళలు కొందరు గంజాయి అమ్ముతూ తాగడం కూడా అలవాటు చేసుకున్నారని వ్యాఖ్యానించారు.





పార్లమెంటులో నాటకాలొద్దు

- డ్రామాలకు బయట చాలా అవకాశాలున్నాయ్
- వాటికి పార్లమెంటును వేదిక చేసుకోవద్దు
- అభివృద్ధికి సహకరించండి.. బాధ్యతగా ఉండండి
- ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చురకలు
- ఎస్ఐఆర్‌పై రగిలిన పార్లమెంట్.. నేటికి వాయిదా
- ప్రధాని ప్రసంగమే పెద్ద డ్రామా: కాంగ్రెస్

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాటకాలు వేయడానికి పార్లమెంటు వేదిక కాదని ప్రధాని మోదీ అన్నారు. పార్లమెంటు ఉన్నది ఫలవంతమైన చర్చలతో ప్రజలకు సేవలందించడానికని చెప్పారు. ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విపక్షాలు చట్టసభలను ఎన్నికలకు సన్నద్ధమయ్యే వేదికగా మార్చుకుంటున్నాయని, ఓటముల తర్వాత ఎదురయ్యే అసహనాన్ని తగ్గించుకునే సాధనంగా వాడుకుంటున్నాయని విమర్శించారు. శీతాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం ఆయన పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడారు. ఉభయసభలు రాజకీయ డ్రామాలకు వేదిక కారాదన్నారు. నిర్మాణాత్మక, ఫలప్రదమైన చర్చలకు

మిగతా 2వ పేజీలో...

రాజ్యసభలో 'ధన్‌ఖడ్' రగడ

- ధన్‌ఖడ్ నిష్క్రమణపై ఖర్గే ఆందోళన
- వీడ్కోలు చెప్పే చాన్స్ సభకు ఇవ్వలేదని ఫైర్
- నడ్డా, కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం

2

ఆ ఎమ్మెల్సీలకు చైర్మన్ కౌన్సెలింగ్!

వెంటనే రాజీనామా ఉపసంహరించుకున్న జాకియా ఖానం

రాజీనామా చేసిన ఆరుగురు సభ్యులతో మోషేన్‌రాజు ముఖాముఖి భేటీలు

- రాజీనామా ఎందుకు చేశారు?
- ఎవరైనా పదవుల ఆశ చూపారా?
- రాజీనామాకు ముందు, తర్వాత ఎవరిని కలిశారు?
- ఆ లేఖల ప్రింట్లు ఎక్కడ తీసుకున్నారంటూ ప్రశ్నలు
- చైర్మన్ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ సభ్యుల ధ్వజం
- రాజీనామా మా రాజ్యాంగ హక్కు
- దానిని ఆయన హరిస్తున్నారు
- బలవంతంగా రాజీనామా చేశామన్న సాకుతో తిరస్కరించాలని చూస్తున్నారు
- రాజీనామాలకు కట్టుబడే ఉన్నామన్న మిగిలిన ఐదుగురు ఎమ్మెల్సీలు



మోషేన్ రాజు | పద్మశ్రీ | కల్యాణచక్రవర్తి | పి.సునీత | వెంకటరమణ | రాజశేఖర్ | జాకియా ఖానం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదవులకు రాజీనామా చేసిన ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీల విషయంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అనుసరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. వారిని సోమవారం పిలిపించి 'కౌన్సెలింగ్' ఇచ్చారు. దీంతో ఆ ఆరుగురిలో ఒకరైన జాకియా ఖానం రాజీనామా ఉపసంహరించుకోవడం గమనార్హం. ఆయన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మిగతా ఐదుగురు సభ్యులు విమర్శిస్తున్నారు. రాజ్యాంగంలోని 190 (3)(బీ) అధికరణ ప్రకారం ఎమ్మెల్సీ తన పదవికి స్వచ్ఛందంగా

మిగతా 12వ పేజీలో...

సంతకాల కోసం కోటి పాట్లు!

- పీపీపీకి వ్యతిరేకంగా అక్టోబరు నుంచే కోటి సంతకాల సేకరణ చేపట్టిన వైసీపీ
- గత నెల 27నే గవర్నర్‌ను కలుస్తామని అట్టహాసంగా జగన్ ప్రకటన
- సంతకాలకు జనం ససేమిరా.. దీంతో హైదరాబాద్‌లో సేకరించేందుకు యత్నం
- అక్కడా కుదరకపోవడంతో వెనుదిరిగిన నేతలు.. ఇక రాజ్‌భవన్‌కు వెళ్లేదెప్పుడో!

14

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకి

- పాన్ ఇండియా స్థాయిలో ఒకేలా విచారణ.. దర్యాప్తు సంస్థను ఆదేశించిన సుప్రీం
- ఏఐ టెక్నాలజీ ఎందుకు వాడటం లేదు?.. ఆర్బీఐని ప్రశ్నించిన కోర్టు.. నోటీసు జారీ
- సీబీఐని అనుమతించాలని బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలకు సూచన
- ఇకపై డీఫాల్ట్‌గా 'సంచార్ సాథీ' యాప్.. మొబైల్ సంస్థలకు టెలికాం శాఖ ఆదేశం
- సైబర్ నేరాలు, మొబైల్ చోరీల అడ్డుకట్టకు చర్యలు

2



వివాహ బంధంలోకి సమంత - రాజ్


- కోయంబత్తూరులోని ఈశా కేంద్రంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య నిరాడంబరంగా జరిగిన వేడుక
- యోగా సంప్రదాయ విధానమైన 'భూత శుద్ధి వివాహం'తో ఒక్కటైన జంట

దర్శకుడు రాజ్ నిడిమోరు, సమంత

11

మద్యం కేసులోనూ చంద్రబాబుకు విముక్తి

14



- జగన్ హయాంలో పెట్టిన కేసు కొట్టివేత
- నాడు ఫిర్యాదు చేసిన ఎండీ వాసుదేవరెడ్డి ఉపసంహరించుకుంటున్నట్లు నివేదన
- అభ్యంతరం లేదంటూ అఫిడవిట్ వేసిన ప్రస్తుత ఎండీ శ్రీధర్
- దీంతో కేసు కొట్టివేస్తూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఉత్తర్వులు

మద్యం ముడుపులతో ముంబైలో బంగారం



- 'వైట్'గా మార్చుకున్న కసిరెడ్డి గ్యాంగ్
- సహకరించిన ఏ-49 అనిల్ చోఖ్రా
- ఆదాన్, లీలా, ఎస్‌పీవై నుంచి 78 కోట్లు షెల్ ఖాతాల్లోకి మళ్లింపు
- చాముండ బులియన్స్ యజమాని చేతన్ కుమార్ ద్వారా గోల్డ్ డీల్
- బులియన్ ట్రేడింగ్‌తో నగదు మార్పు
- స్కామ్‌లో దుబాయ్ ఆర్థిక లింకులు
- సిట్ విచారణలో గుట్టువిప్పిన చోఖ్రా

14

వైకుంఠద్వార దర్శనం కోసం 24.05 లక్షల రిజిస్ట్రేషన్లు

1.76 లక్షల మందికే అవకాశం.. నేటి మధ్యాహ్నం ఈ-డిప్

3

ఒకింత కష్టంగానే క్యాట్

2

- మూడు విభాగాల్లో కలిపి 68 ప్రశ్నలు
- డీఐఎల్ఆర్ విభాగంలో ట్రిక్కీగా ప్రశ్నలు
- ఎంసీక్యూ - టిటాకు సమ ప్రాధాన్యం!

ఒక్కో పేపర్‌కు 12 నిమిషాలు

- కనీసం అంత టైం దిద్దాల్సిందే.. టెన్త్ మూల్యాంకనంపై నిర్ణయం
- రోజుకు గరిష్ఠంగా 40 పేపర్లు.. పొరపాట్లు రాకుండా చర్యలు
- ఇన్విజిలేటర్లుగా ప్రైవేటు టీచర్లు.. 20 శాతం మందికి అవకాశం?

12

స్టిల్ట్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు వాడడానికి వీల్లేదు!



- అది అపార్ట్‌మెంట్ ఓనర్లు, నివాసితులు ఉపయోగించుకొనే కామన్ ఏరియా
- అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించొద్దు: హైకోర్టు

3

రైతులను నిందించకండి

- ఢిల్లీ వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు
- పంట వ్యర్థాల దహనాన్ని రాజకీయం చేయొద్దని వ్యాఖ్య

న్యూఢిల్లీ, డిసెంబరు 1: దేశ రాజధాని ఢిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం పెరిగిపోవడంపై రైతులను నిందించడం సరికాదని, ఈ అంశంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పంట వ్యర్థాల దహనం అంశాన్ని రాజకీయం చేయవద్దని, అహానికి సంబంధించిన విషయంగా చూడొద్దని సూచించింది. కోవిడ్ సమయంలో కూడా పంట వ్యర్థాల దహనం కొనసాగినా నీలాకాశం స్పష్టంగా కనపడిందని, గాలి నాణ్యత పెరిగిందని గుర్తు చేసింది. కాలుష్యానికి గల ప్రధాన కారణాన్ని గుర్తించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాలుష్య నివారణకు అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలు, గాలి నాణ్యత ఏ మేరకు మెరుగుపడిందనే విషయంపై వారంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అధికారుల కార్యాచరణ సమర్థంగా లేకపోతే ప్రత్యామ్నాయాలు ఆలోచించాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మసాలా బాండ్ల కేసులో కేరళ సీఎంకు నోటీసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ప్రాజెక్టుల కోసం విదేశాల నుంచి నిధులు సేకరణకు ఉద్దేశించిన 'మసాలా బాండ్లు' విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంటూ కేరళ సీఎం విజయన్‌కు ఈడీ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఇస్సాక్, సీఎం ఆఫీస్ చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.ఎం.అబ్రహాంలకు కూడా నోటీసులు జారీ చేసినట్టు సోమవారం అధికార వర్గాలు తెలిపాయి. అయితే, విచారణ నిమిత్తం వారు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిన పనిలేదని తెలిపాయి. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డ్ (కేఐఐఎఫ్‌బీ) కోసం 2019లో రూ.2,150 కోట్లను బాండ్ల రూపంలో సేకరించారు. అందులో రూ.466 కోట్ల వినియోగంలో విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా)లోని నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ ఈడీ నోటీసులు పంపించింది.

బ్రహ్మోస్ శాస్త్రవేత్త నిశాంత్‌పై ఆరోపణల కొట్టివేత!

నాగ్‌పూర్, డిసెంబరు 1: బ్రహ్మోస్ క్షిపణులకు సంబంధించిన కీలక రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేశారన్న కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న శాస్త్రవేత్త నిశాంత్ అగర్వాల్‌పై కీలక ఆరోపణలను కోర్టు కొట్టివేసింది. రహస్యాలను ఆయన పాకిస్థాన్‌కు చేరవేశారనేందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. కానీ, బ్రహ్మోస్ క్షిపణి కార్యక్రమానికి సంబంధించిన రహస్య పత్రాలను ఆయన తన వ్యక్తిగత ల్యాప్‌టాప్‌లోకి కాపీ చేసుకున్నారని.. చట్ట ప్రకారం ఇది నేరం కావడంతో మూడేళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్టు ఆదేశాలు జారీ చేసింది. భారత్, రష్యాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన 'బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఏపీఎల్)'లో నిశాంత్ అగర్వాల్ పనిచేసేవారు. బ్రహ్మోస్ క్షిపణులకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాకిస్థాన్ గూఢచారులకు చేరవేశారనే ఆరోపణలపై ఆయనను 2018లో మిలటరీ ఇంటెలిజెన్స్(ఎంఐ), యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టు చేశాయి.

తుపాకీతో బెదిరించి.. నగ్నంగా చిత్రీకరించి

- ముంబైలో మహిళా వ్యాపారవేత్తపై ఫార్మా ఎండీ అకృత్యం

ముంబై, డిసెంబరు 1: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. మహిళా వ్యాపారవేత్తను సమావేశానికి అని పిలిపించిన ఓ ప్రైవేటు కంపెనీ ఎండీ ఆమె పట్ల అతి దారుణంగా ప్రవర్తించాడు. తుపాకీ గురిపెట్టి వివస్త్రను చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. 51 ఏళ్ల మహిళా వ్యాపారవేత్తను ఫ్రాంకో-ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ ఎండీ జాయ్ జాన్ పాస్కల్ మీటింగ్ ఉందంటూ తన ఆఫీసుకు పిలిచి, ఆమెను బెదిరించి నగ్నంగా ఉన్న ఆమె ఫొటోలు, వీడియోలు రికార్డు చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు జాన్‌తో పాటు మరో ఐదుగురిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో క్యాబ్ కోసం చూస్తున్న ఓ మహిళపై గ్యాంగ్‌రేప్ జరిగింది. నవంబరు 29న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ప్రాణాలతో ఉండాలంటే దేశం విడిచి వెళ్లండి

- వెనెజువెలా అధ్యక్షుడు మదురోకు ట్రంప్ తుది హెచ్చరిక

వాషింగ్టన్ డీసీ, డిసెంబరు 1: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను తక్షణమే దేశం విడిచి వెళ్లాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తుది హెచ్చరిక జారీ చేశారు. దేశం విడిచి వెళ్తే మదురోతో పాటు ఆయన కుటుంబాన్ని, సన్నిహితులను ప్రాణాలతో వదిలేస్తామని ట్రంప్ చెప్పినట్లు మియామి హెరాల్డ్ కథనం ప్రచురించింది. మదురోతో ఇటీవల ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్ సంభాషణ సందర్భంగా ఈ హెచ్చరిక జారీ చేసినట్లు కథనంలో ఉంది. అయితే ఈ ప్రతిపాదనకు మదురో ఒప్పుకోలేదని, తనకు, తన పరివారానికి, సన్నిహితులకు క్షమాభిక్ష ప్రసాదించాలని కోరారని కథనం పేర్కొంది.

ఒకింత కష్టంగానే క్యాట్

- డీఐఎల్ఆర్ విభాగంలో ట్రిక్కీగా ప్రశ్నలు

ఆశ్చర్యాలు ఏమీ లేనప్పటికీ ఈ ఏడాది క్యాట్ ఒకింత కష్టంగానే ఉందని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత రెండుమూడేళ్లుగా క్యాట్‌లో ప్రశ్నల కాఠిన్య స్థాయిని క్రమంగా పెంచుతున్నారు. అదే సరళి ఈ ఏడాది క్యాట్‌లోనూ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు సెషన్లుగా ఈ పరీక్ష జరిగింది. ఐఐఎంలు సహా ప్రఖ్యాత బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి తొలి ప్రాతిపదికగా మాత్రమే క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) ర్యాంకును పరిగణిస్తారు. ఈ పరీక్షలో మూడు విభాగాలు - వరుసగా వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ (వీఏఆర్‌సీ), డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఎబిలిటీ(క్యూఏ) ఉంటాయి. వీఏఆర్‌సీలో 24, మిగిలిన రెండింటి నుంచి 22 చొప్పున మొత్తం 68 ప్రశ్నలు ఈసారి అడిగారు. పరీక్ష కాలవ్యవధి రెండు గంటలు.

డీఐఎల్ఆర్ విభాగంలో ట్రిక్కీగా ప్రశ్నలు

ఈ ఏడాది క్యాట్‌లో పేరాగ్రాఫ్ జంబుల్ ప్రశ్నలు కూడా ఇచ్చారు. మల్టీపుల్ ఛాయిస్(ఎంసీక్యూ)తోపాటు జవాబును నేరుగా టైప్ చేయాల్సిన (టిటా) ప్రశ్నలకు ఈసారి సమ ప్రాధాన్యం లభించింది. డీఐఎల్ఆర్‌లో అడిగిన ప్రశ్నలు ట్రిక్కీ(యుక్తి)గా ఉండటంతో అభ్యర్థులకు ఈ విభాగం కష్టంగా మారిందని కెరీర్‌లాంచర్ కోఫౌండర్ గౌతమ్‌పురి అభిప్రాయపడ్డారు. విధానంలో మార్పులు లేనప్పటికీ డీఐఎల్ఆర్‌లో అడిగిన ప్రశ్నల కారణంగానే అలా అనిపిస్తోందని టైమ్ సీనియర్ కోర్స్ డైరెక్టర్ రామ్‌నాథ్ కనకదండి తెలిపారు. మూడో సెషన్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ కష్టంగా అనిపించిందని విద్యార్థులు తెలిపారు. మొదటి సెషన్‌లో అడిగిన ప్రశ్నల తీరు గత ఏడాదితో పోల్చుకుంటే కష్టంగానే ఉందని అంటున్నారు. క్వాంటిటేటివ్ ఎబిలిటీలో మెజారిటీ ప్రశ్నలు అర్థమెటిక్, ఆల్జీబ్రా నుంచే అడిగారు. జామెట్రీ నుంచి మూడు, నంబర్స్, మోడ్రన్ గణితం నుంచి ఒకటి చొప్పున ప్రశ్నలు వచ్చాయి. రీడింగ్ కాంప్రహెన్షన్ కింద ఎలక్ట్రానిక్ మ్యూజిక్, లా అండ్ మెంటల్ హెల్త్, నాయిస్ అండ్ సోషల్ ఆర్డర్, ఇన్‌కమ్ ఇనీక్వాలిటీ అండ్ ఎకనామిక్ గ్రోత్‌పై పేరాగ్రాఫ్స్ ఇచ్చారు. రెండో సెషన్‌లో కాఠిన్య స్థాయి దాదాపు మొదటి సెషన్ స్థాయిలోనే ఉంది. 2022, 2023ల్లో మాదిరిగా కష్టంగా ఉందని మరికొందరు అభిప్రాయపడ్డారు. డీఐఎల్ఆర్ విభాగం కష్టంగా ఉండగా, వీఏఆర్‌సీ, క్యూఏ మోడరేట్‌గా ఉన్నాయి. డీఐఎల్ఆర్‌లో మల్టీపుల్ ఛాయిస్, టిటా ప్రశ్నలు 11 చొప్పున అడిగారు. వీఏఆర్‌సీలో 10 నుంచి 12.. అంటే సగం వరకు ప్రశ్నలకు జవాబులు సులువుగానే గుర్తించవచ్చు. క్వాంటిటేటివ్ ఎబిలిటీలో ఆరేడు ప్రశ్నలకు జవాబులు కరెక్ట్‌గా గుర్తిస్తే 90 పర్సంటైల్, అదే 10-11 సరిగా గుర్తిస్తే 99 పర్సంటైల్ వస్తుందని అభ్యర్థులు చెబుతున్నారు. మూడో సెషన్ సైతం మొదటి రెండింటి మాదిరిగానే ఉందన్నది ప్రాథమిక సమాచారం. అయితే, ఆ రెండింటితో పోల్చుకుంటే మూడోది కష్టంగా ఉందని కొద్ది మంది విద్యార్థులు తెలిపారు. క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగం అందుకు కారణమని చెబుతున్నారు. ఈ సెషన్‌లో డీఐఎల్ఆర్ సులువుగా ఉంది. అర్థమెటిక్‌లో 8-9 ప్రశ్నలు అడిగారు. అలాగే టిటా ప్రశ్నలు 10 వరకు ఉన్నాయి. రీడింగ్ కాంప్రహెన్షన్‌లో నాలుగింటికి గాను రెండు కష్టంగా ఉన్నాయని ఎక్కువ మంది తెలిపారు.

– ఎడ్యుకేషన్ డెస్క్

పార్లమెంటులో నాటకాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వేదిక కావాలని పేర్కొన్నారు. "డ్రామాలు వేసుకోవడానికి బయట చాలా అవకాశాలు ఉన్నాయి. అలా వేసుకునేవారు ఆ పనిని కొనసాగించండి. కానీ, పార్లమెంటు డ్రామాలకు వేదిక కాదు. ఇది ప్రజాసేవ చేసేందుకు వేదిక" అని మోదీ విపక్షాలపై విరుచుకుపడ్డారు. "నినాదాలు చేసుకోవాలంటే దేశవ్యాప్తంగా చేసుకోండి. కానీ, పార్లమెంటులో మాత్రం విధానాలపై దృష్టి పెట్టండి, నినాదాలపై కాదు" అని ప్రతిపక్షాలకు ప్రధాని హితవు పలికారు. సభ్యులు అవసరమైన చోట నిర్మాణాత్మకమైన, కచ్చితమైన విమర్శలు చేయాలని సూచించారు. ఎన్నికల్లో పరాజయాల వల్ల కలిగిన అసహనాన్ని పార్లమెంటు కార్యకలాపాలపై చూపకూడదని రాజకీయ పార్టీలకు హితవు పలికారు. మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఆయన ప్రసంగమే అతిపెద్ద డ్రామా అని ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల సమస్యలను లేవనెత్తడం డ్రామా కాదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక అన్నారు. సమస్యలపై చర్చకు అనుమతించకపోవడమే డ్రామా అని ఆరోపించారు.



ఉభయసభల్లో గందరగోళం

దేశవ్యాప్తంగా సర్ నిర్వహణపై, ఢిల్లీ పేలుళ్లపై చర్చించాలని శీతాకాల సమావేశాల మొదటి రోజే ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. తీవ్ర గందరగోళం మధ్యనే ఆర్థిక మంత్రి నిర్మల పొగాకు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలాపై సుంకాలను పెంచేందుకు సెంట్రల్ ఎక్సైజ్ సవరణ బిల్లు, ఆరోగ్య భద్రత, జాతీయ భద్రతా సెస్ బిల్లులతో పాటు మణిపూర్ జీఎస్టీ సవరణ బిల్లులను ప్రవేశపెట్టారు. మణిపూర్ జీఎస్టీ బిల్లును సభ మూజువాణీ ఓటుతో ఆమోదించింది. జన విశ్వాస్ సవరణ బిల్లు, దివాలా, ఖాయిలా బిల్లులపై సెలెక్ట్ కమిటీ నివేదికలను కూడా ప్రవేశపెట్టిన తర్వాత సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఎస్ఐఆర్‌పై చర్చించాలని కాంగ్రెస్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. రాజ్యసభలో కూడా ఎస్ఐఆర్‌పై వాయిదా తీర్మానాన్ని చైర్మన్ రాధాకృష్ణన్ తిరస్కరించడంతో ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ఇదిలా ఉండగా, గత బడ్జెట్‌లో అంచనా వేసినదానికన్నా ఈ ఆర్థిక సంవత్సరం రూ.41వేల అదనపు వ్యయం కానుందని, దీనికి అనుమతించాలని కేంద్రప్రభుత్వం లోక్‌సభను కోరింది. మరోవైపు, పరారీలో ఉన్న 15 మంది ఆర్థిక నేరగాళ్లు ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ.58వేల కోట్లు బాకీ పడ్డారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. బాకీలు చెల్లించాల్సిన వారిలో విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు ఉన్నారని చెప్పారు. వారు 12 బ్యాంకులకు రూ.58,082 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. వారి నుంచి ఇంతవరకు రూ.19,187 కోట్లు వసూలు చేసినట్టు చెప్పారు.

జీపీఎస్ స్పూఫింగ్ నిజమే

దేశంలోని వివిధ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో జీపీఎస్ స్పూఫింగ్ జరిగింది నిజమేనని కేంద్రం అంగీకరించింది. ఢిల్లీ సహా ముంబై, కోల్‌కతా, హైదరాబాద్, అమృత్‌సర్, బెంగళూరు, చెన్నైలోని విమానాశ్రయాల్లో జీపీఎస్ స్పూఫింగ్, జీఎన్ఎస్ఎస్ (గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం) మార్చేందుకు జోక్యం చేసుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపింది.

'అదానీ'లో పెట్టుబడులు ఎల్ఐసీ సొంత నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని ఎల్ఐసీకి కేంద్ర ఆర్థిక శాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఎల్ఐసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల నిర్ణయం మేరకు, ఆ సంస్థ సొంతంగానే పెట్టుబడి పెట్టిందని లోక్‌సభలో సోమవారం ఒక ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఆమె వెల్లడించారు. రుణాల చెల్లింపులు, అమెరికాలో ప్రభుత్వ విచారణతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న అదానీ సంస్థలను కాపాడేందుకు ఆర్థిక శాఖ ఈ ఏడాది మేలో బలవంతంగా ఎల్ఐసీతో దాదాపు రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టించిందని గత అక్టోబర్‌లో అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రిక కథనం ప్రచురించటంలో మన దేశంలో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించాయి.


రాజ్యసభలో 'ధన్‌ఖడ్' రగడ

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది. సోమవారం సభలో.. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి స్వాగత ప్రసంగం చేసిన విపక్ష నేత ఖర్గే.. రాజ్యసభ మాజీ చైర్మన్ ధన్‌ఖడ్‌ను ఆకస్మికంగా పంపించేశారంటూ చేసిన వ్యాఖ్యలతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో ప్రధాని మోదీ సభలోనే ఉన్నారు. "మీ(ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్) కంటే ముందు మీ సీట్లో ఉన్న ధన్‌ఖడ్ అనూహ్యంగా, ఎవరూ ఊహించని రీతిలో ఆకస్మికంగా రాజ్యసభ చైర్మన్‌గా నిష్క్రమించడం బాధాకరం. ఇది పార్లమెంటరీ చరిత్రలో ఎన్నడూ జరగనిది. కనీసం.. ఆయనకు వీడ్కోలు పలికే అవకాశం కూడా సభకు రాకపోవడం నన్నెంతో నిరాశకు గురిచేసింది" అని ఖర్గే అన్నారు. ఖర్గే వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "మీరు మాజీ చైర్మన్(ధన్‌ఖడ్) గురించి ఉపయోగించిన దారుణమైన పదాలు మరిచిపోయారా? ఎంతటి అభ్యంతరకరంగా, అవమానకరంగా వ్యవహరించారో అందరికీ గుర్తుంది" అని కిరణ్ రిజిజు అన్నారు. కాగా, రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌పై మోదీ ప్రశంసల జల్లుకురిపించారు. మరోవైపు, సభ్యులు "నిబంధనలు అనే లక్షణ రేఖకు కట్టుబడి ఉండాలి" అని రాధాకృష్ణన్ సూచించారు.

బేసిక్‌లో డీఏ విలీనం ప్రస్తుతానికి లేదు

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఉద్యోగుల బేసిక్ వేతనంలో డీఏను విలీనం చేసే ఆలోచన ఏదీ ప్రస్తుతానికి లేదని కేంద్రఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధరి సోమవారం లోక్‌సభలో చెప్పారు. 8వ వేతన సంఘం ఏర్పాటైన దృష్ట్యా డీఏలో కనీసం 50 శాతాన్ని తక్షణమే బేసిక్‌లో కలపాలంటూ ఇటీవల ఉద్యోగ సంఘాలు కేంద్రాన్ని కోరిన నేపథ్యంలో మంత్రి చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకొంది. ఒకవేళ బేసిక్‌లో ప్రస్తుతం ఉన్న డీఏను కలిపితే ఉద్యోగుల మూల వేతనం బాగా పెరుగుతుంది.

లోకం తీరు



కరిచేవారంతా పార్లమెంట్‌లో..

కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి తీవ్ర వ్యాఖ్యలు



రేణుకా చౌదరి పార్లమెంట్‌కు తీసుకొచ్చిన కుక్క

న్యూఢిల్లీ, డిసెంబరు 1: పార్లమెంటు సమావేశాల సందర్భంగా సోమవారం అసాధారణ దృశ్యం చోటు చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి సోమవారం పార్లమెంటు ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకురావడం తీవ్ర వివాదాస్పదం అయింది. పైగా తన చర్యను సమర్థించుకొంటూ రేణుక చేసిన వ్యాఖ్యలు.. దుమారం రేపుతున్నాయి. శునకాన్ని ఎందుకు తీసుకొచ్చారు? అని మీడియా ప్రశ్నించగా.. "తప్పేముంది? ఈ కుక్క ఎవ్వరినీ కరవదు. కరిచేవాళ్లంతా పార్లమెంటు లోపల కూర్చొని ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఇది మీకు తప్పుగా అనిపించదా?" అని రేణుక తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శునకాన్ని పార్లమెంటు ప్రాంగణంలోకి తీసుకురావడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడం కదా? అని ప్రశ్నించినప్పుడు.. "శునకానికి కూడా పాసు ఇవ్వండి. అంతకుమించి ఏం చెప్పగలం?" అని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలోకి ఏ ఎంపీ అయినా కుక్కతో రావొద్దని చట్టాల్లో ఉందా? అని ప్రశ్నించారు. తాను పార్లమెంటుకు వస్తుండగా మార్గమధ్యలో శునకం కనిపించిందని, ఏ వాహనమైనా దానిపైనుంచి వెళ్తుందేమోనని కార్లో తనవెంట పార్లమెంటుకు తీసుకొచ్చానని చెప్పారు. "ఓ జంతువు ప్రాణాలను కాపాడితే అభ్యంతరమేమిటి? దాన్ని నేను పెంచుకుంటాను" అని చెప్పారు. రేణుక చర్యను బీజేపీ తీవ్రంగా ఖండించింది. సహచర ఎంపీలను శునకాలతో పోల్చడం ద్వారా వారిని, పార్లమెంటును, అందులోని సిబ్బందిని ఆమె అవమానించారని విమర్శించింది.

ఎన్నికల కోడ్‌పై చట్టం చేయొద్దు!

- చేస్తే ఈసీ అధికారాలను కుదించినట్లే
- జేపీసీకి లా కమిషన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్)ని చట్టంగా తీసుకురావద్దని లా కమిషన్ సూచించింది. చట్టం చేస్తే కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) అధికారాలను కుదించినట్లవుతుందని.. పార్లమెంటరీ సంయుక్త సంఘాని(జేపీసీ)కి స్పష్టంచేసింది. అంతేకాకుండా నిర్దిష్ట గడువులో స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఉండదని పేర్కొంది. జమిలి ఎన్నికలపై ఏర్పాటైన ఈ జేపీసీకి కమిషన్ తన అభిప్రాయాన్ని తాజాగా తెలియజేసింది. 'తక్షణ చర్యలకు ఆస్కారం ఉండడమే ఎంసీసీ సామర్థ్యం. ఉల్లంఘనలపై కొద్ది రోజుల్లో.. ఒక్కోసారి గంటల్లోనే స్పందించాల్సి ఉంటుంది. ఎంసీసీ గనుక చట్టమైతే.. ఉల్లంఘనలపై కోర్టు వివాదాలు పెరుగుతాయి. ప్రతికూల ఫలితాలు ఎదురవుతాయి. ఈసీ అధికారాలను కుదించినట్లవుతుంది' అని స్పష్టంచేసింది. ఎన్నికల నియమావళికి చట్టబద్ధత లేకున్నా.. దాని ప్రాతిపదికన ఈసీ తీసుకున్న నిర్ణయాలను సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో సమర్థించింది.

బీఎల్‌వోలను బలిగొంటున్న 'సర్' పనిభారం


- ఒత్తిడితో యూపీ, బెంగాల్‌లో అధికారుల బలవన్మరణాలు

బరేలీ/బిజ్‌నోర్, డిసెంబరు 1: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారుల(బీఎల్‌వో) వరుస మరణాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పని ఒత్తిడి, లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారుల నుంచి వస్తున్న బెదిరింపులు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని మృతుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తాజాగా యూపీలోని బిజ్నూర్ జిల్లాకు చెందిన బీఎల్‌వో సర్వేశ్‌సింగ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్‌నోట్‌లో.. 'బతకాలనుంది కానీ, ఏం చేయను' అంటూ నిస్సహాయతను వ్యక్తం చేశారు. పని ఒత్తిడి వల్ల ప్రశాంతత కోల్పోయానన్నారు. యూపీలో ఇదే విధమైన కారణాలతో ఇప్పటికే ఐదుగురు బీఎల్‌వోలు మరణించినట్టు వెల్లడైంది. బిజ్నూర్‌కే చెందిన 56ఏళ్ల శోభన రాణి అనారోగ్యంతో ఉన్నా.. కూతురు పెళ్లి ఏర్పాట్లకు సెలవు కూడా తీసుకోకుండా వరుసగా పని చేసింది. దీంతో ఇటీవల గుండెపోటుకు గురై మరణించిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఫతేపూర్‌కు చెందిన సుధీర్ కుమార్(37) తన పెళ్లికి కొద్ది రోజుల ముందు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోండా జిల్లాకు చెందిన టీచర్ విపిన్ యాదవ్(35) నవంబర్ 25న విషం సేవించి మరణించగా, మిగతా ముగ్గురు గుండెపోటు, బ్రెయిన్ హెమరేజ్ వంటి అనారోగ్య సమస్యలతో చనిపోయారు. యూపీ తరహాలోనే, బెంగాల్‌లోనూ.. ఎస్ఐఆర్ సర్వే మొదలైన కొద్ది రోజుల్లోనే నలుగురు బీఎల్‌వోలు మృతి చెందగా.. వీరిలో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు.

డిజిటల్ అరెస్టు కేసులు సీబీఐకి..

పాన్ ఇండియా స్థాయిలో ఒకేలా విచారణ.. దర్యాప్తు సంస్థను ఆదేశించిన సుప్రీంకోర్టు

- ఏఐ టెక్నాలజీని ఎందుకు వాడటం లేదు?
- ఆర్బీఐని ప్రశ్నించిన కోర్టు.. నోటీసు జారీ
- సీబీఐని అనుమతించాలంటూ తెలంగాణ తమిళనాడు, బెంగాల్ రాష్ట్రాలకు నిర్దేశం



న్యూఢిల్లీ, డిసెంబరు 1: సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టుల పేరిట చేస్తున్న నగదు మోసాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అన్ని కేసుల్లో పాన్ ఇండియా స్థాయిలో ఒకే తరహా దర్యాప్తు జరపాలని జాతీయ దర్యాప్తు సంస్థకు నిర్దేశించింది. సీబీఐని తమ రాష్ట్రాల్లోకి అనుమతించాలంటూ పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలను కోరింది. సైబర్ నేరగాళ్ల ఉపయోగించిన బ్యాంకు ఖాతాలను గుర్తించి, స్తంభింపజేయడానికి ఏఐ సాంకేతికతను లేక మిషన్ లెర్నింగ్ టెక్నాలజీని ఎందుకు ఉపయోగించడం లేదని రిజర్వు బ్యాంక్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇవ్వాలంటూ నోటీసు జారీచేసింది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల వ్యవహారం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో డిజిటల్ అరెస్టు వలలో చిక్కి, బాధితులుగా మారిన హరియాణాకు చెందిన వృద్ధ దంపతులు చేసిన ఫిర్యాదును సుమోటోగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీలతో కూడిన బెంచ్ స్వీకరించింది. ఎక్కువగా సీనియర్ సిటిజన్లపైనే సైబర్ నేరగాళ్ల కన్నేసి, వారు జీవితాంతం కష్టించి కూడబెట్టినదంతా దోచేస్తున్నారని ఈ సందర్భంగా బెంచ్ వ్యాఖ్యానించింది. డిజిటల్ అరెస్టులకు సంబంధించిన వివరాలు ఇవ్వడంతో పాటు, దీనిపై దర్యాప్తులో సీబీఐకి సహకరించాల్సిందిగా ఐటీ సంస్థలను కోర్టు కోరింది. ట్యాక్స్ మినహాయింపులిచ్చే దేశాల్లో నక్కిన సైబర్ నేరగాళ్లను పట్టుకోవడంలో ఇంటర్‌పోల్ సహకారం తీసుకోవాలని సీబీఐకి సూచించింది. ఒక వినియోగదారుడికి ఒకటి కంటే ఎక్కువ సిమ్‌లను సర్వీస్ ప్రొవైడర్లు ఇస్తున్నారా అనేది నివేదించాలని టెలికం విభాగాన్ని ఆదేశించింది. సీబీఐ దర్యాప్తునకు అండగా తమ పరిధిలో సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాల్సిందిగా రాష్ట్రాలు, యూటీలను కోరింది. ఆన్‌లైన్ మోసాల కట్టడి గురించి కేంద్రం ఏం ఆలోచిస్తుందనేది తెలపాలని సొలిసిటర్ జనరల్‌ను కోరింది. సైబర్ నేరగాళ్లు వాడిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసే అధికారాన్ని సీబీఐతోపాటు రాష్ట్రాలు, యూటీలు, వాటి పోలీసు ఏజెన్సీలకు కోర్టు ఇచ్చింది.

ఇకపై డీఫాల్ట్‌గా 'సంచార్ సాథీ' యాప్!

మొబైల్ సంస్థలకు టెలికాం శాఖ ఆదేశం

న్యూఢిల్లీ, డిసెంబరు 1: సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ మొబైల్ తయారీ సంస్థలు, దిగుమతిదారులకు కీలక ఆదేశాలు జారీచేసింది. కొత్తగా తయారు చేసే, దిగుమతి చేసుకునే స్మార్ట్‌ఫోన్లలో సైబర్ సెక్యూరిటీ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'సంచార్ సాథీ' యాప్‌ను డీఫాల్ట్‌గా ఇన్‌స్టాల్ చేయాలని సూచించింది. నవంబరు 28న ఈ సూచన చేసిన టెలికాం శాఖ.. దీని కోసం ఆయా సంస్థలకు 90 రోజులు గడువు ఇచ్చినట్టు తెలిసింది. ఈ యాప్‌ను డీఫాల్ట్‌గా ఇస్తే.. ఇతర యాప్‌ల మాదిరిగా దీన్ని డిలీట్ చేయడం కుదరదు. సంచార్ సాథీ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో ప్రారంభించింది. ఈ యాప్ ఇప్పటివరకు చోరీకి గురైన మొబైళ్లలో 7 లక్షలకుపైగా గుర్తించడంలో సహాయపడింది. ఒక్క అక్టోబరు నెలలోనే దీని ద్వారా 50 వేల ఫోన్లను గుర్తించారు. ఈ యాప్ సాయంతో 37 లక్షల పోగొట్టుకున్న మొబైళ్లను బ్లాక్ చేశారు. సైబర్ ముప్పును ఎదుర్కోవడంలో, ఐఎంఈఐల ట్యాంపరింగ్‌ను నిరోధించడంలో, నకిలీ మొబైల్ కనెక్షన్లను గుర్తించడంలో ఈ యాప్ సహాయపడుతుంది. అయితే, దీనివల్ల వినియోగదారుల ప్రైవసీకి భంగం కలుగుతుందన్న అభిప్రాయాలున్నాయి.

నా సహచరికి భారతీయ మూలాలు

కుమారుడి పేరులో 'శేఖర్': మస్క్



న్యూఢిల్లీ, డిసెంబరు 1: ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ తన సహచరి శివోన్ జిలిస్ గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఆయన సహజీవన భాగస్వామి శివోన్‌కు భారతీయ మూలాలు ఉన్నాయని చెప్పి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ పాడ్‌కాస్ట్ "డబ్ల్యూటీఎఫ్ ఈస్?"లో తన వ్యక్తిగత జీవితం గురించి మస్క్ మాట్లాడారు. శివోన్ బాల్యం కెనడాలో గడిచిందని, అక్కడే ఆమె పెరిగారని చెప్పారు. తమకు కలిగిన ఓ కుమారుడి పేరులో నోబెల్ అవార్డు గ్రహీత, ప్రముఖ ఆస్ట్రోఫిజిక్స్ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఆయన పేరులో శేఖర్‌ను కలిపినట్లు తెలిపారు. శివోన్ గురించి పోడ్‌కాస్ట్‌లో అడిగినప్పుడు మస్క్ స్పందిస్తూ.. "బాల్యంలోనే ఆమెను దత్తతకు ఇచ్చారు. కెనడాలో పెరిగింది. మిగతా వివరాలు పెద్దగా తెలియవు" అని చెప్పారు. అలాగే కష్టపడే భారతీయులు, వారి ప్రతిభతో అమెరికా అత్యంత లాభపడిందని చెప్పారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతోందన్నారు.

ఎవరు ఈ శివోన్..?

శివోన్ తల్లి పంజాబ్‌కు చెందిన హిందూ మహిళ. తండ్రి కెనడాకు చెందిన శ్వేతజాతీయుడు. యేల్ యూనివర్సిటీలో ఆర్ట్స్, ఎకనామిక్స్, ఫిలాసఫీలో శివోన్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2017లో మస్క్ సంస్థ న్యూరాలింక్‌లో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థ ఆపరేషన్స్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. మస్క్ సహచరిగా ఆమెకు కలిగిన నలుగురు సంతానంలో కవలలు స్ట్రైడర్, అజ్యూర్, కుమార్తె అర్కాడియా, మరో కుమారుడు సెల్డన్ ఉన్నారు. వీరిలో ఓ కుమారుడి పేరు మధ్యలో శేఖర్ అని కలిపారు.

హసీనా ఆదేశంతోనే 'రైఫిల్స్' తిరుగుబాటు!

- నివేదిక సమర్పించిన విచారణ కమిషన్
- భారత్ పాత్ర కూడా ఉందని ఆరోపణ

ఢాకా, డిసెంబరు 1: పదహారేళ్ల క్రితం జరిగిన బంగ్లాదేశ్ రైఫిల్స్(బీడీఆర్) తిరుగుబాటు వెనుక నాటి ప్రధాన మంత్రి షేక్ హసీనా హస్తం ఉందని విచారణ కమిషన్ ఆరోపించింది. 2009లో హసీనా తిరిగి అధికారం చేపట్టిన కొన్ని వారాలకే బీడీఆర్ తిరుగుబాటు జరిగింది. రెండు రోజులపాటు కొనసాగిన ఆ తిరుగుబాటులో అత్యున్నత సైనిక అధికారులు సహా 74మంది చనిపోయారు. మొహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం బీడీఆర్ తిరుగుబాటుపైనా ఒక విచారణ కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ తాజాగా సమర్పించిన నివేదికలోని వివరాలను కమిషన్ చైర్మన్ ఏఎల్ఎం ఫజ్లుర్ రహ్మాన్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బంగ్లాదేశ్ సైన్యాన్ని బలహీనపరిచేందుకు జరిగిన ఆ కుట్రలో భారత దేశం పాత్రకూడా ఉందన్నారు. ఆ సమయంలో 921మంది భారతీయులు బంగ్లాదేశ్‌లోకి రాగా, అందులో 67మంది ఎక్కడున్నారో తెలియలేదన్నారు. కాగా, కమిషన్ నివేదికతో 'నిజం' వెలుగులోకి వచ్చిందని యూనస్ అన్నారు.



వైకుంఠద్వార దర్శనం కోసం 24.05 లక్షల రిజిస్ట్రేషన్లు

1.76 లక్షల మందికే అవకాశం.. నేటి మధ్యాహ్నం ఈ-డిప్ ద్వారా పేర్ల ఎంపిక

తొలి మూడు రోజుల దర్శనాలకు ముగిసిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తొలి మూడు రోజుల వైకుంఠ ద్వార దర్శనాలకు ఈ-డిప్ ద్వారా 24.05 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు జరగనున్నాయి. గత ఏడాది జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో కౌంటర్ల ద్వారా కాకుండా ఆన్‌లైన్‌లో ఈ-డిప్ విధానంలో తొలి మూడు రోజులు అంటే, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, జనవరి 1వ తేదీకి సంబంధించిన టోకెన్లు కేటాయించాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబరు 27 ఉదయం 10 గంటలకు ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. సోమవారం సాయంత్రం 5 గంటలకు నమోదుకు గడువు ముగిసే సమయానికి 24,05,237 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా 9,28,608 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మొబైల్ యాప్ ద్వారా 13,29,112 మంది, ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,45,517 లక్షల మంది నమోదు చేసుకున్నారు. ఈ మూడు రోజులకు 1.76 లక్షల మందికి మాత్రమే దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. మంగళవారం డిప్‌లో ఎంపికైన భక్తులకు మధ్యాహ్నం 2గంటల తర్వాత సెల్‌ఫోన్ నంబరు, ఈ-మెయిల్‌కు సమాచారం పంపనున్నారు.

5న శ్రీవాణి, రూ.300 టికెట్ల విడుదల

జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లను ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. రోజుకు వెయ్యి చొప్పున ఏడు రోజులకు 7 వేల టికెట్లను అందుబాటులో ఉంచనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లనూ విడుదల చేస్తారు. రోజుకు 15 వేల చొప్పున 1.05 లక్షల టికెట్లను జారీ చేయనున్నారు. ఇవి పూర్తిగా ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన కేటాయిస్తారు.



గాయపడిన ఏనుగును ఎస్వీ జూపార్కులోని ఎన్‌క్లోజర్‌కు తరలిస్తున్న దృశ్యం

గాయపడిన ఏనుగు ఎస్వీ జూపార్కుకు తరలింపు

యాదమరి/మంగళం(తిరుపతి), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా మండల పరిధిలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఒంటరి ఏనుగును తిరుపతిలోని ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి సోమవారం తరలించారు. రెండ్రోజుల క్రితం డీకే చెరువు సమీపంలోని కమ్మపల్లి అటవీ బీట్ గుడ్డివానిచెరువు వద్ద ఏనుగు జారిపడి కాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. కుంకీ ఏనుగులు కృష్ణ, అభిమన్యు సహాయంతో దెబ్బతిన్న ఏనుగును భారీ క్రేన్ సాయంతో లారీలోకి ఎక్కించారు. సోమవారం మధ్యాహ్నానికి తిరుపతి జూలోని ఎన్‌క్లోజర్‌కు తరలించి చికిత్స ప్రారంభించారు.

ఉత్తర తమిళనాడును ముంచెత్తిన 'దిత్వా'

- చెన్నై సహా పలు జిల్లాల్లో భారీ వానలు
- అండమాన్-చెన్నై విమాన సర్వీసులు రద్దు
- వర్షాల కారణంగా మరో ఇద్దరు మృతి




జలమయమైన చెన్నైలోని ప్రధాన రహదారి

చెన్నై, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'దిత్వా' తుఫాను కారణంగా ఉత్తర తమిళనాడులోని చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు తదితర జిల్లాల్లో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెగని వర్షం కురిసింది. దీంతో చెన్నైతో పాటు ఆయా జిల్లాల్లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. చెన్నైలోని ప్రధాన రోడ్లపై సైతం మోకాల్లోతున నీరు ప్రవహించింది. భారీ వర్షానికి ఈదురుగాలులు తోడవడంతో పలు విమానాల రాకపోకల్లో జాప్యం నెలకొంది. అండమాన్-చెన్నై మధ్య తిరగాల్సిన నాలుగు విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయా జిల్లాల్లోని విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఇక మెరీనా, పట్టినంబాక్కం తదితర బీచ్‌ల సమీపానికి ప్రజలు వెళ్లకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. నాగపట్టణం, మైలాడుదురై, కారైక్కాల్ జిల్లాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 2.10 లక్షల ఎకరాల్లో సాంబ వరి, ఇతర పంటలు నీట మునిగినట్లు అధికారులు అంచనా వేశారు. ఇంటి గోడ కూలిన ఘటనలో నాగపట్టణం జిల్లాలో ఓ మహిళ, మైలాడుదురై జిల్లాలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మరణించారు. దీంతో వర్షాల కారణంగా మృతిచెందిన వారి సంఖ్య ఎనిమిదికి చేరింది.

చెన్నైకి చేరువగా తీవ్ర వాయుగుండం

- నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు
- నేడు, రేపు కూడా..



భారీ వర్షాల కారణంగా నెల్లూరు జిల్లా కావలి ప్రాంతంలో నీట మునిగిన వరి పైరు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

'దిత్వా' తుఫాన్ బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారిన తర్వాత బంగాళాఖాతంలో తీరానికి సమాంతరంగా అతి నెమ్మదిగా ఉత్తరం వైపు పయనిస్తోంది. గంటకు సగటున ఐదారు కిలోమీటర్ల వేగంతో తమిళనాడు, పుదుచ్చేరికి అతి సమీపంగా పయనిస్తూ సోమవారం మధ్యాహ్నానికి చెన్నైకి చేరువగా వచ్చింది. చెన్నైకి తూర్పున 50 కి.మీ., నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా 170 కి.మీ. దూరంలో కొనసాగుతోంది. మరో రెండు రోజులు ఉత్తరంగానే పయనించి చెన్నైకి ఉత్తరంగా తీరం దాటడంలేదా, సముద్రంలో బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రాయలసీమ, దక్షిణ కోస్తాలో పలుచోట్ల, మధ్య, ఉత్తర కోస్తాలో అక్కడక్కడ సోమవారం వర్షాలు కురిశాయి. మేఘాలు ఆవరించడంతో చలి వాతావరణం నెలకొంది. నెల్లూరు జిల్లాలో వేకువజాము నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేని వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. నెల్లూరు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలం పెంచలకోనలో జలపాతం ఆకట్టుకుంటోంది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు దక్షిణ కోస్తాలో అనేకచోట్ల, ఉత్తరకోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, కోనసీమ, పశ్చిమగోదావరి, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తీరం వెంబడి గంటకు 50 నుంచి 60, అప్పుడప్పుడు 70 కి.మీ.ల వేగంతో గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని పేర్కొంది. మచిలీపట్నం, నిజాంపట్నం, ఓడరేవు, కృష్ణపట్నంలో రేవుల్లో మూడో నంబరు, మిగిలిన రేవుల్లో ఒకటో నంబరు హెచ్చరిక ఎగురవేశారు.

అందుకే బలహీనపడింది..

శనివారం రాత్రి నుంచి తీరానికి అతి సమీపంగా తమిళనాడుకు ఆనుకుని పయనించడంతో తుఫాన్ బలహీనపడుతూ వచ్చింది. తీరానికి ఆనుకుని పయనించడం, పొడిగాలులు తుఫాన్ వైపుగా వెళ్లడం వల్ల తుఫాన్ బలహీనపడిందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. రాష్ట్రంలో మరో రెండు రోజులు వర్షాలు కొనసాగుతాయన్నారు. మంగళవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

తిరుమలలో ఆగని వాన

- ఘాట్‌రోడ్డుపై విరిగిపడిన కొండ రాళ్లు
- శ్రీవారిపాదాలు, పాపవినాశన మార్గాలు మూసివేత



దిత్వా తుఫాన్ ప్రభావంతో సోమవారం సాయంత్రం వరకు తిరుమలలో వాన కురుస్తూనే ఉంది. దట్టమైన పొగమంచు క్షేత్రాన్ని కప్పేస్తోంది. చలితీవ్రత పెరగడంతో రద్దీ తగ్గింది. కేవలం 19 కంపార్టుమెంట్లలోనే భక్తులు ఉన్నారు. ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, శ్రీవారిపాదాల మార్గాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. చెట్లు, కొండరాళ్లు పడుతున్న క్రమంలో భక్తులెవరినీ ఆ మార్గాల్లోకి అనుమతించడంలేదు. సోమవారం తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో తొమ్మిదవ కిలోమీటరు వద్ద కొండరాళ్లు విరిగిపడ్డాయి.

టీటీడీ పరిధిలోని ఆలయాల్లోనూ రుచికరమైన, నాణ్యమైన అన్నప్రసాదాలు

- అన్యమత ఉద్యోగులు ఉంటే గుర్తించండి: అధికారులకు ఈవో ఆదేశం

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిధిలోని ఇతర ఆలయాల్లో కూడా తిరుమల తరహాలోనే భక్తులకు రుచికరంగా, నాణ్యమైన అన్నప్రసాదాలను అందించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. టీటీడీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సోమవారం సమీక్ష నిర్వహించారు. అన్నప్రసాదాల తయారీ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. టీటీడీలో ఇంకా ఎవరైనా అన్యమతస్తులు ఉంటే వారిని గుర్తించి తదుపరి చర్య కోసం నివేదిక తయారు చేయాలని, వారి ప్రవర్తన శైలి గురించి ఆరా తీయాలని ఆదేశించారు. అమరావతిలోని వెంకటపాలెంలో ఉన్న టీటీడీ శ్రీవారి ఆలయ విస్తరణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 25 ఎకరాల్లో ఇదివరకే ఉన్న ఆలయంతో పాటు ఇకపై నిర్మించనున్న కల్యాణకట్ట, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, ప్రాకారం, గోపురాలు, పుష్కరిణి నిర్మాణాలపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

తిరుపతిలో హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మరోసారి హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. పాయ్ వైశ్రాయ్, రాజ్ పార్కు హోటళ్ల వద్ద ఐఈడీ బాంబులు పెట్టామని, ఏ క్షణమైనా పేలే అవకాశం ఉందని పాక్ ఐఎస్ఐ పేరుతో సోమవారం మెయిల్స్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. విస్తృత తనిఖీలు చేపట్టి ఆ బెదిరింపు మెయిల్స్ ఉత్తివేనని తేల్చారు.

దేవదాయ పోస్టుల్లో పలు అంశాల సవరణకు ప్రభుత్వం సానుకూలత: యామినీశర్మ

విజయవాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన వేదపండిత అధ్యాపకుల, చండీ సప్తశతి పారాయణ, ఇతర వేద పారాయణ పోస్టుల భర్తీకి విద్యార్హత, స్థానికతను సవరణ చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సానుకూలంగా స్పందించినట్టు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు సాదినేని యామినీ శర్మ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. సవరణల ఆవశ్యకతను ఇటీవల దేవదాయ శాఖ కమిషనర్ శ్రీరామచంద్రమోహన్, ప్రిన్సిపల్ సెక్రటరీ జవహర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

పీఎంఏవైజీ దరఖాస్తులకు గడువు పొడిగింపు

అనకాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ (పీఎంఏవైజీ) కింద దరఖాస్తుల స్వీకరణ, సర్వేను మరో రెండు వారాలు పొడిగించినట్టు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు తెలిపారు. వాస్తవానికి అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, సర్వే గడువు నవంబరు 30వ తేదీతో ముగిసిందని, చాలా మంది దరఖాస్తు చేయలేకపోయినట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చిందన్నారు. దీంతో సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ గడువును మరో రెండు వారాలపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు సోమవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందించి, ఈ నెల 14వ తేదీ వరకు గడువు పొడిగించిదన్నారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కూడా పేదలకు ఇళ్ల మంజూరు కోసం సర్వే జరుగుతున్నట్టు తాతయ్యబాబు తెలిపారు.

రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి: మాధవ్

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన వరి చేతికొచ్చే సమయంలో తుఫాన్లు తుడిచి పెట్టేస్తున్నాయి. ప్రభుత్వం అన్నదాతలకు భరోసా కల్పించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు. ఆయన సోమవారం ఓ ప్రకటన చేశారు. 'వరుస ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో తడిచిన ధాన్యం విక్రయించుకోలేక దిక్కులు చూస్తున్నారు. రైస్ మిల్లర్లు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు తక్షణమే ధాన్యం కొనుగోలు, రైతుల్ని ఆదుకునే విషయంలో కార్యాచరణ ప్రకటించాలి' అని మాధవ్ విజ్ఞప్తి చేశారు.



జాతీయ స్కేటింగ్‌లో 'నారాయణ'కు బంగారు పతకం

- నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర నారాయణ ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ నిర్వహించిన 6వ జాతీయ ఫెడరేషన్ కప్ పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సింధూర నారాయణ తెలిపారు. జాతీయ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలో తమిళనాడులోని మదురై నారాయణ పాఠశాలకు చెందిన ఎం.తమిళినియన్ అండర్-11 విభాగంలో బంగారు పతకం సాధించారని అన్నారు. కూడో చాంపియన్‌షిప్‌లో ఒడిసా రాష్ట్రం కటక్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థి ఆయుష్ కుమార్ లేంకా అండర్-12లో, సులగ్న లేంకా అండర్-15 బాలికల విభాగంలో వెండి పతకాలు సాధించారని ఆమె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం చదువు వరకే పరిమితం కాకుండా విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లోనూ ప్రోత్సహిస్తున్నామని ఈ సందర్భంగా డైరెక్టర్ తెలిపారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సింధూర నారాయణ అభినందనలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులను పోర్టల్‌లో నమోదు చేయండి

- వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ ఆస్తుల వివరాలను ఉమీద్ పోర్టల్‌లో నమోదు చేయడానికి గడువు ఈ నెల 5వ తేదీతో ముగియనుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మసీదులు, దర్గాలు, అషూర్‌ఖానాలు, కబర్‌స్తాన్లు సహా అన్ని వక్ఫ్ సంస్థల నిర్వాహకులు వెంటనే అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయాలని సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ ఆస్తుల భద్రత, పారదర్శకత కోసం అన్ని వివరాలను తప్పనిసరిగా ఉమ్మీద్ పోర్టల్లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

ఇక ఉద్యమం ఉధృతం: ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం

విజయవాడ (గాంధీనగర్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర గడుస్తున్నా సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదని, ప్రభుత్వానికి ఇచ్చిన సమయం ముగిసిందని, ఇక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎస్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు సోమవారం ఓ ప్రకటన చేస్తూ.... ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈ నెల 6 నుంచి మూడో విడత 'సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర' కోనసీమ జిల్లాలో ప్రారంభించి 10వ తేదీన శ్రీకాకుళంలో ముగిస్తామని వెల్లడించారు.

కుమారుడిని చంపిన తండ్రి

- పింఛన్ నగదు ఇవ్వాలని ఒత్తిడి చేయడమే కారణం



మస్తానయ్య, పుల్లయ్య

ఆత్మకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రత కోసం ప్రభుత్వం పంపిణీ చేసే ఎన్టీఆర్ పింఛన్ ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ ఘటన నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం బట్టేపాడులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దళితవాడకు చెందిన ఎం.పుల్లయ్యకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ వస్తుంది. సోమవారం 1వ తేదీ కావడంతో సచివాలయ సిబ్బంది పుల్లయ్య ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు రూ.4 వేలు ఇచ్చారు. అతని కుమారుడు మస్తానయ్య పింఛన్ డబ్బులు ఇవ్వాలని తండ్రిపై ఒత్తిడి చేశాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న పుల్లయ్య కోపంతో పక్కనే ఉన్న కర్రతో కుమారుడి తలపై దాడి చేశాడు. దీంతో మస్తానయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి వైద్యశాలకు తరలించేటప్పటికే మృతి చెందాడు. ఆత్మకూరు సీఐ గంగాధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పుల్లయ్యను అదుపులోకి తీసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు.

స్టిల్ట్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు!

- అది అపార్ట్‌మెంట్ ఓనర్లు, నివాసితులు ఉపయోగించుకొనే కామన్ ఏరియా
- అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించరాదు
- ఆ అపార్ట్‌మెంట్‌లోని షాపులను కూల్చివేయండి
- జీవీఎంసీ అధికారులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లలో పార్కింగ్ కోసం ఉద్దేశించిన స్టిల్ట్ ఫ్లోర్‌ను వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని ఓ కేసు విచారణ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది. సెల్లార్, స్టిల్ట్‌ఫ్లోర్, పార్కింగ్ కోసం ఉద్దేశించిన కామన్ ఏరియాలో దుకాణాలు ఏర్పాటు చేయడాన్ని అనుమతించలేమని పేర్కొంది. ఏపీ అపార్ట్‌మెంట్ యాక్ట్-1987లోని సెక్షన్ 9 ప్రకారం పార్కింగ్ ప్రాంతాన్ని అపార్ట్‌మెంట్‌లో ఉండే ఫ్లాట్ల యజమానులు, అందులో నివాసం ఉండేవారు ఉపయోగించుకొనే కామన్ ఏరియాగా నిర్వచించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో స్టిల్ట్ ఫ్లోర్‌లో జరిపిన అనధికార నిర్మాణాలను ఏ అధికారీ క్రమబద్ధీకరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కామన్ ఏరియాగా వినియోగించే స్థలాన్ని వాణిజ్య అవసరాలకు వీలుగా మార్చి విక్రయించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని గుర్తుచేసింది. ప్రస్తుత కేసులో అనుమతించిన అపార్ట్‌మెంట్ ప్లాన్‌కు విరుద్ధంగా స్టిల్ట్ ఫ్లోర్‌లో అక్రమంగా షాపులు నిర్మించారని, గత రెండున్నర దశాబ్దాలుగా అవి తమ ఆధీనంలో ఉన్నాయనే కారణంతో క్రమబద్ధీకరించాలని, చట్టబద్ధత కల్పించాలని పిటిషనర్లు కోరలేరని న్యాయస్థానం స్పష్టం చేసింది. విశాఖపట్నంలోని మాధురి మనోర్ అపార్ట్‌మెంట్ స్టిల్ట్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలను కూల్చివేసి, నాలుగు వారాల్లో స్థలాన్ని ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అప్పగించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల తీర్పు ఇచ్చారు.

అసలు కేసు ఏంటి?

విశాఖపట్నం ఈస్ట్ పాయింట్ కాలనీలోని మాధురి మనోర్ అపార్ట్‌మెంట్‌లోని స్టిల్ట్ ఫ్లోర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని గతేడాది డిసెంబర్ 12న జీవీఎంసీ అధికారులు నోటీసులు ఇచ్చారు. వాటిని సవాల్ చేస్తూ ఈదర్లపల్లి బాల సుబ్రహ్మణ్యం, నడింపల్లి శ్రీ దివ్యదుర్గ మధులిక అనే ఇద్దరు హైకోర్టులో పిటిషన్ వేశారు. 1998, 1999లో రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా బిల్డర్ నుండి 6 షాపులను తాము కొనుగోలు చేశామని పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించవచ్చన్నారు. షాపులను క్రమబద్ధీకరించాలని జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించామని, దానిని పరిగణనలోకి తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జీవీఎంసీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ ఏఎస్‌సీ బోస్, మాధురి మనోర్ ఫ్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్లు సమర్పించిన శాన్‌క్షన్ ప్లాన్ నకిలీది అన్నారు. వ్యాజ్యం వేసేందుకు వీలుగా బిల్డింగ్ ప్లాన్ తయారు చేశారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి... రికార్డులను పరిశీలిస్తే పిటిషనర్లకు షాపులు విక్రయించిన వారు బిల్డింగ్ నిర్మాణంలో భాగస్వాములని స్పష్టమౌతుందన్నారు. పిటిషనర్లు సృష్టించిన శాన్‌క్షన్డ్ ప్లాన్‌ను కోర్టు ముందు ఉంచడాన్ని తప్పుపట్టారు. సెల్లార్, స్టిల్ట్‌ఫ్లోర్, పార్కింగ్ కోసం ఉద్దేశించిన కామన్ ఏరియాను వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.

భవనాల భద్రత కట్టుదిట్టం

- ఆంధ్రప్రదేశ్ ఫైర్ సర్వీసెస్ చట్టంలో భారీ మార్పులు
- మంత్రివర్గం ఆమోదం.. గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలను నివారించడం, భవనాల భద్రతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఫైర్ సర్వీసెస్ చట్టంలో కీలక సవరణలు చేసింది. రాష్ట్రంలో నగరాభివృద్ధి, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం వేగంగా పెరుగుతున్న క్రమంలో హై రైజ్ నిర్మాణాలకు అనుగుణంగా ఫైర్ చట్టాన్ని సవరించింది. అగ్నిమాపక శాఖ ఎన్‌వోసీలు ఆన్‌లైన్ ద్వారా వేగంగా జారీచేయడం, ప్రస్తుతం 60 రోజుల వరకూ ఉన్న గడువును 21 రోజులకు కుదించడం, అనుమతులను సులభతరం చేయడం.. వంటివి సవరణ చట్టంలో ప్రధానమైనవి. రాష్ట్రంలోని భవనాల ఫైర్ సేఫ్టీ ఆడిట్ల కోసం అర్హత కలిగిన తృతీయ ఏజెన్సీలను ఎంప్యానెల్ చేసి సాంకేతిక పరిశీలన నాణ్యతను పెంచనుంది. వాణిజ్య, నివాస, విద్యా, పారిశ్రామిక సంస్థలకు చెందిన అన్ని రకాల భవనాలను ఫైర్ డిపార్ట్‌మెంట్ ఎన్‌వోసీ పరిధిలోకి తీసుకొచ్చి నిరంతర పర్యవేక్షణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్‌వోసీ విధానాన్ని కొత్త చట్టంలో మూడు దశలుగా విభజించింది. నిర్మాణానికి ముందు ప్రొవిజనల్ ఎన్‌వోసీ, నిర్మాణం పూర్తయ్యాక ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, ఆ తర్వాత నిర్దిష్ట వ్యవధిలో రెన్యువల్ ఉండేలా చట్టంలో మార్పులు చేసింది. ఈ మూడు దశల వల్ల భవనం జీవితకాల భద్రతకు తోడ్పాటు అందించడంతో పాటు వర్షాకాలాల్లో భవనాలు కూలిపోయే ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టవచ్చని అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణ తెలిపారు. తాజా సవరణలో.. అగ్నిమాపక నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించడంతోపాటు ప్రస్తుత ఫైర్ యాక్ట్, ఏపీ బిల్డింగ్ కోడ్ రూల్స్ మధ్య ఉన్న అస్పష్టతలను ప్రభుత్వం తొలగించింది. హోంశాఖ ద్వారా ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలపై ఇటీవల మంత్రివర్గం ఆమోదించడంతో తాజాగా న్యాయ శాఖ గెజిట్ విడుదల చేసింది.

పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం

- తొలి బ్యాచ్ విద్యార్థులకు అభినందనలు: వీసీ మునిరత్నం

రాజమహేంద్రవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు కోర్సుల తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వైస్ చాన్సలర్ ఆచార్య డి.మునిరత్నం నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్ర రాష్ట్ర పరిధిలో ఇటీవల ఏర్పాటు చేసిన తెలుగు విశ్వవిద్యాలయంలో 2025-26కి సంబంధించి తరగతులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా తొలి బ్యాచ్ విద్యార్థులను అభినందించారు. ఈ యూనివర్సిటీ పరిధిలోని శ్రీశైలం పీఠంలోని చరిత్ర-సంస్కృతి- పురావస్తు శాస్త్ర పీఠాధిపతి డాక్టర్ ములుగు శ్రీనివాసరావు, కూచిపూడిలోని సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాక్షేత్రం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణతో, ఆయా ప్రాంతాల విద్యార్థులతోనూ వీసీ మునిరత్నం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశాలను నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, కుంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, అధ్యాపకుడు డాక్టర్ వెంకటరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చలికాలంలో వేడి

దేశచరిత్రలోనే అతి తక్కువకాలం కొనసాగిన శీతాకాల సమావేశాలుగా రికార్డులకెక్కడం మాట అటుంచితే, కనీసం ఈ పదిహేనురోజుల పాటైనా అవి సవ్యంగా సాగితే చాలునని సగటు పౌరుడి ఆశ. పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధాని చేసిన వ్యాఖ్యలు సభ అలా జరిగేందుకు తోడ్పడేట్టు లేదు. బిహార్ ఎన్నికల్లో విపక్షాల ఘోరపరాజయాన్ని గుర్తుచేసి, ఆ అవమానభారంతో, అక్కసుతో సభను అడ్డుకోవద్దని విజ్ఞప్తిచేయడం ద్వారా కాంగ్రెస్‌ను రెచ్చగొట్టారాయన. మంచివాగ్ధాటి ఉన్న మోదీ నోటి నుంచి వెలువడిన ఇటువంటి మాటలు అభిమానులను మెచ్చవచ్చును కానీ, విపక్షాలను మరింత రెచ్చగొట్టడమే అవుతుంది. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం అద్భుతమైనది. దానిని ప్రజలకు గుర్తుచేసుకోవచ్చు, మహిళా ఓటర్ల భాగస్వామ్యాన్ని ప్రశంసించి, అదే అనుసరిస్తూ ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించుకోవచ్చు. కానీ, సభలో విపక్షాలు ప్రస్తావించబోయే అంశాలను, వాటి వ్యవహారశైలిని డ్రామాగా తీసిపారేసినట్టు కనిపించడం, ప్రతిపక్షాలు ఎలా పని చేయాలో సలహా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానంటున్న ప్రధానికి ఏ మాత్రం తగదు. నిస్తేజంగా, దూరదూరంగా ఉన్న విపక్షాన్ని ఏకతాటిమీదకు రప్పించడానికి ఇటువంటి వ్యాఖ్యలు ఉపకరిస్తాయి.

సభలో మంచి చర్చ జరగాలన్న ప్రధాని అభీష్టం నెరవేరాలంటే అడుగులు వేయాల్సింది అధికారపక్షమే. ఎర్రకోట పేలుళ్ళ ఘటన దేశాన్ని భయోత్పాతంలో ముంచేసిన నేపథ్యంలో దేశభద్రత మీద చర్చ జరగాలని విపక్షం కోరడం సహజం. బిహార్ ఎన్నికల రెండోదశ ముందురోజున జరిగిన ఈ ఘటనలో భద్రతాపరమైన లోపాలు అనేకం కనిపిస్తున్నాయి. వేలాది కేజీల పేలుడు పదార్థాన్ని దట్టించిన వాహనం ఎంతోదూరం ప్రయాణించి, అన్ని గంటలు స్వేచ్ఛగా సంచరించడమే కాక, అప్పటికే ఉగ్రమూలాలను ఛేదించిన పోలీసులు కూడా ఈ దారుణాన్ని నివారించలేకపోవడం ఆశ్చర్యం. చర్చ పేరిట విపక్షాలు తనను ఇరకాటంలోకి నెట్టేయొచ్చునని ప్రయత్ని స్తాయన్న ఏకైక కారణంతో దేశప్రజలకు తెలియాల్సిన కీలకమైన అంశాలను ప్రభుత్వం గుప్పిట మూసివుంచడం సరికాదు. ప్రజలకు ఈ ఘటనపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై మిగిలేవుంది. ఇక, అత్యంత శక్తిమంతమైన సంస్కరణ అంటూ 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్స్‌గా కుదించి, దేశం మీదకు వదిలిన నేపథ్యంలో వాటిపై లోతైన చర్చ, విస్తృతమైన అవగాహన అత్యవశ్యం. కార్మికులకు, సంఘాలకు ఈ కోడ్స్ మీద శతకోటి అనుమానాలూ భయాలూ ఉన్నమాట నిజం.

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) మీద చర్చ జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఓ మాటన్నందుకు సంతోషం. సోమవారం ఉభయ సభల్లోనూ 'సర్' మీద చర్చకు విపక్షాలు అదేపనిగా పట్టు బట్టడం, సభ అనేకసార్లు వాయిదాపడటం చూశాం. తక్షణమే చర్చ సాధ్యం కాదంటున్న ప్రభుత్వం, త్వరితంగా అందుకు సిద్ధపడితే ఈ రచ్చ తగ్గి సభ గాడినపడే అవకాశం ఉంటుంది. తొమ్మిది రాష్ట్రాల్లో, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' అనుకున్నంత సవ్యంగా సాగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్లను తట్టుకోలేక, గడువును అందుకోలేక ఇప్పటివరకూ పదిహేనుమందికి పైగా బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ)లు ఆత్మహత్య చేసుకున్నారు. వివిధరాష్ట్రాలలో ఉన్న సిబ్బంది కన్నీటిపర్యంతం అవుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో అనేకం దర్శనమిస్తున్నాయి. విపక్షాలు అదేపనిగా ఈ పరిస్థితిని ప్రశ్నిస్తున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం ఎక్కడికక్కడ 'సర్' వివిధ దశల గడువును మరోవారం పెంచింది. ఈ అంశం మీద సభలో చర్చను చేపట్టకుండా ఎన్నికల సంఘం పక్షాన అధికారపక్షం వకాల్తాపుచ్చుకున్నదన్న భావన ప్రజలకు కలిగించడం అనవసరం. తాము ప్రస్తావించబోయే ప్రజాసమస్యలను తెరమరుగుచేసేందుకే ఏకంగా పదిగంటలపాటు 'వందేమాతరం' చర్చకు ప్రభుత్వం సిద్ధపడుతోందని విపక్షాలు అంటున్నాయి. మూడోసారి అధికారంలోకి వచ్చి కూడా తాము ఇప్పటివరకూ ఉద్ధరించిందేమిటో చెప్పుకోవడం కన్నా, అదేపనిగా గతాన్ని తవ్వి పోసి, వర్తమానంలో దేశం ఎదుర్కొంటున్న సమస్యలకూ, బాధలకూ కాంగ్రెస్, నెహ్రూలే కారణమంటూ ఎదురుదాడిచేయడం అధికార పక్షానికి అలవాటుగా మారింది. రాబోయే పదిహేను రోజుల్లో సభ బయటకంటే లోపలే కాలుష్యం అధికమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాజ్యసభాధిపతిగా దర్శనమిస్తున్న కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఎంత ఉదాత్తంగా, ఉన్నతంగా వ్యవహరిస్తారో చూడాలని ప్రజల కోరిక.

చరిత్రను విస్మరించిన 'వందేమాతరం' వివాదం!

భారత స్వాతంత్ర్యోద్యమ చారిత్రక చిహ్నమైన బంకించంద్ర ఛటర్జీ 'వందేమాతరం' గీతం విరచితమై 150 సంవత్సరాలైన సందర్భంగా కొనసాగుతున్న వివాదం నిరర్థకమైనది. చరిత్రను విస్మరించి వ్యాఖ్యలు చేయడం సరికాదు. 1937లో జరిగిన ఎన్నికలలో భారత జాతీయ కాంగ్రెస్ విజయం సాధించి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాల నేర్పాటు చేసింది. అయితే బెంగాల్‌లో ముస్లిం లీగ్ నాయకుడు ఎ.కె.ఫజ్లుల్ హక్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వంలో చేర్చుకునేందుకు ఫజ్లుల్ హక్ సుముఖత చూపినా అందుకు కాంగ్రెస్ అంగీకరించలేదు. కాంగ్రేసేతర ప్రభుత్వం నెలకొనడంతో బెంగాల్‌లో హిందూ–ముస్లిం వర్గాల మధ్య రాజకీయంగానూ, సామాజికంగానూ విభేదాలు తీవ్రమయ్యాయి. జాతిని దైవిక మాతృమూర్తిగా వ్యక్తీకరించిన వందేమాతరం గీతంలోని హిందూ ప్రతీకవాదం, దుర్గామాత ప్రస్తుతికి వ్యతిరేకంగా ముస్లిం నాయకులు ఆందోళన చేస్తున్న రోజులవి. వందే మాతరంను జాతీయగీతంగా స్వీకరించకూడదనేది ముస్లింల డిమాండ్. దేశవ్యాప్తంగా మత సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నందున ఈ వివాదంలో జోక్యం చేసుకోవడం జాతీయ కాంగ్రెస్ కేంద్ర నాయకత్వానికి అనివార్యమయింది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సంప్రదించింది. వందేమాతరం గీతంలోని మొదటి రెండు చరణాలను జాతీయ గీతంగా ఆలపించవచ్చని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ విశ్వసించే అహింసా సిద్ధాంతం, లౌకికవాద విలువలకు వందేమాతరం గీతం పూర్తిగా విరుద్ధమైనందున National Anthemగా స్వీకరించేందుకు అది యోగ్యమైనది కాదని కృష్ణ కృపలానీ (రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, ఠాగూర్ స్వంత మనుమడు) అక్టోబర్ 1937 'విశ్వభారతి న్యూస్'లో రాసిన ఒక వ్యాసంలో వాదించారు. 1896లోనే వందే మాతరం గీతానికి స్వరరచన చేసిన రవీంద్రుడు తన 70వ జన్మదిన వేడుకల సందర్భంగా ఆ గీతంపై ఆలోచనాత్మక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. 'వందేమాతరం' బదులుగా 'Vande Vratanam' (వందే వ్రతనం) ను పాటించాలని అంటే మాతృభూమికి, మానవాళికి సేవ చేసే 'ప్రతిజ్ఞ'కు నిబద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వందేమాతరంలో దుర్గామాతను స్తుతించే శ్లోకాలు ఉన్నందున ముస్లింలు ఆ గీతాన్ని జాతీయగీతంగా అంగీకరించేందుకు ఒప్పుకోలేదు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం ఒక విడదీయరాని భాగంగా ఉన్నందున వందేమాతరం National Anthem అయ్యేందుకు అర్హమైనది అని సదాచార హిందువులు, ముఖ్యంగా స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్న వారు విశ్వసించారు. బంకించంద్ర గేయంపై తన అభిప్రాయం చెప్పాలని రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సుభాష్ చంద్రబోస్ వ్యక్తిగతంగా కోరారు. 'సాహిత్య రచన అయిన 'ఆనందమఠ్' నవలలో వందే మాతరం ఉండడం సముచితమేనని, అయితే దానిని జాతీయ గీతంగా స్వీకరించడం సరికాదని రవీంద్రుడు స్పష్టం చేశారు. "వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు. ఈ విషయమై ఎటువంటి చర్చ అవసరం లేదు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూ దేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధిస్తాడని భావించలేము. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. ఆ గీతాన్ని దుర్గామాత స్తుతిస్తోత్రంగా సదరు పత్రికల సంపాదకులు భావిస్తున్నారనేందుకు అదే నిదర్శనం. 'ఆనందమఠ్' సాహిత్య రచన గనుక అందులో వందేమాతరం గీతం ఉండడం సముచితమే అయినప్పటికీ సకల మతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలాపించడం సరికాదు. అందుకు సర్వజనామోదం ఉండదు' అని సుభాష్ బోస్‌కు రాసిన లేఖలో ఠాగూర్ పేర్కొన్నారు. సుభాష్ బోస్ ఈ వివాదంపై బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. వందే మాతరంపై ఆయన మౌనం ఆ గీతం మద్దతుదారులను నిరాశపరిచింది.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1937లో కలకత్తాలో సమావేశమయింది. మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఆచార్య జేబీ కృపలానీ మొదలైన వారందరూ ఆ సమావేశంలో పాల్గొన్నారు. వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే కాంగ్రెస్ సమావేశాలలో ఆలాపించాలని ఆ సమావేశంలో నిర్ణయించారు. ఆ గీతంపై ముస్లిం దృక్కోణాన్ని కాంగ్రెస్ అంగీకరించిదని ఆ నిర్ణయం స్పష్టం చేసింది.

కాంగ్రెస్ నిర్ణయం బెంగాల్ హిందువులకు ఆశాభంగం కలిగించిందని శరత్ బోస్ (సుభాష్ అన్నయ్య) అన్నారు. మహారాష్ట్రలో సైతం కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. National Anthemను ఎంపిక చేసేందుకు మౌలానా ఆజాద్, నెహ్రూ, సుభాష్, ఆచార్య నరేంద్ర దేవ్‌లతో కాంగ్రెస్ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆ కమిటీకి సలహాదారుడు. సుభాష్ బోస్‌కు రవీంద్రుడు రాసిన ఒక వ్యక్తిగత లేఖలో వ్యక్తం చేసిన భావాలను ఉటంకిస్తూ జాతీయగీతంపై ఆయన ఇచ్చిన సలహాపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక ప్రకటనను విడుదల చేసింది. సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని జాతీయవాద పత్రికలు విమర్శించాయి. అయితే సుభాస్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కాంగ్రెస్ నుంచి వెలివేత తరువాత కూడా సుభాష్ బోస్ తన తొలి వైఖరికే నిబద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ సంస్థ అని, అన్ని మతాల వారి మనోభావాలను అది గౌరవించవలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. 1938లో బంకించంద్ర ఛటర్జీ శత జయంత్యుత్సవాల సందర్భంగా వందే మాతరం వివాదాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ గీతం మొత్తాన్ని జాతీయ గీతంగా ప్రకటించాలనే డిమాండ్ గట్టిగా వచ్చింది. అయితే సుభాష్ బోస్ ఈ డిమాండ్‌కు మద్దతునివ్వలేదు. కాంగ్రెస్ నిర్ణయమే ప్రభావశీలంగా ఉండిపోయింది.

'జన గణ మన' గీతం భారతజాతిని సమ్మిళిత దృక్పథంతో దర్శించింది; ఆసేతు హిమాచలం వర్ధిల్లుతోన్న భౌగోళిక (ప్రాంతాలు, పర్వతాలు, నదులు) బహుళత్వాన్ని సూచిస్తుంది; బహుళ మత సంప్రదాయాలు, సంస్కృతుల మహత్వాన్ని వ్యక్తం చేస్తుంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శిస్తూ జాతీయ సమైక్యతా భావాన్ని ప్రోత్సహించే సామర్థ్యమున్నందునే రవీంద్రుని విరచితమైన 'జన గణ మన'ను 'నేషనల్ ఏంథెమ్'గా కాంగ్రెస్ ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని మౌలానా ఆజాద్, ఇతర జాతీయవాద ముస్లింలు బలపరిచారు. బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం, రవీంద్రనాథ్ ఠాగూర్ 'జన గణ మన' గీతాల్లో దేన్ని నేషనల్ ఏంథెమ్‌గా స్వీకరించాలనే వివాదం హిందువులు, ముస్లింలకూ సంతృప్తికరంగా, సుహృద్భావంతో పరిష్కృతమయింది. దుర్గామాత ప్రస్తావన లేని, వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను సమస్త భారతదేశానికి సమ్మతమైన 'నేషనల్ సాంగ్' రూపంలో అంగీకరించారు. కవిగా, దార్శనికుడుగా రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఉన్న మహోన్నత గౌరవ ప్రతిష్ఠలు, ఆయన తార్కిక, నిష్పాక్షిక వైఖరి అందుకు విశేషంగా దోహదం చేశాయి. సుభాష్ బోస్ 'ఆజాద్ హింద్ ఫౌజ్' (భారత జాతీయ సైన్యం) ఈ రెండింటినీ అదే హోదాలో స్వీకరించింది.

1947లో స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 'National Anthem' అవసరాన్ని గుర్తించారు. ఐక్యరాజ్యసమితిలో 'జన గణ మన'ను భారతదేశ జాతీయగీతంగా ఆలాపించారు. 1948 ఆగస్టు 25న పార్లమెంటులో నెహ్రూ ఇలా అన్నారు: 'వందేమాతరం, జన గణ మన గీతాలలో దేనిని జాతీయగీతంగా స్వీకరించాలనే విషయమై అనవసర వాద ప్రతివాదాలు జరుగుతుండడం దురదృష్టకర విషయం. వందేమాతరం నిస్సందేహంగా భారతదేశ ఉత్కృష్ట చారిత్రక సంప్రదాయ గీతం. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వందేమాతర గీతానికి ఉన్న స్థానం దేనికీ లేదు. దాని చారిత్రక ప్రాధాన్యాన్ని ఎవరూ త్రోసిపుచ్చలేరు. వలసపాలనకు వ్యతిరేకంగా భారత ప్రజలను ఏకం చేయడంలో అది నిర్వర్తించిన పాత్ర అనుపమేయమైనది. అయితే స్వాతంత్ర్య పోరాట పరాకాష్ఠ అయిన స్వతంత్ర భారతదేశ ఆవిర్భావాన్ని, జాతి నిర్మాణంలో తదుపరి దశను ఆ గీతం సూచించదు'. రాజ్యాంగసభలో 'జన గణ మన'ను 'National Anthem'గా నెహ్రూ ప్రకటించడాన్ని అందరూ హర్షామోదాలతో స్వాగతించారు. జన గణ మన గీత చరణాలలోని సమున్నత భావాలను, ఆ గీత స్వర రచనను ప్రశంసిస్తూ, దాన్ని నేషనల్ యాంథెమ్‌గా స్వీకరించినందుకు అభినందిస్తూ భారత ప్రభుత్వానికి సందేశాలు అందాయి. తాము విన్న చాలా జాతీయ గీతాల కంటే జన గణ మన సాహిత్యం, సంగీతం ఉత్కృష్టంగా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. రాజ్యాంగ సభ 1950 జనవరి 24న నేషనల్ ఏంథెమ్‌గా జన గణ మనను అధికారికంగా స్వీకరించింది. ఆ సందర్భంగా రాజ్యాంగసభ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఇలా వ్యాఖ్యానించారు: 'జన గణ మన'గా సుప్రసిద్ధమైన సాహిత్య చరణాలు, స్వరరచన భారతదేశ 'National Anthem'. భవిష్యత్తులో సందర్భం వచ్చినప్పుడు దానిలో మార్పులు చేసే అధికారం భారత ప్రభుత్వానికి ఉన్నది. భారత స్వాతంత్ర్య సమరంలో చరిత్రాత్మక పాత్ర వహించిన బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గీతానికి కూడా జన గణ మనతో సమానహోదా ఉంటుంది'. రాజేన్ బాబు ఇంకా ఇలా విశదీకరించారు: 'జన గణ మనకు National Anthemగా రాజ్యాంగ అనుమతి లేదు. ఆ గీతాన్ని అలా గౌరవించడం భారత ప్రజల సమ్మతి ఉన్న ఒక సంప్రదాయం'. ఆ పరిపాటిని భారతదేశం పరిపూర్ణంగా అనుసరిస్తోంది.



> 'వందేమాతరంలోని ప్రధానభాగం దుర్గామాతను ప్రస్తుతించే స్తోత్రాలు. బంకించంద్ర ఛటర్జీ ఆ గీతంలో మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధించాడు. ఎంత దేశభక్తుడయిన ముస్లిం కూడా మాతృభూమిని ఒక హిందూదేవతగా ఆరాధిస్తాడని భావించలేం. ఈ ఏడాది దుర్గాపూజ సందర్భంగా పలు పత్రికల ప్రత్యేక సంచికలు వందేమాతరం చరణాలను ఉటంకించాయి. దానిని జాతీయగీతంగా స్వీకరించడం, సకలమతాల ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు లాంటి ప్రదేశంలో దాన్ని ఆలపించడం సరికాదు' అని సుభాష్ చంద్రబోస్‌కు రాసిన లేఖలో రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు. నేతాజీ సైతం అదేమాటకు కట్టుబడ్డారు.

■ సుబ్రత ముఖర్జీ
ఢిల్లీ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు
(ది స్టేట్స్‌మన్)

అతిశయోక్తులు, అవాస్తవాలు

విశాఖపట్టణంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ నిర్మిస్తున్న ఒక గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ఏర్పాటు గురించి నవంబర్ 19న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన గుత్తా రోహిత్ వ్యాసంలో అనేక అతిశయోక్తులు, అవాస్తవాలు ఉన్నాయి. మొదటగా గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టులో అదానీ, ఎయిర్‌టెల్ కేవలం సహాయకులే (ఎనేబ్లర్లు) కానీ భాగస్వాములు కాదు. డేటా సెంటర్ స్థాపనకు అవసరమైన నిర్మాణాలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక వసతుల కల్పన అదానీ గ్రూప్ ఏర్పాటు చేస్తే, సముద్ర గర్భ కేబుల్స్, అంతర్జాతీయ డేటా ట్రాన్సిట్, అంతర్జాల సదుపాయాలను ఎయిర్‌టెల్ సమకూరుస్తుంది. నిజానికి యూఎస్‌ఏలోని 50 రాష్ట్రాలలో 5,426 డేటా సెంటర్లు, చైనా, యూరోప్, సింగపూర్ తదితర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. భారతదేశంలో ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమం, డేటా లోకలైజేషన్ విధానాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ–కామర్స్, డిజిటల్ సేవల విస్తరణ వల్ల డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరిగి డేటా సెంటర్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డేటాలో భారత్ 20శాతం ఉత్పత్తి చేస్తున్నా, ప్రపంచ డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం మూడు శాతం మాత్రమే. మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదని ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధన వల్ల మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయ్యింది.

గూగుల్ అమెరికా వెలుపల ఇంత భారీ స్థాయి పెట్టుబడులతో భారతదేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ విశాఖలో ఏర్పాటు చేయడం సామాన్య విషయం కాదు. కేవలం డేటా సెంటర్ ఏర్పాటే కాకుండా సబ్ సీ కేబుల్, కేబుల్ లాండింగ్ స్టేషన్ ఏర్పాట్లపై దృష్టి పెట్టిన గూగుల్, కొత్త గ్లోబల్ సబ్ సీ కేబుల్ వ్యవస్థను విశాఖ డేటా సెంటర్‌తో అనుసంధానించడం ద్వారా విశాఖను గ్లోబల్ కనెక్టివిటీకి గేట్‌వేగా మార్చబోతోంది. ఇందువల్ల ఈ డేటా సెంటర్‌లో ప్రాసెస్ అయిన డేటా మొత్తం సబ్ సీ కేబుల్ ద్వారా నేరుగా సింగపూర్, మలేసియా, ఆస్ట్రేలియాతో సహా మరో 12 దేశాలకు లింక్ అవుతుంది.



గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహ. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

డేటా సెంటర్లలో విద్యుత్, నీటి వినియోగం అధికంగా ఉంటుందనేది నిజం. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమయ్యే నీరు, విద్యుత్ సరఫరా చేయడం వల్ల విశాఖ నగరంపై ప్రభావం పడుతుందనేది పూర్తిగా అపోహే. డేటా సెంటర్ కోసం విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం కావాలన్న వ్యాసకర్త అభిప్రాయం సత్యదూరం. పోలవరం నుంచి ప్రధాన ఎడమ కాలువ ద్వారా 2027 డిసెంబర్ నాటికి 24 టీఎంసీల నీరు విశాఖకు ఇవ్వాలని ప్రభుత్వ సంకల్పం. ఈ దిశలో పోలవరం పనులు వేగంగా జరుగుతుంటే, ఎడమ ప్రధాన కాలువ పనులు రెండు నెలల్లో పూర్తవుతాయి. కాబట్టి డేటా సెంటర్ నిర్మాణం పూర్తయ్యేనాటికి (2028) పోలవరం నీళ్లు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న సంప్రదాయ విధానాల్లో గూగుల్ డేటా సెంటర్ కోసం అత్యధికంగా 0.5 టీఎంసీల నీరు అవసరం అవుతుందని అంచనా. కానీ గూగుల్ ప్రస్తుతం అనుసరిస్తున్న నీటి స్ప్రేయింగ్ విధానాలు కాకుండా అత్యంత సమర్థమైన, ఆధునిక లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వినియోగించడం వల్ల నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా 20శాతం తగ్గుతుంది. పోలవరం నుంచి మనం ఇవ్వబోయేది, గూగుల్ వాడుకునేది అర టీఎంసీ కన్నా తక్కువ నీరు మాత్రమే. ఎక్కువ నీరు అవసరమైతే డీశాలినేషన్ విధానం ద్వారా సముద్రపు నీటిని శుద్ధి చేసి వాడుకుంటారని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. కాబట్టి ఏ విధంగా చూసినా నీటి లభ్యత పెద్ద సమస్య కానేకాదు.

రాష్ట్రంలో 2025 ఏప్రిల్ నాటికి స్థాపిత విద్యుత్ సామర్థ్యం 18,552.9 మె.వా (పునరుత్పాదక విద్యుత్ 9,419 మె.వా, థర్మల్ విద్యుత్ 7,655.50 మె.వా, జల విద్యుత్ 1,672.60 మె.వా) కాగా 2030 నాటికి 31,000 మె.వాట్లకు చేరుతాం. కాబట్టి డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరా చేయడం సమస్య కాదు. అయితే గూగుల్ "మా డేటా సెంటర్ నిర్వహణకు కావలసిన విద్యుత్ అదానీ నిర్మించబోతున్న సొంత సౌరశక్తి ప్లాంట్ల ద్వారా తయారు చేసి గ్రిడ్‌కు అనుసంధానించుకుని వాడుకుంటాం, మీ విద్యుత్ అవసరం లేదు" అంటోంది. కాబట్టి రాష్ట్రానికి విద్యుత్ భారం దాదాపు ఉండదు.

ఐటీ కంపెనీల కంటే తక్కువ మంది ఉద్యోగులను డేటా సెంటర్లు నియమించుకున్నప్పటికీ సాధారణంగా అధిక వేతనాలు ఇస్తాయి. వర్జీనియా రాష్ట్ర 'జాయింట్ లెజిస్లేటివ్ ఆడిట్, రివ్యూ కమిషన్ రిపోర్ట్' డేటా సెంటర్ పరిశ్రమ వర్జీనియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వార్షికంగా సుమారు 74,000 ఉద్యోగాలు, 5.5 బిలియన్ డాలర్ల శ్రామిక ఆదాయం, 9.1 బిలియన్ డాలర్ల స్థూల దేశీయ ఉత్పత్తి(జీడీపీ)ని అందిస్తున్నదని తెలియజేసింది. ఈ ఆర్థిక లాభాలలో చాలా భాగం డేటా సెంటర్ల నిరంతర కార్యకలాపాల కంటే ముందే నిర్మాణ దశ నుంచే వస్తాయి. కాబట్టి డేటా సెంటర్ వల్ల కేవలం వందల ఉద్యోగాలు వస్తాయనే వ్యాసకర్త భావన అసంబద్ధం. విశాఖ గూగుల్ హబ్ అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయపరచి విశాఖను కృత్రిమ మేధ పరివర్తన కేంద్రంగా నిలబెడుతుంది. డేటా సెంటర్లు సాధారణ కంప్యూటింగ్ నుంచి ఏఐ, మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వైపు మారడం వల్ల ఏఐ పరిశోధనలు, నిర్వహణ, అనుభవం ఉన్న టెక్ నిపుణుల అవసరం చాలా ఎక్కువ. ఏఐ ఇంజినీరింగ్, సైబర్ భద్రత, క్లౌడ్ ఆర్కిటెక్చర్, డేటా మానిటరింగ్, జీపీయూ క్లస్టర్ నిర్వహణ, సబ్ సీ కేబుల్ లాండింగ్ స్టేషన్ కూడా ఉండటం వల్ల కేబుల్ నిర్వహణ కోసం కూడా ఉద్యోగుల అవసరం ఉంటుంది. అలాగే ఏఐ ఆధారిత స్టార్టప్స్, పరిశ్రమలకు విశాఖ కేంద్రంగా మారుతుంది.

పీఐబీ నివేదిక ప్రకారం గూగుల్ డేటా సెంటర్ వల్ల రాష్ట్రానికి అన్ని పన్నులు, ఇతరత్రా కలుపుకుని ఏటా రూ.10,588 కోట్ల ఆదాయం వస్తుంది. అంటే రాష్ట్ర ప్రస్తుత ఆదాయాన్ని అనుసరించి రాష్ట్రానికి గూగుల్ 'ఒక నెల' ఆదాయాన్ని ఇవ్వబోతోంది. గూగుల్ రాకతో కృత్రిమ మేధ కేంద్రంగా, ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ పెట్టుబడులకు ముఖద్వారంగా విశాఖ నిస్సందేహంగా అభివృద్ధి చెందుతుంది.

● లింగమనేని శివరామప్రసాద్
సామాజిక విశ్లేషకులు

అమరావతిలో ఆర్థిక విప్లవం!

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 15 జాతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుకొచ్చి రాష్ట్రాన్ని దేశ ఆర్థిక పటంలో ముందంజలో నిలబెట్టే చారిత్రాత్మక ఘట్టానికి పునాది వేసాయి. ఆర్థిక సంస్థలు తమ కార్యాలయాల నిర్మాణాలకు, రెండు బీమా కంపెనీల ప్రాంతీయ ప్రధాన కార్యాలయాల ఏర్పాటుకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చెయ్యడంతో అమరావతిలో ఆర్థిక విప్లవం ఆరంభమయింది. వీటి ఏర్పాటు ద్వారా రూ.1,334 కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 6,576 ఉద్యోగాల కల్పన జరుగుతుందని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) వెల్లడించింది. అమరావతిలో బ్యాంకుల విస్తరణ వల్ల పెట్టుబడులు, వాణిజ్యం, నిర్మాణ రంగం మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది. వ్యాపారాల విస్తరణకు, కొత్త కంపెనీల ఏర్పాటుకు, స్టార్టప్‌లు, సూక్ష్మ పరిశ్రమలకు రుణాల లభ్యత పెరగనుండటం నగర ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవనుంది. అమరావతి పరిధిలోని ప్రజలందరికీ ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరనున్నాయి. అమరావతిపై బ్యాంకింగ్ రంగం చూపుతున్న విశ్వాసం, నగర భవిష్యత్తుపై పెట్టుబడిదారులకు కలిగిన నమ్మకానికి ప్రతీక.

అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ ఏర్పాటు ప్రక్రియను సీఆర్డీఏ వేగవంతం చేసింది. భారతదేశంలోని ముంబై, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, హైదరాబాద్ గచ్చిబౌలి తరహాలో, ప్రపంచ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థలు, ఫిన్‌టెక్ కంపెనీలు, స్టాక్ ట్రేడింగ్ సర్వీసులు వంటి ప్రతిష్ఠాత్మక ఆర్థిక సంస్థల కేంద్రంగా నిలిచే ప్రణాళిక ఇది. అంతర్జాతీయ పెట్టుబడులకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ముఖద్వారం కానున్నది. అమరావతిలో ప్రపంచస్థాయి వాణిజ్య భవనాలు, స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్, డేటా సెంటర్లు, హై–ఎండ్ ఐటీ, ఫైనాన్షియల్ టెక్నాలజీ జోన్లు, స్టార్టప్, ఇన్నోవేషన్ వేదికల ఏర్పాటు వంటివన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గేర్ మార్చనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థిక శక్తిగా నిర్మించే నూతన యుగంలో సీఎం చంద్రబాబు చూపుతున్న దూరదృష్టి ప్రశంసనీయం.

– నీరుకొండ ప్రసాద్

పేరుకే మహిళకు పంచాయతీ పదవి!


ఆంధ్రప్రదేశ్‌లో జనవరి 2026 నుంచి పంచాయతీ ఎన్నికలు జరిపించాలన్న ఎన్నికల కమిషన్ లేఖతో, స్థానిక పాలనలో మహిళల రిజర్వేషన్లపై మరోసారి దృష్టి పెట్టాల్సిన అవసరం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం గ్రామ స్థాయి నుంచి మునిసిపల్ స్థాయి వరకు మహిళల పదవులన్నీ కేవలం కాగితాలకే పరిమితమైపోతున్నాయి. స్థానిక పరిపాలనలో మహిళా రిజర్వేషన్ ఏర్పాటు మహిళా సాధికారత దిశగా ఒక చరిత్రాత్మక రాజ్యాంగ నిర్ణయం. అయితే, ఆ స్ఫూర్తితో తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ ఉద్దేశం ప్రాక్సీ అభ్యర్థిత్వాల వల్ల, కుటుంబంలోని పురుషుల ఆధిపత్యం వల్ల నీరుగారుతున్నది.

గ్రామీణ ప్రాంతాల్లో భర్తలు, సోదరులు, తండ్రుల వంటి కుటుంబ సభ్యులు మహిళలను నామినేషన్ వేయాలని ఒత్తిడి చేస్తూ, ఎన్నికల తరువాత తామే అసలైన అధికారాన్ని చెలాయిస్తున్నారు. ఎన్నికైన మహిళను ఇది కేవలం 'ఆడపిల్ల'గా మిగిల్చి, నిజమైన నాయకత్వ లక్షణాలు గల మహిళలకు అవకాశం దక్కకుండా రిజర్వేషన్ ఉద్దేశాన్ని పూర్తిగా విఫలం చేస్తోంది. అంతేకాదు, ఇటీవల భర్తలు, బంధువులు అదే స్థానిక సంస్థల్లో కో–ఆప్టెడ్ మెంబర్లుగా లేదా ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులవుతూ, నిజమైన అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నారు. ఎన్నికైన మహిళకు ఎలాంటి నిర్ణయాధికారం లేకుండా ఈ ప్రక్రియ చేస్తోంది. ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధుల పురుష బంధువులు కేవలం పక్క నుంచి నియంత్రించడమే కాదు, వారి అధికారిక కుర్చీల్లో/ కార్యాలయాల్లో కూర్చొని అధికారాన్ని చెలాయిస్తూ, సమావేశాలు నిర్వహిస్తూ, చర్యలు తీసుకుంటూ, స్వయంగా ఎన్నికైన ప్రతినిధుల్లా వ్యవహరిస్తున్నారు. ఇంకా ఒక అవమానకరమైన పరిస్థితి ఏమంటే, ఎన్నికల ప్రచార సమయంలోనూ, ఎన్నిక తర్వాత కూడా ఈ మహిళల స్థానంలో భర్తల ఫొటోలు చలామణీ అవుతున్నాయి.

దేశవ్యాప్తంగా స్థానిక పరిపాలన వ్యవస్థలో మహిళా రిజర్వేషన్ల దుర్వినియోగం పెరగటానికి సంబంధించి నమ్మదగిన ఆధారాలు రోజురోజుకూ వెలుగుచూస్తున్నాయి. 2010లో ప్రణాళికా సంఘం (ప్రస్తుతం నీతి ఆయోగ్) విడుదల చేసిన నివేదిక ప్రకారం– అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన మహిళలు కేవలం 'పేరు మీద' నాయకత్వ స్థానాల్లో ఉన్నారు. వాస్తవ అధికారాన్ని వారి భర్తలు లేదా కుటుంబానికి చెందిన పురుషులు ఉపయోగించుకుంటున్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్యయనాలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఉదాహరణలు చూస్తే– చదువు లేని లేదా రాజకీయ అనుభవం లేని మహిళల్లో ఈ ధోరణి మరింత తీవ్రం. 2021లో యూఎన్ ఉమెన్ ఇండియా, పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ సంయుక్తంగా రూపొందించిన నివేదిక ప్రకారం– మహిళలు కేవలం 'రబ్బరు ముద్ర'లా ఉండిపోతుండగా, నిజమైన నిర్ణయాలు పురుష బంధువుల ద్వారా జరిగిపోతున్నాయని వెల్లడైంది. 2023లో పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కమిటీ కూడా ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పలు సూచనలు చేసింది.

ఈ నేపథ్యంలో– జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో, బలవంతపు నామినేషన్లను నిరోధించి, అసలైన నాయకత్వ లక్షణాలు గల మహిళలకు ఆ చోటు దక్కేలా చర్యలు తీసుకోవాలి. ప్రాక్సీ అభ్యర్థిత్వాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ముందే చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని కోరాలి. పబ్లిక్ నోటీసుల ద్వారా ఈ చర్యల గురించి ముందస్తుగా హెచ్చరించాలి. ఎన్నికల అనంతరం కూడా ఈ విధంగా మహిళా ప్రజాప్రతినిధుల అధికారాన్ని, నిర్ణయాధికారాన్ని గుప్పెట్లోకి లాక్కుని పెత్తనం చేస్తుంటే, వారిపై దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. సామాన్య ప్రజలు కూడా ఫిర్యాదులు చేసేలా వాచ్ డాగ్ వ్యవస్థ ఉండాలి. బహిరంగ పోస్టర్లు, బ్యానర్లు, శిలాఫలకాల్లో, అధికారిక కార్యక్రమాల్లో, భర్తలు లేదా బంధువుల ఫొటోలు, పేర్లు ప్రదర్శించకుండా ఆదేశాలు ఇవ్వాలి. ఎన్నికైన మహిళకు సంబంధించిన పంచాయతీలో లేదా మరే ప్రభుత్వ కార్యాలయంలో ఆమె భర్త లేదా ఆమె బంధువులను నామినేటెడ్ లేదా కోఆప్టెడ్ మెంబర్లుగా నియమించడాన్ని చట్టపరంగా నిషేధించాలి. అలాగే మహిళా ప్రజాప్రతినిధులకు బదులుగా ఆమె బంధువులు అధికారిక సమావేశాల్లో, కార్యక్రమాల్లో పాల్గొనటాన్ని, నిర్ణయాలు తీసుకోవడాన్ని కూడా నిషేధించాలి. దాన్ని నేరంగా భావించి కఠిన చర్యలను ప్రకటించాలి. మహిళలకు వారి హక్కులు, అధికారం, నాయకత్వ అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి జిల్లాలో, మండలంలో, పంచాయతీలో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేసి వెంటనే చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా, ప్రాక్సీ రాజకీయాలకు వ్యతిరేకంగా ఉద్యమించేందుకు; నిజమైన నాయకత్వం కోసం మహిళలను ప్రోత్సహించేందుకు; ఈ అంశంలో ఎటువంటి రాజ్యాంగ వ్యతిరేక, చట్టవ్యతిరేక పనులకు ఎవరు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకునేందుకు– ఒక రాష్ట్ర స్థాయి ఫోరంను రాష్ట్ర మహిళా కమిషన్ వంటి శాఖలు ఎన్నికలకు ముందే ఏర్పాటు చేయాలి. 2026 పంచాయతీ ఎన్నికలు, ఒక కీలక మలుపు కావాలి. మహిళలు స్వేచ్ఛగా, ధైర్యంగా, అధికారంతో ముందుకు రావడానికి, పాలన చేయడానికి అందరం మద్దతు ఇవ్వాలి.

గ్రామీణ ప్రాంతాల్లో భర్తలు, సోదరులు, తండ్రుల వంటి కుటుంబ సభ్యులు మహిళలను నామినేషన్ వేయాలని ఒత్తిడి చేస్తూ, ఎన్నికల తరువాత తామే అసలైన అధికారాన్ని చెలాయిస్తున్నారు. ఇది ఎన్నికైన మహిళను కేవలం 'ఆడపిల్ల'గా మిగిల్చి, నిజమైన నాయకత్వ లక్షణాలు గల మహిళలకు అవకాశం దక్కకుండా రిజర్వేషన్ ఉద్దేశాన్ని పూర్తిగా విఫలం చేస్తున్నది.



○ డా. మనోహరి వెలమాటి
గ్రామదీప్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు

పీఎంఏవై గడువు పొడిగింపు..!

● మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం ● సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే ● అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం 8

బస్టాండ్‌లో.. అటో..ఇటో..ఎటో..



8

● వరుస ప్రమాదాలతో భయాందోళన ● స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

● శాప్ చైర్మన్ రవి నాయుడు ● దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విద్యార్థినిపై అత్యాచారం

● కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి

రూ.9 కోట్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను ఆశ్రయించిన కురగల్లు కో ఆపరేటివ్ బాధితులు 6

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య

● కుడి కాలువలో దూకి బలవన్మరణం ● యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు

బకాయి భారం

● మున్సిపాలిటీలకు చేకూరని ఆస్తి పన్ను ఆదాయం
● ప్రభుత్వ సంస్థల నుంచి రూ.52.36 కోట్లు పెండింగ్
● ఏళ్ల తరబడి వసూలు కాని వైనం..

మునిసిపాలిటీలకు.. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీలకు ప్రభుత్వ సంస్థలు రూ.52.36 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లిస్తే పట్టణాల్లో ప్రజలకు అవసరమైన ప్రగతి పనులు చేపట్టవచ్చు. బకాయిల వసూలు కోసం మునిసిపాల్టీలకు అయా ప్రభుత్వ కార్యాలయాల అధిపతులకు లేఖలు రాస్తున్నా ప్రయోజనం లేదు. ఆస్తి పన్ను చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాలేదంటూ అధికారులు పురపాలకులకు సమాధానం ఇస్తున్నారు.

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మునిసిపాల్టీకి రూ.3 కోట్లు, సత్తెనపల్లి రూ.1.05 కోట్లు, మాచర్ల కోటి రూపాయలు, చిలకలూరిపేట రూ.80 లక్షలు, దాచేపల్లి రూ.16 లక్షలు, వినుకొండ రూ.46 లక్షలు, పిడుగురాళ్ల రూ.37 లక్షలు, గురజాల మునిసిపాల్టీకి రూ.29 లక్షలు బకాయిలు వసూలు కావాల్సి ఉంది.

బాపట్ల జిల్లా కేంద్రం బాపట్ల మునిసిపాల్టీలో రూ.1.40 కోట్లు, రేపల్లె రూ.83 లక్షలు, చీరాల రూ.1.09 కోట్లు, అద్దంకి మునిసిపాల్టీలో రూ.32 లక్షలు ప్రభుత్వ సంస్థల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా వసూలు అయ్యే పరిస్థితులు లేవని సదరు అధికారులు చెబుతున్నారు. ఆస్తి పన్ను బకాయిలు గురించి లేఖలు రాస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదంటున్నారు.



(తెనాలి ఆంధ్రజ్యోతి)

మునిసిపాల్టీలకు ప్రైవేట్ సంస్థల కంటే ప్రభుత్వ సంస్థల ఆస్తి పన్ను మొండి బకాయి అధికంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాల ఆస్తి పన్ను బకాయి కోసం అధికారుల చుట్టూ మునిసిపల్ సిబ్బంది ప్రదిక్షణలు చేస్తున్నారు. మునిసిపాల్టీలు విద్యుత్ బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగితే ప్రభుత్వ సంస్థ అని కూడా చూడకుండా విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తారు. అటువంటిది మునిసిపాల్టీకి మాత్రం ఆస్తి పన్ను చెల్లించే విషయంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.39.62 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది.కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు.. సంస్థలకు సంబంధించి రూ.12.74 కోట్ల ఆస్తి పన్ను బకాయి (మిగతా 8వ పేజీలో)



ఏటీ అగ్రహారంలో వృద్ధాప్య పింఛన్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం పంపిణీ చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైనులో ఝాన్సీ మాతా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వయో వృద్ధులను ఆప్యాయం గా పలకరించి పింఛన్లను అందించారు. లబ్ధిదారులు నగదు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 2,56,904 మంది పింఛనుదారులకు ప్రతి నెలా రూ.111.34 కోట్లు పంపిణీ జరుగుతుందని చెప్పారు. ఇందులో వృద్ధాప్య పింఛన్లు 1,18,174, వితంతువులు 70,112, చేనేతకారులు 3,862, గీత కార్మికులు 443, మత్స్య కారులు 570, ఒంటరి మహిళలు 11,330, చర్మకారులు 876, హిజ్రాలు 67, హెచ్ఐవీ బాధితులు 2,614, కళాకారులు 77, డప్పు కళాకారులు 854, దివ్యాంగులు 24,835, వైద్య సంబంధిత పింఛనుదారులు 1667, సైనిక సంక్షేమం 28, అభయహస్తం 3,994, అమరావతి భూముల సంబంధిత 17,401 పింఛన్లు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.విజయలక్ష్మి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమి షనర్ శ్రీనివాసరావు, వార్డు సచివా లయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గుంటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అశోక్‌నగర్,పండరీపురం, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

ఉండవల్లిలో రెండో పంపింగ్ హౌస్ నమూనా సిద్ధం

● రూ. 479.49 కోట్లతో పంపింగ్ హౌస్, వంతెన నిర్మాణం ● 8,500 క్యూసెక్కుల సామర్థ్యం



ఉండవల్లిలో నిర్మించనున్న కొండవీటివాగు రెండో పంపింగ్ హౌస్ నమూనా

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో వరద నివారణ నిమిత్తం ఉండవల్లిలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న రెండో పంపింగ్ హౌస్ నమూనా సిద్ధమైంది. దాదాపు 8,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టు నమూనా విడుదలైంది. పంప్ హౌస్‌తో పాటు కొండవీటి వాగు స్లూయిస్ వద్ద రెండు లేన్ల వంతెన నిర్మించే పనులు కూడా త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. కొండవీటి వాగు నుంచి వరద నీటిని పంపింగ్ హౌస్‌కు తరలించేందుకు అప్రోచ్ ఛానల్ ను నిర్మించనున్నారు. ఇన్‌టేక్ సంప్, పంప్ ఫౌండేషన్, సూపర్ స్ట్రక్చర్ హౌసింగ్ పంపులతో కలిసిన పంపింగ్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. పంపులు, మోటార్లు, వాల్వులు, గేట్లు, స్టాప్‌లాగ్‌లు, మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టంలను ఏర్పాటు చేయనున్నారు. యాంకర్, థ్రస్ట్ బ్లాక్స్, సర్జ్ ప్రొటెక్షన్ ఏర్పాట్లతో కూడిన వరద నీటి విడుదల విధానాన్ని ఇందులో రూపొందిస్తున్నారు. కాగా, ఇప్పటికే ఉండవల్లి వద్ద కొండవీటి వాగుపై ఒక పంపింగ్ హౌస్ పనిచేస్తుంది. 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దీన్ని నిర్మించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాల గుండా వెళ్లే కొండవీటివాగు, పాల వాగులను విస్తరిస్తున్నారు. కొండవీటి వాగు వరద నీటిని నిల్వ చేయడం కోసం శాఖమూరులో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో 50 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. దీంతోపాటు నీరుకొండ రిజర్వాయర్, కురగల్లు, పెనుమాక వద్ద రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ వరద ముంపు అవకాశం లేకుండా ఉండేందుకు ఉండవల్లి వద్ద రెండో పంపింగ్ హౌస్‌ను నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. పంపింగ్ హౌస్ ఏర్పాటుకు సంబంధించి సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన్, నిర్మాణం, పరిశీలన, పదిహేనేళ్లపాటు నిర్వహణకు సంబంధించి మొత్తంగా కాంట్రాక్టు విలువను రూ. 423.64 కోట్లుగా ఏడీసీఎల్ నిర్ణయించి.. ఇటీవల టెండర్లు ఖరారు చేసింది. దీంతో పాటు కొండవీటి వాగు, గుంటూరు ఛానల్ కలిసేచోట షిప్ లాక్, రెగ్యులేటర్లతో కలిపి రెండు లేన్ల వంతెనను నిర్మించనున్నారు. దీనికోసం రూ. 55.85 కోట్లు కేటాయించారు. రెండేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.



6

దూరాభారమైనా.. బాధలు చెప్పుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి సోమవారం అర్జీదారులు చేరుకున్నారు. 76వ రోజు ప్రజాదర్బార్‌లో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్‌కు సమస్యలను వివరించారు. ఓపిగ్గా ప్రతి సమస్యను విన్న లోకేశ్.. పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తన కోసం వచ్చిన ఓ దివ్యాంగుడిని అప్యాయంగా పలకరించడంతో.. అతనిలో ఆనందం వెల్లివిరిసింది.

- మంగళగిరి

మొక్కేశారా!

● సమగ్ర శిక్షణలో దోపిడీ ● మొక్కల పేరుతో నిధులు స్వాహా

గుంటూరు (విద్య) డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించి.. మొక్కల పెంపకంపై వారికి ఆసక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని పక్కదారి పట్టించి సమగ్ర శిక్షలో కొంతమంది అధికారులు నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో చూపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో సరిగ్గా ఆరు నెలల క్రితం మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ మొక్కల్లో ఒక్కటి కూడా విద్యార్థుల ఇళ్ల వద్ద కనిపించక పోవడం గమనార్హం.

పథకం ప్రకారం నిధులు స్వాహా..

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీట్ సందర్భంగా ఒక్కో స్కూలుకు సగటున 100 నుంచి 200 మొక్కలు చొప్పున పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అటవీ శాఖ నుంచి మొక్క నాలుగు రూపాయలకు కొనుగోలు చేసినట్లు చెబుతున్నారు. పంపిణీ, ఇతర రవాణ ఖర్చుల కోసం మరో రూ.6 చెల్లించారు. అంటే ఒక మొక్క విద్యార్థికి చేరడానికి రూ.10 ఖర్చు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలా 1.85 లక్షల మంది విద్యార్థులకు రూ.3.50 కోట్ల నిధులు వెచ్చించి మొక్కలు పంపిణీ చేసినట్లు సమగ్ర శిక్ష అధికారులు రికార్డులు తయారు చేశారు. తాజాగా ఈ మొక్కల్లో అత్యధికం విద్యార్థుల ఇళ్ల వద్ద కనిపించడం లేదు. కొన్ని పాఠశాలలకు పంపిణీ చేశామని చెబుతున్నా.. పాఠశాలలో కూడా వాటి జాడ కనిపించడం లేదు. మొక్కల కోసం ప్రతి క్లస్టర్‌కు రూ.1.85 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు నిధులు చెల్లించారు. 17 క్లస్టర్లు ఉన్నాయి. ఇందులో అత్యధిక మొత్తం క్లస్టర్‌లో పనిచేసే సమగ్ర శిక్ష, విద్యా శాఖ అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.



వివరాలు సేకరిస్తున్నాం..

మొక్కలు పంపిణీలో నిధులు స్వాహా గురించి సమగ్ర శిక్ష ఏపీవో పద్మావతిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మొక్కల పంపిణీ సమాచారం ఎంఈఓల నుంచి సేకరిస్తున్నామని చెప్పారు. ఏ క్లస్టర్‌కు ఎంత మొత్తం నిధులు విడుదల చేశారనే విషయంపై ఆమె స్పష్టమైన వివరణ ఇవ్వలేదు.

క్రీడా కిట్లు వచ్చేశాయ్



ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ

గుంటూరు(విద్య): డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన క్రీడా పరికరాలు సరఫరా చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.17వేలు, రూ.30వేలు విలువైన కిట్లు ఇప్పటికే చేరాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 3వేలకుపైగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6 లక్షల మందికి పైగా విద్యార్థులున్నారు. పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు, నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. అయితే క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోటే క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఏర్పాట్లు చేసింది.



క్యారమ్స్ తదితర క్రీడా పరికరాలు

క్రీడా కిట్లు ఇలా..

షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖో-ఖో, హ్యాండ్‌బాల్ క్రీడా పరికరాలు.. క్యారమ్స్, చెస్ బోర్డులు క్రీడా కిట్లలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు విలువైన క్రీడా పరికరాలు ప్రభుత్వం పంపించినట్లు ఉపాధ్యాయులు వెల్లడించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్లకు దిశా నిర్దేశం చేయనున్నారు.

దిత్వా.. గండం గట్టెక్కినట్లేనా!

(పొన్నూరు, కొల్లిపర - ఆంధ్రజ్యోతి)

దిత్వా తుఫాన్ ప్రభావం సోమవారం సాయంత్రం వరకు జిల్లాలో నామమాత్రంగా ఉండడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆది, సోమవారాల్లో తుఫాన్ ప్రభావం చిరుజల్లులకే పరిమితమవడంతో భారీ ఊరట దక్కినట్లయింది. దిత్వా ముప్పు ఇంకా పూర్తిగా తొలగినట్లు కాదని మంగళవారం వరకు కూడా దాని ప్రభావం ఉండనుందని వాతావరణశాఖ హెచ్చరిస్తుండడం గమనార్హం. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణశాఖ అంచనాలతో గడచిన మూడు రోజులుగా అన్నదాతలకు కంటి మీద కునుకు కరువైంది. వేల ఎకరాల్లో వరి కోతకు సిద్ధంగా ఉండడం, కల్లాల్లో, రోడ్లమీద ఆరబోసిన ధాన్యం ఉండడంతో భయాందోళనలకు గురిచేసింది. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకున్నప్పటికీ భారీ వర్షాలు కురిస్తే భారీ నష్టం తప్పదనే అంచనాకు రైతాంగం వచ్చింది.



● తూములూరులో వర్షానికి తడవకుండా ధాన్యానికి పట్టాలు కప్పుతున్న రైతులు

● తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులు ● తీవ్రత నామమాత్రంగా ఉండడంతో అన్నదాతలకు ఊరట ● ధాన్యం కొనుగోళ్లు, రక్షణపై తప్పని ఆందోళన

కంటిమీద కునుకు లేదు

దిత్వా తుఫాన్ ప్రభావం కారణంగా రెండు రోజులుగా వరి రైతులకు కంటి మీద కునుకు లేదు. ఈదురు గాలులతో కూడిన వర్షంతో కొల్లిపర మండలంలో పలు చోట్ల వరి పంట చెల్లాచెదురైంది. మండలంలో చివలూరు, సిరిపురం, అత్తోట, అత్తోటయాదవపాలెం, కొల్లిపర, దంతలూరు, కుంచవరం, వల్లభాపురం, మున్నంగి తదితర గ్రామాల్లో వరి పంట 60 శాతం కోతకు వచ్చింది. యంత్రాల ద్వారా రైతులు వరి నూర్పిళ్లు ముమ్మరం చేశారు. ఈ సమయంలో చెదురుమదురుగా చిరుజల్లులతో రైతులు దిక్కుతోచని స్థితిలోపడ్డారు. మరి కొంతమంది రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ఉండటంతో వర్షాలకు తడవకుండా పట్టాలు కప్పి రక్షించుకున్నారు. పొలాలు, డొంక రోడ్లపై ఆరబోసిన ధాన్యాన్ని హడావిడిగా కూలీల చేత గోతాలకు ఎక్కించి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలిస్తున్నారు. మండలంలో మెట్ట భూముల్లో వేసిన మినుము పంట కోత కోసి.. నేలపై ఉండటంతో రైతులు రక్షించుకునే పనిలో పడ్డారు.



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

పడిపోయిన ధాన్యం ధరలు

పొన్నూరు మండలంలో ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు ఆడపాదడప చిరు జల్లులు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లలో దళారులు రంగ ప్రవేశం చేసి రైతులను నట్టేట ముంచుతున్నారు. రైతుల అవగాహన రాహిత్యంలో పలు ప్రాంతాల్లో ఈక్రాప్ బుకింగ్ కాకపోవడం వల్ల పంటలు ప్రభుత్వానికి విక్రయించే అవకాశం లేకుండా పోయింది. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు దళారులతో కారు చౌకగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు 75 కిలోల బస్తా ధాన్యం రూ.1,500 వరకు కొనుగోలు చేసిన వ్యాపారులు తేమ శాతం ఎక్కువగా ఉందని, ధాన్యం బాగోలేదని వంకలు చెబుతూ రూ.1,300 కొనుగోలు చేస్తున్నారు. దీంతో 20 రోజుల వ్యవధిలోనే బస్తాకు రూ.200 తగ్గించేశారు. బస్తాకు కేజీ తరుగు తీస్తున్నారు. గోని సంచికి మరో కేజీ బరువు లెక్కకట్టడంతో.. రెండు కిలోల వరకు తగ్గించి ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోంది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు దిక్కుతోచని స్థితిలో అందినకాడకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారు. ఈ క్రాప్ బుకింగ్ కాని రైతుల ధాన్యం కూడా రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తే కొంతమేర మేలు చేసినట్లు అవుతుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్యంపై యుద్ధభేరి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య



సభలో ప్రసంగిస్తున్న గుజ్జుల ఈశ్వరయ్య, వేదికపై సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హక్కులను హరించేలా పాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వంపై యుద్ధభేరి మోగించేందుకు కార్మిక లోకం సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. గుంటూరు సంగడిగుంట రేగుల రామయ్య భవన్‌లో సోమవారం హమాలీ (ముఠా) ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన ఆంజనేయులు అధ్యక్షతన కార్మిక నేత జీవీ కృష్ణారావు 9వ వర్ధంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మూతబడుతున్న పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావుకు జీవీకే అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కోట మాల్యాద్రి, అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, కాసా రాంబాబు, పులి సాంబశివరావు, రాజేంద్ర, బందెల నాసర్, జి.పుప్పాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు పునీత శౌరివారి తిరునాళ్ళ మహోత్సవం



దీపాలంకరణలో పునీత శౌరి దేవాలయం

వట్టిచెరుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు గ్రామంలో పునీత శౌరి వారి దేవాలయ తిరునాళ్ళ మహోత్సవం డిసెంబరు 3న జరగనుంది. తిరునాళ్లను వైభవంగా జరుపు కొనేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని దేవాలయ ప్రాంగణం, ప్రధాన వీధుల్లో వివిధ దుకాణాలతో పండుగ వాతావరణం నెలకుంది. బుధవారం బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య పలువురు ఫాదర్లతో కలసి దేవాలయ ప్రాంగణంలో సమిష్టి బలిపూజా కార్యక్రమంలో ప్రార్థనలు నిర్వహిస్తారని ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫాదర్ దిలీప్ కుమార్ తెలిపారు. కాగా, తిరునాళ్ళ మహోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకొనేందుకు దేవాలయ పెద్దలు, గ్రామస్థులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని సౌత్ జోన్ డీఎస్పీ భానోదయ కోరారు.

రూ.9 కోట్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్‌ను ఆశ్రయించిన కురగల్లు కో ఆపరేటివ్ బాధితులు



కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొసైటీ పేరుతో దాదాపు రూ 9.కోట్లు దోచుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళగిరి రూరల్ పరిధిలోని కురగల్లుకు చెందిన గ్రామస్థులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ, నీరుకొండ, కురగల్లు గ్రామాలకు కలిపి ది కురగల్లు ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్ పేరుతో ఏర్పాటు చేసి తమను మోసం చేశారని పేర్కొన్నారు. దీనిపై సొసైటీలో తీర్మానం చేసి గత అక్టోబరులో సీఈవో రమేష్ అనే అధికారిని, సహకరించిన సిబ్బందిని తొలగించారని వివరించారు. వారి ఉన్న సొమ్మును ఇప్పటివరకు బ్యాంకుకు జమ చేయలేదన్నారు. సొమ్మును రికవరీ చేసి తమ ఖాతాలకు జమ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్టు చెప్పారు. త్వరలోనే డీసీసీబీ ఛైర్మన్‌ను కలవనున్నట్టు స్పష్టం చేశారు.

ముగ్గురు దొంగల అరెస్టు

● నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ ● 26.5 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గోరంట్లకు చెందిన చిల్లర సురేష్, విజయవాడ రామలింగేశ్వర నగర్‌కు చెందిన కాజా నాగ వీర భాస్కరరావు, శివ నాగరాజు కాలనీ నాల్గో లైన్‌కు చెందిన లంకా రాజేష్‌ను అరెస్టు చేసి వారి నుంచి రూ 26.50 లక్షల విలువ చేసే 227 గ్రాముల బంగారం, 182 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. గుంటూరు సంపత్ నగర్‌కు చెందిన అవ్వారి వెంకట అప్పయ్య శాస్త్రి ఈ నెల 8న ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి తిరుపతి వెళ్లారు. 12న తిరిగి ఇంటికి రాగా మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి అందులో దాచిన 152 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్టు చేశారు. వారిని విచారించగా నిందితులు మరో మూడు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. నిందితుల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ చిల్లర సురేష్ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గోరంట్లకు చెందిన అతడు పగలు రెక్కీ నిర్వహించి రాత్రి ఇల్లు లూటీ చేయడంలో దిట్ట అని చెప్పారు. అతడిపై అధికారికంగా 78, అనధికారికంగా 150కి పైగానే కేసులు ఉండవచ్చని తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులకు ఇదివరకే తెలంగాణలోని హుజూర్‌నగర్ జైల్లో పరిచయం ఏర్పడిందని చెప్పారు. కేసును ఛేదించి సొత్తు రికవరీ చేసిన అధికారులు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందించి అభినందించారు.

పిన్నెల్లి సోదరుల అరాచకాలు కనపడలేదా

● కాసుపై ఎమ్మెల్యే జూలకంటి మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, పక్కన ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పిన్నెల్లి సోదరులు ఎన్నికల ముందు తర్వాత మాచర్లలో ఎన్ని అరాచకాలు చేశారో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డికి కనబడలేదా అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. సోమవారం నరసరావుపేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, తాను మాచర్ల నుంచి ఎప్పుడూ పారిపోలేదని, కాసు మహేశ్‌రెడ్డి ఆయన తండ్రి కృష్ణారెడ్డి నరసరావుపేట వదిలి పారిపోయి గురజాల వచ్చారని అన్నారు. విగ్రహాల దొంగ, అవినీతి పరుడు, దోపిడి దారుడు వైసీపీకి జిల్లా అధ్యక్షుడిగా ఉండటం దౌర్భాగ్యమని అన్నారు.

● దోచుకున్న డబ్బుతో కాసు సెంట్రల్ హాల్

గురజాలలో దోపిడి చేసిన డబ్బుతో కాసు సెంట్రల్ హాల్ కట్టారని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టు తీసుకు వస్తామని 50 ఏళ్ళు కాసు కుటుంబం పల్నాడు ప్రజల్ని మోసం చేసిందన్నారు. విగ్రహాల దొంగ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కాసు మహేశ్‌రెడ్డికి ఉన్న లింకేమిటని ప్రశ్నించారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చి కాసు మహేశ్‌రెడ్డి తాతను ఎదుర్కొన్న మొనగాడు తన తండ్రి జూలకంటి నాగిరెడ్డి అన్నారు. ఇద్దరు ముస్లింలను హత్యచేసిన కేసులో చిన్నతనంలోనే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముద్దాయని అన్నారు. ఆత్మకూరు సంఘటన జరిగినప్పుడు తాను హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పారు. కాసుకు ధైర్యం ఉంటే రుజువు చేయాలని, అలా చేస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని అన్నారు. సమావేశంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో వ్యాస రచన పోటీలు



సమావేశంలో మాట్లాడుకుంటున్న ఉన్నత విద్య మండలి ఛైర్మన్ మధుమూర్తి, వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ)లో విక్సిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్-2026 వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి, ప్రొఫెసర్ జి.రోశయ్య, డాక్టర్ మాథ్యూస్ శ్రీరంగం నేతృత్వం వహించారు. రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల విభాగాలకు చెందిన 40 మంది ప్రొఫెసర్లు పా ల్గొని 100 వ్యాసాలు మూల్యాంకనం చేసి, 3,659 వ్యాసాలు పరిశీలిం చారు. యువజన సేవల శాఖ నుంచి పీవీఎన్ మల్లేశ్వరరావు సూచన లు అందించారు. మూల్యాంకనం పూర్తయిన తర్వాత ఫలితాలను యువజన సేవల కమిషనర్‌కు అధికారికంగా పంపించినట్లు ఉన్నత విద్య మండలి వెల్లడించింది.

జనవరి 7, 8 తేదీలలో జాతీయ సదస్సు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జనవరి 7,8వ తేదీలలో జాతీయ సదస్సు జరగనుంది. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధరరావు సోమవారం విడుదల చేయగా, రెక్టార్ ప్రొఫెసర్ ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ తరపున ప్రొఫెసర్ జి.రోశయ్య ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

గోడపత్రిక ఆవిష్కరణ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల సాధన సమన్వయకర్తలకు సోమవారం వర్సిటీలో ఒకరోజు వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యా మండలి-ఏఎన్‌యూ సంయుక్తంగా డ్రైవింగ్ ఎక్సలెన్స్-ఇన్‌స్టిట్యూషనల్ స్ట్రాటజీస్ అనే అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి క్వాంటం టెక్నాలజీ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య విజయ భాస్కరరావు, ప్రత్యేక గౌరవ అతిథిగా ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కే.గంగాధరరావు హాజరయ్యారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీసేందుకు కృషి

● శాప్ ఛైర్మన్ రవి నాయుడు ● దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



దివ్యాంగుల బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎండీ భరణి, ఎమ్మెల్యే నసీర్, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల లోని ప్రతిభను వెలికితీసి వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని శాప్ ఛైర్మన్ రవినాయుడు అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రస్థాయి దివ్యాంగుల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, శాప్ ఎండీ భరణితో కలిసి రవినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో రవినాయుడు మాట్లాడుతూ, దివ్యాంగులకు తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తీసుకువచ్చిన క్రీడాపాలసీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీఆర్ స్టేడియంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్ ఖాన్ మాట్లాడుతూ, పోటీలకు పెద్ద ఎత్తున క్రీడాకారులు హజరయ్యారని అన్నారు. మంగళవారంతో ఈ పోటీలు ముగుస్తాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, టీడీపీ నాయకులు అబ్బూరు మల్లి, మన్నవ వంశీ, శాప్ సభ్యులు సంతోష్ కుమార్, జగదీశ్వరి, కార్పొరేటర్లు మీరావలి, అశోక్, కోచ్ లోహిత్, నళిని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అత్యాచారం

● కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చేబ్రోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో లోబర్చుకొని తనపై ఓ యువకుడు అత్యాచారం చేశాడని ఓ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, తెనాలి పట్టణానికి చెందిన ఓ యువతి, చేబ్రోలు మండలంలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతూ ప్రైవేటు వసతి గృహంలో నివసిస్తోంది. అదే వసతి గృహంలో ఉన్న సహచర విద్యార్థినుల ద్వారా కృష్ణాజిల్లా ఘంటసాల ప్రాంతానికి చెందిన నందు అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడినట్లు సమాచారం. అతను మాయమాటలు చెప్పి యువతిని నారాకోడూరు, గుంటూరు ప్రాంతాలలోని లాడ్జీలకు తీసుకెళ్లి అక్కడ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను వీడియోలు చూపించి బెదిరిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బాధిత యువతి ఆదివారం చేబ్రోలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం ఘటన జరిగిన లాడ్జిని నారాకోడూరులో పరిశీలించారు.

కోర్టులో లొంగిపోయిన పిన్నెల్లి వెంకటరెడ్డి



కోర్టు వద్ద పిన్నెల్లి వెంకటరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో ఏ8 నిందితుడిగా ఉన్న కండ్లకుంట సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి సోమవారం మాచర్ల పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. గత మే నెల 24వ తేదీన గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావులును బోదలవీడు సమీపంలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో పోలీసులు 9 మందిని నిందితులుగా చేర్చగా వీరిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఏ6, ఏ7లుగా వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. కాగా ఏ8నిందితుడిగా ఉన్న పిన్నెల్లి వెంకటరెడ్డి మాచర్ల కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ గుంటూరు జిల్లా జైలుకు రిమాండ్ విధించారు.

మాచర్లలో ప్రేమ జంట ఆత్మహత్య

● కుడి కాలువలో దూకి బలవన్మరణం

● యువతి మృతదేహం లభ్యం.. యువకుడు గల్లంతు



వీర్ల గోవర్ధన్ (ఫైల్‌ఫొటో)

మాచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణానికి చెందిన ప్రేమ జంట సోమవారం నాగార్జున సాగర్ కుడి కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణానికి చెందిన దాసరి లక్ష్మి (22), వీర్ల గోవర్ధన్ (20) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వారి వివాహానికి పెద్దల అంగీకారం కోరారు. వేర్వేరు సామాజిక వర్గాలు కావడంతో ఇరువైపుల నుంచి అంగీకారం లభించలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఇరువురు కాలువలో దూకారు. సమీపంలో స్నానం చేస్తున్న కొందరు యువకులు గమనించి కాపాడేందుకు ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. నీటి ప్రవాహానికి ఇరువురు కొట్టుకుపోయారు. యువతి దాసరి లక్ష్మిని స్థానికులు కాలువ నుంచి బయటకు తీసినప్పటికీ అప్పటికే మృతిచెందింది. కాగా గోవర్ధన్ కోసం గాలింపు చేపట్టారు. సంఘటనా స్థలం వద్దకు బంధువులు చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 580.10 అడుగులు ఉంది. ఇది 283.30 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6,006 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,226 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,481 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 37,513 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లోగా 37,513 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో నీటినిల్వ

అచ్చంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 43.54 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	126, 135, 146
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

37,392 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 39,823 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 37,392 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,063 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17300	334	11000	17400
నెంబరు. 5	11000	15000	నెంబరు. 5	----	----
273	---	----	273	----	----
341	10500	17000	341	12000	17000
4884	---	----	4884	----	----
సూపర్ 10	----	----	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తేజ	10500	15000
తేజ	10000	15200	సింటెంటా బ్యాడిగి		
షార్క్-1	-----	----	5531	11000	17500
బ్యాడిగి	10500	17400	దేవనూరు డీలక్స్	10500	16300
దేవనూరు డీలక్స్	11000	16700	తాలుకాయలు	5000	8000
ఆర్మూరు	10500	13300			

అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలి : కమిషనర్



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు పునరావృతం కాకుండా నిర్దేశిత గడువు మేరకు పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ జరిగింది. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 21 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మేయర్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు తీసుకొన్న కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 21 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, మేనేజర్ బాలాజీబాషా పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పిన్ పాయింటు మేరకు జరగాలి

నగరంలో పారిశుధ్య పనులు పిన్ పాయింట్ మేరకు జరగాలని కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం పాత గుంటూరు, మాచిరాజువారివీధి, కొండావారివీధిలలోని పలు ప్రాంతాలను పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనుల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యటనలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూరు శాతం పెన్షన్ పంపిణీ చేయాలి

నూరు శాతం పెన్షన్ల పంపిణీకి వార్డు సచివాలయాల వారీగా కార్యాచరణ మేరకు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక కొండావారి వీధి, మాచిరాజువారి వీధి ప్రాంతాల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కమిషనర్ పాల్గొన్నారు.


రాజామాస్టారుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, టీడీపీ నేతలు

అట్టహాసంగా రాజామాస్టారు జన్మదిన వేడుకలు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర స్థాయి నాయకత్వ శిక్షణా కేంద్రం(డైరెక్టర్), రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దాసరి రాజా మాష్టారు జన్మదిన వేడుకలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. శ్రీవికాస్ విద్యా సంస్థల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలోని 36 నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామంలో రాజా మాష్టారు వద్ద శిక్షణ పొందిన వేలాదిమంది కార్యకర్తలు ఉన్నారన్నారు. వారంతా ఈ రోజున తెలుగుదేశం పార్టీకి కొండంత అండగా నిలిచారని, క్రమశిక్షణకు, పార్టీ పట్ల విధేయతకు రాజా మాష్టారు పెట్టింది పేరని, అటువంటి నాయకుడు రానున్న రోజులలో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్లెంపూడి, మహంకాళి, బత్తిన, యర్రగోపు, వాణి, నవీన్, గలబా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ఇచ్చే గుర్తింపు కార్డులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని గీత కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం గీత కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కల్లుగీత కార్పొరేషన్‌ను నీరా కార్పొరేషన్‌తో కలిపి ఏర్పాటు చేసి వృత్తిదారులు వ్యాపారం చేసుకునేందుకు రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్ మాట్లాడుతూ గీత కులాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోన్నదని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విచ్చలవిడిగా గీత కులాలపై దాడులు జరిగాయన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ గీత కులాల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ గీత కులాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఈడిగ సంఘం అధ్యక్షుడు మేకల వేణుగోపాల్, రాష్ట్ర యాత సంఘం అధ్యక్షుడు అంగటి రాము, శ్రీశయన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోడ అప్పారావు, గీత కులాల సంక్షేమ సంఘం నాయకులు కంచర్ల వెంకటేశ్వరరావు, పేరం ఆదివిష్ణు, వీరవల్లి శ్రీనివాస్, వీరమల్లు సూరిబాబు, కంచర్ల కోటయ్య, జంపన సుధాకర్, యేమినీడి లక్ష్మీ శైలజ పాల్గొన్నారు. అంతకుముందు ముందు గీత కులాల ప్రతినిధులు గుంటూరు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.


ఐక్యత చాటుతున్న గీత కార్మిక నేతలు

సనాతన ధర్మంలో అన్న సమారాధనకు కీలక పాత్ర

● అరండల్ పేట శివాలయంలో దీక్షాస్వాములకు సద్ది, భిక్ష ప్రారంభం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంలో అన్న సమారాధనను మించిన సేవ కార్యక్రమం మరొకటి లేదని అయ్యప్ప సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ చెప్పారు. రాష్ట్ర అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో గుంటూరులోని అరండల్ పేట 4/4వ లైనులో ఉన్న శ్రీ హంపి విరూపాక్ష పీఠ పాలిత శివాలయంలో సోమవారం నుంచి అయ్యప్ప స్వాములు, దీక్షా స్వాములకు 41 రోజుల పాటు నిత్య అన్న సమారాధన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్‌తో ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యం, భాస్కర్ శర్మ, శ్రీనివాస్, నిత్య దాతలు డీఎస్ బాబు, బోయపాటి అరుంధతి, మన్నవ మేఘన, రేజేటి సతీష్, పెరుమాళ్ళ సాయి శ్రీనివాస్ సురేష్, పోలినేని ప్రసాద్, మిట్టపల్లి రాజేంద్ర బాబు, పెద్ది శ్రీనివాస్, ధనేకుల మోహన్, వడ్లమూడి రాంప్రసాద్, మేడేపల్లి రాము, మటుపల్లి సుబ్బారావు, సంగం శ్రీనివాస్ రెడ్డి, దేవరశెట్టి సురేష్, అట్ల జయభారత్రెడ్డి, పులివర్తి రాము, డప్పు నాగేశ్వరావు, శబరి, నాని, బాజీ, ఫణి, శ్రీను తదితరులు పాల్గొన్నారు


సద్ది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాదు, సిరిపురపు శ్రీధర్ శర్మ

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● పీజీఆర్ఎస్‌కు 260 వినతులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అందిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 260 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికంగా వస్తున్న ఫిర్యాదులపై ఆయా విభాగాల వారీగా మండల స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జాప్యంపై సదరు అధికారి నుంచి వివరణ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీపీవో నాగ సాయి కుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డీడీ సత్యనారాయణ చౌదరి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి పాల్గొన్నారు.


కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమస్యను వివరిస్తున్న ఏఎన్ఎంలు

పని భారం తగ్గించాలి : ఏఎన్ఎంలు

మాతృ, శిశు మరణాలు తగ్గించడం, వ్యాధి నిరోధక టీకాలు అందించడంతో పాటు, కమ్యూనికబుల్, నాన్ కమ్యూనికబుల్ , క్యాన్సర్, లెప్రసి, బడిపిల్లల కొరకు ఆర్బీఎస్‌కే సర్వేలతో ఫ్రైడే - డ్రై డే, కాన్పు సేవలు, వంటి అనేక వైద్య సంబంధిత సేవలతో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఎటువంటి సంబంధం లేని మున్సిపల్ సర్వేలు అప్పగించడం సరైనది కాదని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, ఏపీ హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొడ్డపాటి నాగవర్ధన్ అన్నారు. మున్సిపల్ సర్వే విధుల నుంచి ఏఎన్ఎంలకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతి పత్రం అందజేశారు. పెన్షన్ పంపిణీ తప్ప మిగిలిన మున్సిపల్ సర్వేలను కేటాయించవద్దని కలెక్టర్ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ నాయకులు షరీఫ్, నరేంద్ర బాబు, శ్రీకాంత్, పెన్ని, అరుణ్ బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మలేరియా విభాగంలో పనిచేసే సిబ్బందికి కేటాయించిన గదులను ఖాళీ చేసేందుకు కొంత సమయం ఇవ్వాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అర్జీ అందజేశారు. స్థానిక జూట్ మిల్ ఎదురుగా నగర పాలక సంస్థకు చెందిన నాలుగు గదుల్లో సిబ్బంది ఉంటున్నారని తెలిపారు. ఈ భవనాన్ని కూల్చివేసేందుకు అధికారులు నోటీసులు అందజేశారని, పైగా రాత్రికి రాత్రే సిబ్బందికి చెందిన సామాన్లు, లక్షల విలువచేసే పరికరాలను బయట పడేశారని అన్నారు.

● భారీగా పెంచిన వాహన ఫిట్‌నెస్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ సీఐటీయూ నాయకులు అర్జీ అందజేశారు. ఇప్పటికే గ్రీన్ ట్యాక్స్ పెంపు, పెట్రోల్, ఇన్సూరెన్స్ ప్రీమియం, వాహనాల బదలాయింపుపై చార్జీలను విపరీతంగా పెంచారని, దీనికి తోడు ఫిట్‌నెస్ చార్జీలను పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నన్నపనేని శివాజీ, బి.లక్ష్మణరావు, షేక్ మస్తాన్‌వలీ, టి.శ్రీరాములు తదితరులు ఉన్నారు.

● సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు అర్జీ అందజేశారు. వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, శీతాకాలం నేపథ్యంలో విద్యార్థులకు దుప్పట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో డాక్టర్ దారా అంబేద్కర్, మహా లక్ష్మయ్య, అబ్దుల్ ఖుర్దస్, దత్త ప్రసాద్ కటారి, నాగలక్ష్మి, భజరంగ్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

13, 14 తేదీల్లో కేఎల్‌పీ స్కూల్లో సూపర్ క్విజ్ పోటీలు

గుంటూరు (విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో ఈనెల 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి సూపర్ క్విజ్, స్పెల్ బి పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ తెలిపారు. సోమవారం పోస్టర్స్ ఆవిష్కరించారు. డాక్టర్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 8, 9, 10 తరగతిలో విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోటీల్లో స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. కరెంట్ అఫైర్స్, పుస్తక రచయితలు, అవార్డులు, రివార్డులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, జాతీయ, అంతర్జాతీయ సంస్థల వివరాలు, విజువల్ రౌండ్, రాపిడ్ ఫైర్ రౌండు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 9948227362 నెంబర్లో సంప్రదించాలని సూచించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

సమాజాభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కలిగించాలి

గుంటూరు (విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చినపలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే ప్రత్యేకసేవా శిబిరం సోమవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రత్యేక శిబిరాన్ని గ్రామ కార్యదర్శి విజయశ్రీ ప్రారంభించారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు గ్రామాన్ని సందర్శించి మహిళల ఆరోగ్యం, విద్యపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి డాక్టర్ హెచ్. భవాని పాల్గొన్నారు.

జనసేన పార్టీని కించపర్చలేదు : బోనబోయిన

గుంటూరు మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన యాదవ సంఘం సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పంగా మారినట్లు గుర్తించానని, జనసేన పార్టీ వర్గాలు దీనిని అన్యధా భావించవద్దని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బోనబోయిన మాట్లాడుతూ కుల సంఘం సమావేశంలో కొద్దిగా ఉత్సాహంగా మాట్లాడిన సందర్భంలో జరిగిన పొరబాటు ఇదని, అయితే తాను జనసేన పార్టీని కించపర్చలేదని, కొందరు పని గట్టుకొని తాను పార్టీని కించపరుస్తూ మాట్లాడినట్లు సోషల్ మీడియాలో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పీ.బాలయ్య, కొండూరి కిషోర్ కుమార్, జెట్టి బాబు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధి చెందడం ఇష్టం లేదా?

● అంబటికి బీజేపీ కిసాన్ మోర్చా నేత విఠల్ సూటి ప్రశ్న

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రపంచంలో మేటి నగరంగా అభివృద్ధి చెందడం వైసీపీ నాయకుడు అంబటి రాంబాబుకు, ఆ పార్టీకి కంఠగింపుగా మారిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు వీ పాండురంగ విఠల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందడం ఏమాత్రం వైసీపీకి ఇష్టం లేనట్లుగా అంబటి వ్యాఖ్యలు న్నాయన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తుంటే అంబటి లాంటి వైసీపీ నేతలు అడ్డు పడుతున్నారన్నారు.

అమరావతిలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరు మీద అమరావతి రాజధాని ప్రాంతంలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు కోరారు. మంగళగిరి, టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపి మ్యూజియంకు రాజధానిలో 4 హెక్టార్ల స్థలాన్ని కేటాయించాలని లోకేశ్‌ను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్, ఫౌండేషన్ సభ్యులు అప్పారావు, హనుమంత్ రావు, డాక్టర్ యర్రా నాగేశ్వర రావు, షేక్ లాల్ వజీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భగవద్గీత పారాయణం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 1: గీతా జయంతి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం భగవద్గీత పారాయణం వైభవంగా జరిగింది. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి నిర్వహణలో సత్సంగ సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, దేవాలయ కమిటి సభ్యుల పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బారా ఇమామ్ పంజా ప్రాంతం నుంచి మొఘల్ జరీనా బేగం (36) అదృశ్యమైంది. ప్రకాశం జిల్లా మార్కాపురంనకు చెందిన జరీనా బేగంకు మతిస్థిమితం సరిగా ఉండదు. బంధువుల ఇంటికి వచ్చి సోమవారం మధ్యాహ్నంనుంచి కనిపించకుండా వెళ్ళిపోయింది. సయ్యద్ తుమ్మల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోతో సౌత్ డీఎస్పీ భానోదయ, సీఐ వంశీధర్

దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

● మూడు ద్విచక్ర వాహనాలను... ఒక ఆటో స్వాధీనం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మోటార్ వాహనాల దొంగతనాలు... దారి దోపిడీలకు పాల్పడుతున్న వికాస్‌నగర్ 2వ లైనుకు చెందిన ఉప్పుతల శ్రీకాంత్(21)ని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నల్లపాడు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సౌత్ డీఎస్పీ భానోదయ వివరాలు వెల్లడించారు. మిర్చి యార్డు సమీపంలో ఈనెల 23న ఒంటరిగా వెళ్తున్న ఒక వ్యక్తిని బెదిరించి, అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, డబ్బులు దోపిడి చేశాడు. ఈ కేసులో సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో ఎస్సై మహేష్‌కుమార్ దర్యాప్తు జరిపి వికాస్‌నగర్ 2వ లైనుకు చెందిన ఉప్పుతల శ్రీకాంత్ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. అలాగే తన స్నేహితుడు ఐజాక్‌తో కలసి దొంగతనాలకు పాల్పడుతున్నట్టు విచారణలో తేలింది. నల్లపాడు, పట్టాభిపురం, మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన కేసుల్లో ఒక సెల్ ఫోన్, మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను నిందితుడి వద్ద నుండి స్వాదీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ వంశీధర్, ఎస్ఐ మహేష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు, కానిస్టేబుళ్లు భిక్ష నాయక్, మస్తాన్ వలి, సాంబశివరావులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి రివార్డులు ప్రకటించారని సౌత్ డీఎస్పీ భానోదయ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరు నిందితుల....

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.... పాత గుంటూరు యాదవ బజారుకు చెందిన మహంకాళి శివ మణికంఠ, నెహ్రూనగర్ కు చెందిన భేటీ బద్రినారాయణ ఇద్దరు స్నేహితులుగా తిరుగుతుంటారు. గంజాయి తాగుడుకు అలవాటు పడ్డారు. పాత గుంటూరు పోలీసులకు అందిన సమాచారం మేరకు కాకాని రోడ్డులోని ఉన్న ఖాళీ స్థలంలో ఆకస్మిక దాడులు నిర్వహించి ఈ ఇద్దరిని అదుపు తీసుకుని వారి వద్ద నుంచి 1160 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపరచుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతగుంటూరు సీఐ వెంకట ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార ముఠాపై టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు

● ముగ్గురు మహిళలు సహా ఏడుగురు అరెస్టు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందం కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోనీ గాంధీ పార్క్ వెనుక ఉన్న ఒక లాడ్జిపై దాడి చేశారు. అక్కడ ఆర్గనైజింగ్ వ్యభిచారం నిర్వహిసున్న ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 సెల్ ఫోన్లను సీజ్ చేసి, తదుపరి చర్యల నిమిత్తం పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ జాగిలం 'రెమో'కు లాంఛనాలతో అంత్యక్రియలు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా భద్రతా విభాగంలో సుమా రు 12 సంవత్సరాలపాటు క్రమశిక్షణ, నిబద్ధతతోసేవలు అందించి 2025లో విరమణ పొందిన పోలీస్ జాగిలం 'రెమో' అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. 'పేలుడు పదార్థాలను పసిగట్టే జాగిలం'గా జిల్లా పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించిన "రెమో" వీఐపీ, వీవీఐపీ బందోబస్తుల్లో, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీల్లో సమర్థవంతంగా పాల్గొని సేవలందించింది. 'రెమో' మరణం పట్ల ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం వ్యక్తం చేసి దాని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం అదనపు ఎస్పీ ఏ.హనుమంతు ఆధ్వర్యంలో పోలీస్ గౌరవ లాంఛనాలతో నివాళులర్పించి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, శివరామకృష్ణ, సురేష్ , ఆర్ఎస్ఐలు యేసు రాజు, రాజారత్నం, పోలీసులు పాల్గొన్నారు.

మనవరాలిపై విశ్రాంత ప్రిన్సిపాల్ లైంగిక వేధింపులు

అరండల్‌పేటలో నివాసం ఉంటున్న ఓ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ కొంతకాలంగా తన మనవరాలి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు ఆమెకు మూడేళ్ల వయసులో ఉన్న సమయంలో మనస్పర్థలు కారణంగా విడిపోయారు అప్పటి నుంచి బాలిక నానమ్మ, తాతయ్య వద్ద పెరుగుతోంది. ప్రస్తుతం బాలిక పదో తరగతి చదువుతోంది తన పట్ల తాత అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో ఆమె తన తల్లికి చెప్పింది. దీంతో సోమవారం వారు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

రెండేళ్లుగా అద్దె చెల్లించకుండా ఏఆర్ ఎస్ఐ దౌర్జన్యం

ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న తిరుమలశెట్టి కుమార్ స్వామి అనే వ్యక్తి రెండేళ్లుగా అద్దె చెల్లించకుండా తమను వేధిస్తున్నాడని, అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని వృద్ధురాలైన ఇంటి యజమాని గోవిందు నిర్మలాదేవి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఆయన పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకొని తనకు రావాల్సిన అద్దె బకాయి మొత్తం చెల్లించి ఫ్లాటు ఖాళీ చేయించాలని ఆమె తన ఫిర్యాదులో కోరారు.


బీఆర్ స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

బీఆర్ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ స్టేడియం సత్వర అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బీఆర్ స్టేడియాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వాకర్స్‌తో మాటామంతీ కలిపి బీఆర్ స్టేడియంలో అవసరమైన అభివృద్ధి పనుల గురించి అడిగి ఆయన తెలుసుకున్నారు. సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్‌స్టేడియంలో శిథిలావస్థకు చేరిన బిల్డింగ్‌ను కూల్చివేయాలని అధికారులకు ఎమ్మెల్యే నసీర్ సూచించారు.

సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

సంక్షేమానికి అసలైన చిరునామా కూటమి ప్రభుత్వమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని అహ్మద్ నగర్, రాజావారి తోటలో సోమవారం సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఒకటో తేదీ వచ్చిందంటే అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగుల చిరునవ్వులు కనిపిస్తాయని, ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి, కార్పొరేటర్ పోతురాజు సమత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పెన్షన్ పేదలకు కొండంత అండ : మేయర్


పెన్షన్ల పంపిణీ చేస్తున్న నగర మేయర్ రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా వారికి కొండంత భరోసానిస్తుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. సోమవారం నగరంలోని 33వ డివిజన్‌లోని దేవాపురంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని అర్హులైన వృద్ధులకు పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను రూ.4 వేలు చేసి పెన్షన్ దారులకు అండగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 33వ డివిజన్ అధ్యక్షుడు పోపూరి నరేంద్ర, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కసుకుర్తి హనుమంతరావు, రాష్ట్ర తెలుగు యువత నాయకులు పెద్ది విక్రమ్, యన్.డి.ఏ కూటమి నాయకులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పరీక్ష చేయించుకోండి... సురక్షితంగా ఉండండి : కలెక్టర్



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పరీక్ష చేయించుకొని ఎటువంటి అపోహలు లేకుండా సురక్షితంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'హెచ్ఐవీ పరీక్ష చేయించుకోండి- సమాచారం కలిగి ఉండండి- సురక్షితంగా ఉండండి' అనే నినాదంతో ఈ ఏడాది నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య అధికారి కె.విజయ లక్ష్మి మాట్లాడుతూ, ప్రతి గర్భిణి తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్ష చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజా వలి, డీఐవో డాక్టర్ శ్రావణ్ బాబు, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.సుజాత, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షేక్ ఇస్మాయిల్, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ జ్యోతుల వీరస్వామి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న కుమారి, శ్రీనివాసరాజు, శ్రీవిద్య, టీజేపీఎస్ కాలేజీ, జేఎంజే కాలేజీ, మహిళ కళాశాల, జేకేసీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

● హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గైనకాలజిస్ట్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా సోమవారం నగరంలోని సెయింట్ జోసెఫ్స్ కళాశాలలో నిర్వహించిన హెచ్ఐవీ/ఎయిడ్స్ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆమె హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుంచి నాజ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ స్వరూప, ప్రిన్సిపాల్ రాణి, లీగల్ అడ్వైజర్ సరితా, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ వారు షాపు నేల మట్టం చేశారు

గుంటూరు డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తాలూకా సెంటర్లో తాను నిర్వహిస్తున్న వస్త్ర దుకాణాన్ని మున్సిపాలిటీ వారు నిబంధనల విరుద్ధంగా రోడ్డు విస్తరణ పేరుతో నేలమట్టం చేశారని, దీంతో తాను 30 లక్షల వరకు నష్టపోయి రోడ్డున పడ్డానని శ్రీనగర్‌కు చెందిన మేడూరి వెంకట సీతారామయ్య వాపోయారు. సోమవారం ఆయన ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. చల్ల చంద్రశేఖరరావు వద్ద తాను షాపు 2023లో లీజుకు తీసుకొని వస్త్ర దుకాణం పెట్టానన్నారు. అయితే ఆ షాపు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం వారిదని తనకు తెలియదన్నారు. వారికి, చంద్రశేఖర్‌కు మధ్య షాప్ విషయంపై కోర్టులో వివాదం నడుస్తుందన్నారు. మున్సిపల్ సిబ్బంది, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు ఏకమై రోడ్డు విస్తరణతో సంబంధం లేని తన షాపు మొత్తాన్ని నేలమట్టం చేశారని ఆయన వాపోయారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

తన ఇరువురు పిల్లలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రవితేజ, శిరీష దంపతులు తన నుంచి ఐదు లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశారని కొత్తపేట పరిధిలోని గణేష్ రావు వారి వీధికి చెందిన పి.శాంతి స్వప్న సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనను మోసం చేసిన రవితేజ, శిరీషలపై తగు చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

దివంగత వైవీ సురేష్ ఆస్తి కబ్జాకు యత్నం

బలహీన వర్గాల జేఏసీ నాయకుడు దివంగత వైవీ సురేష్‌కు చెందిన ఆస్తిని కబ్జా చేసేందుకు బంధువు గిరి ప్రయత్నిస్తున్నాడని ప్రజాసంఘాల నాయకులు, సురేష్ తల్లి, కూతురు సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. వైవీ సురేష్ 2022లో మృతి చెందాడని, ఆ తరువాత ఏడాదికి భార్య హనుమాయమ్మ కూడా కన్నుమూసిందన్నారు. ఈ క్రమంలో వారి 8 ఏళ్ల కూతురు అమృతవల్లి నాయనమ్మ భ్రమరాంబ వద్ద పెరుగుతుందన్నారు. అయితే కొద్దిరోజుల క్రితం హనుమాయమ్మ తమ్ముడు గిరి ఆస్తిలో తాను హక్కు దారుడినంటూ చంపుతానని బెదిరిస్తున్నాడని తగిన న్యాయం చేయాలని వారు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.

నకిలీ బంగారం అంటగట్టి రూ.7 లక్షలతో పరార్

తవ్వకాల్లో బంగారం బయట పడిందని, తక్కువ ధరకే విక్రయిస్తామంటూ నకిలీ బంగారం అంటగట్టి దుండగుడు పరారయ్యాడు. నెహ్రూనగర్‌లో సెలూన్ షాపు నిర్వహించే సురేష్‌కు తాను కర్ణాటక నుంచి మాట్లాడుతున్నానని, తమ ఇంటి తవ్వకాల్లో బంగారం బయట పడిందని, తక్కువ ధరకే విక్రయిస్తానని చెప్పాడు. తన వద్ద 250 గ్రాముల బంగారం ఉందని రూ.15 లక్షలకే ఇస్తానని చెప్పాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేదని రూ.7 లక్షలే ఉన్నాయని, అది కూడా గుంటూరు వస్తే ఇస్తానని సురేశ్ చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి గుంటూరు వచ్చి సురేశ్‌కు నకిలీ బంగారం అంటగట్టి రూ.ఏడు లక్షలు తీసుకొని ఉడాయించాడు. కొత్తపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

5న మెగా పీటీఎం 3.0

● అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నిర్వహణ ● తల్లిదండ్రులతో పిల్లల ప్రగతిపై చర్చ



నరసరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 3.0 కార్యక్ర మాన్ని డిసెంబరు 5న నిర్వహించనున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, గిరిజన, సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో పీటీఎం జరగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వ విద్యాసంస్థలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, దాతలు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్ పర్సన్లు, సభ్యులు, అధికారులు అందరూ పాల్గొంటారు.

● పిల్లల ప్రగతిపై చర్చ

పీటీఎంలో పిల్లల ప్రగతిపై చర్చ జరుగుతుంది. ప్రతి ఒక్క స్కూల్లో పిల్లల అకడమిక్ అభివృద్ధి, గత కొన్ని నెలల్లో వారు స్కూల్లో నేర్చుకున్న అకడమిక్స్ వివరాలు, వారి ప్రోగ్రెస్ కార్డ్, మార్కులు తల్లిదండ్రులతో చర్చిస్తారు. ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) సభ్యులు తల్లిదండ్రులతో కలిసి స్కూల్ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఒక్కొక్క స్కూల్‌కు హాజరు కావాలని, అందుకు సంబంధించిన మ్యాపింగ్ కూడా జరుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి, విద్యార్థుల విద్యా స్థాయిపై తల్లిదండ్రులకు అవగాహనకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పీటీఎంను ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు.

● హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టుల అందజేత

ఈ కార్యక్రమంలో విద్యార్థుల హోలీస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తారు. చిన్న పిల్లలకు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి వాటిపై అవగాహన ఉందా లేదా అనే అంశాలు తల్లిదండ్రులతో చర్చిస్తారు. తదుపరి మూడు నెలల క్యాంపెయిన్ కింద ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్‌ను ముందుకు తీసుకెళ్లే కార్యాచరణ కూడా వివరిస్తారు. డిసెంబరు 5 నాటికి 10వ తరగతి సిలబస్ చాలా వరకు పూర్తవుతుంది. ఆ తర్వాత 100 రోజుల ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్ గురించి తల్లిదండ్రులతో చర్చిస్తారు. విద్యార్థులు ఆరోగ్య స్థితిగతులపై తల్లిదండ్రులకు తెలియజేస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనుంది. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి డొక్కా సీతమ్మ భోజన కార్యక్రమంలో సహపంక్తి భోజనాన్ని చేయనున్నారు. ప్రతి ఒక్క తల్లిదండ్రి తమ పిల్లలతో పాటు ఈ మెగా పీటీఎంకు తప్పకుండా హాజరు కావాలని, అప్పుడే వారికి తమ పిల్లల ప్రోగ్రెస్ గురించి అవగాహన కలుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఇళ్లులేని గ్రామీణ పేదలకు గృహ నిర్మాణ సహాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత నెల 30వ తేదీతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ పథకం గడువు ముగిసినప్పటికీ ఆ గడువును మరో 14 రోజులు అదనంగా పెంచింది. దీంతో అర్హులైన పేదలకు గృహ నిర్మాణ సహాయం పొందేందుకు మరో అవకాశం లభించినట్లయింది.



పీఎంఏవై గడువు పొడిగింపు

● మరో 14 రోజులు పొడిగించిన ప్రభుత్వం
● సచివాలయ సిబ్బందితో విస్తృత స్థాయిలో సర్వే
● అర్హులైన ప్రతి ఒక్కరినీ జాబితాలో చేర్చడమే లక్ష్యం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలను గుర్తించి వారిని పీఎంఏవై పరిధిలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గుంటూరు జిల్లాలో 15 వేల మంది, బాపట్ల జిల్లాలో 25 వేల మంది, పల్నాడు జిల్లాలో 50 వేల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారని గృహనిర్మాణ శాఖ అధికారులు అంచనా వేశారు. పీఎంఏవై 2025 గ్రామీణ పథకం 2028-29 వరకూ అమలు కానున్న నేపథ్యంలో ఆలోపు మళ్లీ గృహ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. అందువల్ల ఇప్పుడే వీరందరినీ ఈ పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ఈ ప్రక్రియ పూర్తికాలేదు. నవంబరు నెలాఖరునాటికి గుంటూరు జల్లాలో 10వేలు, బాపట్ల జిల్లాలో 18,500, పల్నాడు జల్లాలో 25వేల మందికి పైగా పీఎంఏవై గ్రామీణ పథకం పరిధిలోకి వచ్చారు. మిగిలినవారిని కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపట్టారు.

● సచివాలయ సిబ్బందితో సర్వే..

ఇళ్లు లేని గ్రామీణ ప్రాంత పేదలు భారీ సంఖ్యలో ఉన్నప్పటికీ వారిలో మెజారిటీ ప్రజలకు స్థలం లేదు. అలాంటివారిని కూడా పథకం పరిధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సచివాలయ ఉద్యోగులతో సర్వే చేపట్టి, ఇంటి స్థలం లేనివారితో కూడా పీఎంఏవై పథకానికి దరఖాస్తు చేసుకునేలా చేసింది. అయితే ఈ ప్రక్రియ నవంబరు నెలాఖరు నాటికి పూర్తి కాకపోవడంతో మరో 14 రోజులు గడవును పొడిగించింది. అర్హులను గుర్తించి, వారిని తక్షణం పీఎంఏవైకి దరఖాస్తు చేసుకునేలా సచివాలయ ఉద్యోగులను పరుగులు పెట్టిస్తోంది.

● గృహ రుణ సదుపాయం ఇలా..

పీఎంఏవై పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.2,50,000 రుణం అందజేస్తున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ. 1.50 లక్షలు కాగా రాష్ట్రం వాటా రూ.లక్షగా ఉంటుంది. దీన్ని నాలుగు దశల్లో అందజేస్తారు. దీంతోపాటు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కన్వర్జెన్స్ కింద 90 రోజుల కూలీ, టాయిలెట్ నిర్మాణం కోసం ఇచ్చే రూ. 12వేలు కలిపి మొత్తం 39 వేలు అదనంగా ఇవ్వనున్నారు. స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికిపైన ప్రకటించిన ఆర్థిక సహాయం అందజేస్తారు. ఇంటి స్థలం లేనివారికి 3 సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం అందజేస్తారు.

● ఆర్థిక సహాయం ఇలా..

నిర్మాణ దశ	నిధుల విడుదల
పునాది దశ	రూ. 60,000
గోడల దశ	రూ. 60,000
స్లాబ్ దశ	రూ. 60,000
తుది దశ	రూ. 70,000
మొత్తం	రూ.2,50,000

● కావాల్సిన పత్రాలు..

ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ లింకైన బ్యాంకు పాస్‌బుక్, స్థలం ఉంటే భూమి పట్టా, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మొబైల్ నెంబరు.

షట్‌డౌన్..!

● తుఫాన్ ప్రభావాల పేరిట బీచ్‌ల మూసివేత
● సన్నద్ధత ఉండాలే గాని... నిషేధం ఏంటనే ప్రశ్నలు
● పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం
● వందల మంది ఉపాధిపై పరోక్షంగా దెబ్బ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

తుఫాన్ హెచ్చరికలు రాగానే తొలి వేటు పర్యాటకంపైనే పడుతోంది. ఇటీవల విరుచుకుపడిన మొంథా తుఫాన్ కానీ, ప్రస్తుతం దిత్వా విషయంలో కానీ జరుగుతున్నది ఇదే. అప్రమత్తం పేరిట ఏకంగా తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే ఆదేశాలు జారీ చేయడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ముఖ్యంగా సన్నద్ధతకు, నిషేధానికి మధ్య ఉన్న తేడాను గుర్తించడంలో యంత్రాంగం గాడి తప్పుతోందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

● మరో గోవాగా విరాజిల్లడానికి అవకాశం

జిల్లాలో సుదూర తీర ప్రాంతం ఉంది. పర్యాటకంగా మరో గోవాగా విరాజిల్లడానికి బాపట్ల జిల్లాకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వారాంతాల్లో బాపట్ల, చీరాల బీచ్‌లకు వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కొంచెం ప్రభుత్వం వైపు నుంచి ప్రోత్సాహం ఇస్తే పర్యాటక రంగంలో గణనీయంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు జిల్లా అభివృద్ధికి టూరిజం గ్రోత్ ఇంజన్‌లా ఉపయోగపడనుందని పాలకులు పలు వేదికలపై ప్రకటించిన సంగతి తెలిసిందే. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా బీచ్‌ల విషయంలో అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు విమర్శలకు దారి తీస్తున్నాయి.

● కీలకమైన కార్తికమాసంలో...

జిల్లాలో ఉన్న సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లకు పవిత్ర కార్తికమాసంలో లక్షల సంఖ్యలో భక్తులు, పర్యాటకులు పోటెత్తుతుంటారు. అదే సమయంలో మొంథా విరుచుకుపడిన సంగతి తెలిసిందే. తుఫాన్ ప్రభావం తగ్గిపోయిన తర్వాత వారం రోజుల వరకు కూడా జిల్లాలో బీచ్‌లు మూసివేసే ఉన్నాయి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో గోతులు ఏర్పడ్డాయని, పర్యాటకులకు అనుమతిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అప్పుడు అధికారులు చెప్పారు. సాంకేతికంగా ఇందులో వాస్తవం ఉన్నా, తగు జాగ్రత్తలతో కనీసం జల్లు స్నానాలకు అయినా అనుమతిస్తే పవిత్రమైన కార్తికపౌర్ణమి తీరంలో వైభవంగా జరిగి ఉండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. ఇప్పుడు తాజాగా దిత్వా ప్రభావంతో ఓ వైపు చిరుజల్లులు మాత్రమే ఆది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా కురిశాయి. కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతంలో పర్యాటకులకు అనుమతి లేదనే నిర్ణయం తీసుకున్నారు



● ఆ స్థాయి తీవ్రత లేకుండానే..

పర్యాటకుల భద్రతకే తొలి ప్రయారిటీ. ఇందులో రెండో అభిప్రాయానికి అవకాశం ఉండకూడదు. కానీ ఆ స్థాయి తీవ్రత లేకుండానే ఏకంగా రోజుల తరబడి బీచ్‌ల మూసివేత నిర్ణయాలు తీసుకోవడమే తప్పుబట్టేదిగా ఉంది. తుఫాన్‌లు జిల్లా పరిధిలో తీరం దాటడం సందర్భాలు మినహాయిస్తే మిగిలిన వేళల్లో ఎక్కువ శాతం భారీ వర్షాలకే ఆస్కారం ఉంటుంది. ఒక వేళ అంచనాలకు మించి వర్షాలు కురిస్తేనో లేక ఈదురుగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటేనో నాలుగైదు గంటల ముందు ఆ తీవ్రతను బట్టి బీచ్‌లు ఖాళీ చేయించే సన్నద్ధత మన వ్యవస్థలకు లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. తుఫాన్ ప్రభావం అనగానే పర్యాటకుల ప్రవేశంపై నిషేధం విధిస్తే మేలనే అభిప్రాయానికి రావడం అంటే ఓ విధంగా బాధ్యతల నుంచి తప్పుకోవడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి

● ఇలా అయితే పర్యాటకం కష్టమే...

ఏడాదిలో పదుల సంఖ్యలో తుఫాన్‌లు జిల్లాను పలకరిస్తుంటాయి. కొన్ని తీవ్రతతో, మరికొన్ని నామమాత్రంగా ప్రభావం చూపుతుంటాయి. ప్రతిసారీ బీచ్‌ల మూసివేత నిర్ణయం తీసుకుంటే పర్యాటకం అభివృద్ధితో పాటు స్థానికంగా వందల మంది ఉపాధిపై దెబ్బ పడుతోంది. తీర ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను మరింతగా పెంచే చర్యలపై దృష్టి పెట్టాలి అంతే కానీ ముందస్తు జాగ్రత్తల పేరిట తీరప్రాంతాన్ని మూసివేయడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

(5వ పేజీ తరువాయి)

చెల్లించాలి. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రూ.25.03 కోట్లు బకాయిలున్నాయి. గుంటూరులో ప్రభుత్వ కళాశాలకు సంబంధించి రూ.2.98 కోట్లు ఆస్తి పన్ను బకాయి 2019 నుంచి చెల్లించాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి రూ.1.73 కోట్లు 1993 నుంచి బకాయి ఉంది. తెనాలి మునిసిపాల్టీలో రూ.1.98 కోట్లు, మంగళగిరి - తాడేపల్లిలో రూ.1.42 కోట్లు, పొన్నూరు మునిసిపాల్టీలో రూ.60 లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

బకాయి భారం

కోర్టు కేసుల్లో ఆస్తి పన్ను వివాదాలు

ఆస్తి పన్ను విధించడంలో లోపాలను సవరించాలని భవన యజమానులను కోర్టులను ఆశ్రయించారు. దీంతో ఆయా భవనాలకు సంబంధించి పన్ను వసూలు నిలిచిపోయింది. పిటిషన్ దారులు పేర్కొన్న అంశాలను పరిష్కరించి కోర్టులో కేసులు ఉపసంహరించు కొనే దిశగా అధికారుల చర్యలు లేవు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే కేసుల సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపడితే పెద్ద ఎత్తున పన్ను వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. మూడు జిల్లాల్లో రూ.19.02 కోట్లు కోర్టు వివాదాల వల్ల పన్ను బకాయిలు పేరుకుపోయాయి. గుంటూరు జిల్లాలోని కార్పొరేషన్‌తో సహా మునిసిపాల్టీల్లో రూ 7.52 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ 9.73 కోట్లు, బాపట్ల జిల్లాలో రూ 1.77 కోట్లు బకాయిలు ఉన్నాయి. తెనాలి మునిసిపాల్టీలో 31 కేసుల వల్ల రూ.2.98 కోట్లు పన్ను వసూలు నిలిచిపోయింది. గుంటూరు కార్పొరేషన్‌లో 66 కేసులు కోర్టుల్లో ఉన్నాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీలో రూ.9.58 కోట్లు కోర్టు వివాదాల వల్ల బకాయిలు ఉన్నాయి. 6,045 అసెస్‌మెంట్‌లకు సంబంధించి కోర్టులలో పిటిషన్‌లు దాఖలయ్యాయి. కోర్టులో ఉన్న కేసులను పరిష్కరించుకొని ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయడంతో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

● వరుస ప్రమాదాలతో భయాందోళన
● స్త్రీ శక్తి పథకంతో మరింత పెరిగిన రద్దీ

బస్టాండ్‌లో...అటో..ఇటో..ఎటో...

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో ప్రయాణికుల రాకపోకలు గందరగోళంగా మారాయి. ప్రయాణికులు ఎటు వెళుతున్నారో.. ఎటు నుంచి ఏ బస్సు వస్తుందో, ఏం ప్రమాదం జరుగుతుందో అనే పరిస్థితులు నెలకొన్నాయి. కనీస సూచికలు లేకపోవటంతో పాటు ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల గుంటూరు బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు కింద పడి మృతి చెందగా.. తాజాగా ఓ విద్యార్థినిని విజయవాడ సెక్టార్‌లో బస్సు ఢీ కొంది. ఈ పరిస్థితులలో ఎటు నుంచి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్టాండ్‌లపై అధికారుల అలసత్వం, కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక బస్టాండ్‌లలో రద్దీ రెట్టింపయింది. ఇక పండగలు, ఆదివారం వంటి సెలవు దినాల్లో రద్దీ మరింత అధికంగా ఉంటోంది.

● బస్సులో సీటు కోసం పాట్లు

స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక మహిళల రద్దీ బాగా పెరిగింది. మహిళలు 80 శాతం ఉంటే పురుషులు 20 శాతం వరకు ఉంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. బస్టాండ్‌లలో ప్లాట్‌ఫాం వరకు బస్సు రాకముందే సీటు కోసం ప్రయాణికులు బస్సుకు ఎదురెళ్తున్నారు. ఆ సమయంలో ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని డ్రైవర్‌లు, కండక్టర్‌లు ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రయాణికులను అదుపు చేసేందుకు బస్టాండ్‌లో కంట్రోలర్స్ కొరత ఉందని చెబుతున్నారు. గతంలో ఉన్న హోంగార్డులను తొలగించారు. దాంతో బస్టాండ్‌లలో పరిస్థితులను అదుపు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇక ప్రైవేటు వాహనాలు కూడా హల్‌చల్ చేస్తున్నాయి. బస్టాండ్‌లలో ప్రయాణికుల రద్దీ అదుపు చేయటంతో పాటు మౌలిక వసతులపై ప్రజా రవాణాధికారులు దృష్టిసారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సులో సీట్ల కోసం పోటీపడుతున్న ప్రయాణికులు



బస్టాండ్ ప్రాంగణంలో గందరగోళంగా ప్రయాణికుల రాకపోకలు

డిసెంబరు 20న శ్రీనివాసుని కల్యాణం

పిడుగురాళ్లలో స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన శ్రీనివాసుని కల్యాణం పిడుగురాళ్లలో నిర్వహించనున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం టీటీడీకి చెందిన మల్లికార్జునరావు, మరికొంత మంది అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని స్థానిక జడ్పీ హైస్కూల్, కన్యకాపరమేశ్వరి దేవాలయం ముందు ఉన్న ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని విలేకరులతో మాట్లాడుతూ, 2014-19 మధ్య కాలంలో పిడుగురాళ్లలోని జడ్పీ స్కూల్‌లో ఒకసారి శ్రీనివాసుని కల్యాణం నిర్వహించామని, ఇప్పుడు రెండోసారి జరుపనున్నామన్నారు. అనంతరం గురజాల పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల పత్రికలను ఎమ్మెల్యే యరపతినేని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గురజాల డీఎస్పీ జగదీష్, మున్సిపల్ చైర్మన్ కెవి.సుబ్బారావు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, యేలూరి చంద్రశేఖర్, కనిగిరి శ్రీను, కొత్త రఘురామయ్య, పాండురంగ శ్రీను, జూలకంటి సుబ్రహ్మణ్యం, పసుమర్తి సుబ్రహ్మణ్యం, గుండా రామారావు, లఘువరపు రామనాధం, కొత్త శివయ్య, యేలూరి శశికుమార్, కొలిశెట్టి సుబ్బారావు, కొత్తూరి ఆంజనేయులు, చందోలు రామకృష్ణారావు, వివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

విద్యార్థులు మస్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టెస్లా ఫౌండర్ ఎలాన్ మస్క్‌ను, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పది రోజుల క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, బీటెక్ చదివిన విద్యార్థులలో చాలా కాంపిటీషన్ ఉందని వాటిని అధిగమించి ఉద్యోగ అవకాశాలు సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ లింగరాజు మాట్లాడుతూ ఈ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని, వర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం డ్రీమ్ ప్యాంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ సీఈవో శ్రీధర్ జలపాటితో పాటు ఇంగ్లీషు ట్రైనర్ గోపీ, ఆప్టిట్యూడ్ ట్రైనర్ హరిశంకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రోగ్రాం మేనేజర్ సాయి కిరణ్‌ను యూనివర్సిటీ యాజమాన్యం శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. వర్సిటీ అధికారులు శిక్షణ తీసుకున్న విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారని ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ రామినేని శివరాం ప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, అతిథి అధ్యాపకులు కె.పృధ్వీరాజ్, సాంకేతిక నిపుణులు అజయ్, కోడూరు కనకరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఫిట్‌నెస్

ఇంటి పనులు, ఆఫీసు పనులతో శరీరం ఎంతో కొంత అలసిపోతోంది కాబట్టి మహిళలు దాన్నే వ్యాయామంగా పరిగణిస్తూ ఉంటారు. కానీ శరీరం దృఢంగా ఉండాలంటే ప్రతి మహిళా తన వయసుకు తగిన వ్యాయామం తప్పనిసరిగా చేస్తూ ఉండాలి.

శరీరం ఇలా దారుఢ్యం

పెరిగి తరిగే హార్మోన్ల ప్రభావాలు, అదుపుతప్పుతున్న ఆహారపుటలవాట్లు, జీవనశైలులు, మారే సీజన్లు మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తూ ఉంటాయి. కాబట్టి టీనేజీ మొదలు, వృద్ధుల వరకూ ప్రతి మహిళా తమకు తగిన వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలి. అయితే ఏ ప్రాతిపదికన, ఏ అంశాల ఆధారంగా వ్యాయామ నియమాలను పాటించాలంటే...

ఏరోబిక్స్ ఇలా...

కొవ్వును కరిగించడమే ప్రతి వ్యాయామం ఉద్దేశం. ఏరోబిక్స్ సూత్రం కూడా అదే! ఈ వ్యాయామంతో శరీరంలోని ప్రతి కండరం సంకోచ వ్యాకోచాలకు లోనవుతుంది. దాంతో ఎక్కువ శక్తి ఖర్చవుతుంది. పురుషులతో పోలిస్తే మహిళల కీళ్లను పట్టి ఉంచే లిగమెంట్లు సున్నితంగా ఉంటాయి. కాబట్టి వాటి మీద ఎక్కువ ఒత్తిడి పడని టోనింగ్, బిల్డింగ్ వ్యాయామాలు మహిళలకు అనుకూలమైనవి. కొవ్వుని కరిగించి, కండరాల పటుత్వాన్ని పెంచే ఏరోబిక్స్



అనగానే సాధారణంగా మహిళలందరూ జంకుతూ ఉంటారు. జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేయడమే తేలిక అనుకుంటూ ఉంటారు. కానీ కీళ్ల సమస్యలు లేని ఏ వయసువాళ్లైనా ఏరోబిక్స్ చేయవచ్చు. వయసులవారీగా ఏరోబిక్ వ్యాయామాల తీవ్రతను ఎంచుకుంటూ ఉండాలి.

టీనేజర్లు అయితే: టీనేజర్లు పవర్ ఏరోబిక్స్ చేయాలి. చమటలు పట్టేలా వేగంగా కదిలే వ్యాయామాలు మేలైనవి. స్కిప్పింగ్, ఎత్తుకు ఎగిరి దూకే వ్యాయామాలు చేయవచ్చు. వెయిట్ లిఫ్టింగ్ కూడా చేయాలి. ట్రెడ్‌మిల్, సైక్లింగ్, క్రాస్ ట్రైనర్‌లు కూడా వాడాలి. అయితే ఖర్చయ్యే క్యాలరీలను మాంసకృత్తులతో భర్తీ చేస్తూ ఉండాలి. ఆహారంలో తేలికగా అరిగే కొవ్వులూ ఉండేలా చూసుకోవాలి. ఏరోబిక్స్‌లో స్టెప్పర్ వాడాలి.

మధ్యవయస్కులైతే: వీళ్లు వెయిట్ బేరింగ్, నాన్ వెయిట్ బేరింగ్ అనే రెండు రకాల పద్ధతులను వ్యాయామంలో అనుసరించాలి. మనం మన కాళ్ల మీద నిలబడి చేసే వ్యాయామాలు 'వెయిట్ బేరింగ్'. అలాకాకుండా కూర్చుని చేసే వ్యాయామాలు 'నాన్ వెయిట్ బేరింగ్'. వీటిలో తమకు తగిన వ్యాయామాలను మహిళలు ఎంచుకోవచ్చు. కూర్చుని చేసే వ్యాయామాలతో ఫిట్‌నెస్ పెంచుకోవాలంటే 'స్టాటిక్ సైక్లింగ్' (కదలకుండా తొక్కే సైకిల్) చేయాలి. ఆర్థ్రయిటిస్ ఉన్న మహిళలు బరువును అదుపులో ఉంచుకోవడానికి ఇదే ఉత్తమమైన వ్యాయామం. ఈ వ్యాయామం వల్ల కీళ్ల మీద బరువు పడదు. సైకిల్ తొక్కుతాం కాబట్టి వ్యాయామమూ అందుతుంది. 30 నుంచి 50 ఏళ్ల వయసు మహిళలు, ఆర్థ్రయిటిస్ లేని వాళ్లైతే స్టాటిక్ సైక్లింగ్‌కు బదులుగా రోడ్డు మీద సైకిల్ తొక్కవచ్చు.

50 ఏళ్లు పైబడితే: వీళ్లకు తేలికపాటి బేసిక్ ఏరోబిక్ వ్యాయామాలు ఉంటాయి. తక్కువ వేగంతో, ఎక్కువ సేపు ఏరోబిక్స్ చేయవచ్చు. ఏరోబిక్స్‌లో స్టెపర్ వాడకూడదు, ఎత్తు ఎగరడం, దూకడం చేయకుండా, చేతులు, కాళ్లను కదిలించేలా ఏరోబిక్స్ చేయాలి. దీంతోపాటు స్టాటిక్ సైక్లింగ్, వాకింగ్ సరిపోతుంది.

పెద్ద వయసు మహిళలకు యోగా

యోగా చేయాలనుకుంటే సులభమైన ఆసనాలు ఎంచుకోవాలి. శరీరాన్ని విపరీతంగా వంచి చేసే యోగాసనాల వల్ల లిగమెంట్లు దెబ్బతింటాయి. కాబట్టి వేరొకరిని అనుకరించకుండా తమకు నప్పే ఆసనాలే వేయాలి. ప్రాణాయామం చేయాలి. కీళ్ల నొప్పులు ఉండేవాళ్లు పద్మాసనంలో కూర్చుని చేసే వ్యాయామాలు మానేయాలి. ఎత్తులు ఎక్కి దిగే వ్యాయామాలు చేయకూడదు. వీలైతే నీళ్లలో నడుం కింది వరకూ మునిగి చేసే వ్యాయామాలు చేయాలి. ఈ వ్యాయామాల వల్ల కీళ్ల మీద బరువు పడకుండా ఉంటుంది.


నెలసరి సమయంలోనూ...

నెలసరి సమయంలో వ్యాయామం చేయకూడదనే నియమమేమీ లేదు. నెలసరి సమస్యలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలేవీ లేకపోతే ఆ సమయంలో కూడా నిస్సందేహంగా వ్యాయామం చేయవచ్చు. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నవాళ్లు, అనీమియా ఉన్నవాళ్లు ఆ సమస్యల నుంచి కోలుకున్న తర్వాత నెలసరి సమయంలో కూడా వ్యాయామాలు కొనసాగించవచ్చు.

ఆర్థ్రయిటిస్ ఉంటే?

ఆర్థ్రయిటిస్ ఉన్నా వ్యాయామాలు చేయవచ్చు. అయితే బరువులు ఎత్తే వ్యాయామాలు చేయకూడదు. నేల మీద కూర్చుని చేసే వ్యాయామాలు కూడా చేయకూడదు. ట్రెడ్‌మిల్ మీద నడిచేటప్పుడు అనుకూలంగా ఉండే వేగంలోనే నడవాలి. ట్రెడ్‌మిల్ గ్రేడ్ (ఎత్తు పెంచడం) వాడకూడదు. స్టాటిక్ సైక్లింగ్ చేసేటప్పుడు కూడా కీళ్ల మీద ఒత్తిడి పడకుండా చూసుకోవాలి.

లైఫ్ స్టైల్



సోఫాలు, దిండ్లు, పరుపులు ఎంత మెత్తగా ఉంటే అంత మంచివనుకుంటాం. సౌకర్యంగా ఉంటే చాలనుకుని, వాటి వాడకానికి అలవాటు పడిపోతాం. కానీ దైనందిన జీవితంలో ఉపయోగించే ఉపకరణాల విషయంలో కొన్ని నియమాలు పాటించాలి. కీళ్లు, కండరాలు శ్రమకు గురవకుండా ఉండడం కోసం ఎలాంటి ఉపకరణాలను ఎంచుకోవాలో, వాటి ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

ఉపకరణాలు... ఉపయోగకరంగా...

మనం ప్రతిరోజూ వాడుకునే ఉపకరణాలు నెమ్మది నెమ్మదిగా మన ఆరోగ్యాన్ని కుదేలు చేస్తూ ఉంటాయి. మన ఇళ్లలోని సోఫాలు మెత్తగా, సౌకర్యంగా ఉంటే చాలనుకుంటాం. పరుపులు, దిండ్లు వీలైనంత మందంగా, మెత్తగా ఉండేలా చూసుకుంటాం. కానీ అవి శరీర భంగిమలను పక్కదారి పట్టిస్తున్నాయా? అనే కోణంలో ఆలోచించం. వీటితో పొందే సౌకర్యానికి మించి, వాటి ఎత్తు, వాటిని వాడుకునే సమయంలో కీళ్ల మీద పడే ఒత్తిడుల మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి.

సోఫాలు ఎలా ఉండాలంటే...

చాలా మంది నేలకు అంటుకుపోయినట్టుండే సోఫాలను ఇష్టపడుతూ ఉంటారు. కూర్చోగానే అడుగుకి కుంగిపోయే అతి మెత్తని సోఫాలు, లేచి నిలబడడానికి ఇబ్బందిగా ఉండే సోఫాలు ఆరోగ్యకరం కాదు. సోఫాల తయారీలో ఉపయోగించే మెటీరియల్ కంటే సోఫా ఎత్తు, మెత్తదనం మరింత ముఖ్యం. అవసరానికి మించి మెత్తగా ఉండే సోఫా బదులు, కాస్త గట్టిగా ఉండే సోఫాను ఎంచుకోవడం శ్రేయస్కరం. మరీ ముఖ్యంగా...

- సోఫాలో కూర్చున్నప్పుడు పాదాలు నేల మీద ఆనేలా ఉండాలి
- మోకాళ్లు, తుంటి సమాంతరంగా ఉండాలి
- తుంటి కీలు, మోకాళ్లు 90 డిగ్రీల కోణాన్ని మించకూడదు, తగ్గకూడదు
- సోఫా... వెన్నుకూ, తలకూ ఆసరా అందించేలా ఉండాలి
- సోఫా వీపుకు ఆనుకునే భాగం 90% ఎక్కువ కోణంలో వెనక్కి వాలి ఉండాలి.
- ప్రతి మూడేళ్లకూ సోఫా రీఫిల్ చేయాలి లేదా కుషనింగ్ మారుస్తూ ఉండాలి
- ఎక్కువ సమయం పాటు టివి చూడాలనుకుంటే వెనక్కి వాలినట్టుండే రిక్లైనర్స్ వాడుకోవాలి

పరుపు ఇలా...

మెమరీ ఫోమ్ పరుపులు అత్యుత్తమం. పడుకోగానే గుంతలా ఏర్పడే పరుపులు ఆరోగ్యకరం కాదు. పరుపు మరీ గట్టిగా, మరీ మెత్తగా ఉండకూడదు. ఉదయం నిద్ర లేవగానే ఒంటి నొప్పులు వేధిస్తున్నా, తరచూ కండరాలు పట్టేస్తున్నా వాడుకునే పరుపులో లోపం ఉందని గ్రహించాలి. అలాగే మంచం కూడా సరిపడా ఎత్తులో ఉండాలి. ఎత్తు తక్కువ మంచాలు వాడుకున్నప్పుడు మోకాళ్ల మీద ఒత్తిడి పడుతుంది.

- 8 నుంచి 10 అంగుళాల మందం పరుపులు శ్రేయస్కరం
- పడుకోగానే శరీర వెనక భాగమంతా పరుపులో కూరుకుపోయేంత మెత్తగా ఉండకూడదు
- ఆర్థోపెడిక్ మ్యాట్రెస్ అవసరం లేదు కానీ మెమరీ ఫోమ్ పరుపు వాడుకోవాలి
- ఒకే చోట పడుకుంటూ ఉండే ఎంత నాణ్యమైన పరుపైనా గుంతగా మారిపోతుంది. కాబట్టి తరచూ తిప్పుతూ ఉండాలి

దిండ్లు సౌకర్యంగా...

కొందరికి లావుపాటి దిండు లేనిదే నిద్ర పట్టదు. ఇంకొందరికి దిండు వాడే అలవాటే ఉండదు. ఈ రెండు అలవాట్లూ ప్రమాదకరమే! రెండు దిండ్లు కలిపి తల కింద పెట్టుకోవడం మరింత ప్రమాదకరం. కాబట్టి వాడుకునే దిండు మరీ మందంగా లేదా మరీ పలుచగా ఉండకూడదు. అలాగే...

- దిండు మెడ వంపులో ఇమిడిపోయేలా ఉండాలి
- దిండు వల్ల తలకూ, మెడకూ మధ్య దూరం పెరిగేలా ఉండకూడదు
- మెడ వంపు కుదించుకుపోయే దిండును వాడకూడదు
- తరచూ దిండ్లను మారుస్తూ, శరీర భంగిమలను ఇబ్బందికి గురి చేయకూడదు



చేతి కర్ర వాడితే...

- గుండెపోటుకు గురైన వాళ్లు మూడు కాళ్ల చేతి కర్ర వాడుకోవాలి
- కండరాల పటుత్వాన్ని కలిగి ఉండి, గుండె ఆరోగ్యం బాగున్న 70 ఏళ్లు దాటినవారు సాధారణ చేతి కర్ర వాడుకుంటే సరిపోతుంది
- మోకాళ్ల నొప్పులున్నవాళ్లు ఏ మోకాలు నొప్పిగా ఉంటే అటువైపు చేతి కర్ర వాడుకోవాలి
- తుంటి నొప్పి ఉన్నవాళ్లు కుడి తుంటి నొప్పికి, ఎడమ వైపు చేతి కర్ర వాడుకోవాలి. ఎడమ తుంటి నొప్పికి కుడి వైపు చేతి కర్ర వాడుకోవాలి
- మూర్ఛ, పార్కిన్సన్స్ ఉన్నవాళ్లు, వాకర్, మూడు కాళ్ల చేతి కర్ర తప్పనిసరిగా వాడుకోవాలి

నేల మీద కూర్చుంటే...

గంటల తరబడి పూజ గదిలో నేల మీద పద్మాసనం వేసుకుని పూజ చేయడం, ఇండియన్ టాయిలెట్స్ వాడుకోవడం, నేల మీద కూర్చుని పనులు చేసుకోవడం వల్ల మోకాళ్ల మీద అదనపు ఒత్తిడి పడుతుంది. మరీ ముఖ్యంగా భారతీయుల్లో సహజసిద్ధంగా విటమిన్ డి లోపంతో కీళ్ల సమస్యలు చిన్న వయసులోనే మొదలవుతున్నాయి. ఈ సమస్యకు అస్తవ్యస్థ జీవనశైలి తోడైతే సమస్య మరింత తీవ్రమవుతుంది. కాబట్టి ఈ జాగ్రత్తలు పాటించాలి



- పూజ గదిలో ఎత్తుగా ఉండే స్టూలు వాడుకోవాలి
- మోకాళ్లు 90 డిగ్రీలకు మించి వంగకుండా చూసుకోవాలి
- మరీ ముఖ్యంగా మోకాళ్ల నొప్పులున్నవాళ్లు నేల మీద కూర్చోడం మానేయాలి
- ఇండియన్ టాయ్‌లెట్స్ వాడకుండా ఉండడమే ఉత్తమం
- వెస్టర్న్ కమోడ్ కూడా మరీ ఎత్తుగా ఉండకూడదు. తక్కువ ఎత్తులోనూ ఉండకూడదు

చలికాలం నొప్పులు

చలికాలం కండరాలు ఎక్కువగా సంకోచవ్యాకోచాలకు లోనవుతూ ఉంటాయి. ఈ కాలంలో కీళ్లు పట్టుతప్పకుండా నియంత్రించే క్రమంలో కండరాలు బిగుసుకుపోతూ ఉంటాయి. ఇలాంటి సహజసిద్ధ శరీర ప్రొటెక్టివ్ మెకానిజం వల్ల ఈ కాలంలో ప్రత్యేకించి ఉదయం వేళల్లో కండరాలు పట్టుకుపోతూ ఉంటాయి. ఉదయం నిద్రలేవగానే మంచం పైనుంచి కిందకు దిగడంకోసం శరీరాన్ని కదిలించగానే, అప్పటివరకూ విశ్రాంత స్థితిలో ఉన్న కండరాలు అకస్మాత్తుగా చురుగ్గా మారలేక పట్టుకుపోవచ్చు. ఇది ప్రమాదకరం కాదు. అయినప్పటికీ ఈ కాలంలో అవసరానికి మించిన విశ్రాంతి, నిద్ర మానుకోవాలి. వీలైనంత వరకూ శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలి. క్రమం తప్ప వ్యాయామం చేయాలి. ఒకవేళ కండరాలు పట్టేస్తే, వాటంతట అవి సర్దుకోడానికి కనీసం ఐదు రోజుల సమయం పడుతుంది. ఆ అసౌకర్యాన్ని, నొప్పినీ వదిలించుకోవడం కోసం వైద్యులు సూచించిన మజిల్ రిలాక్సెంట్స్, నొప్పి మందులు వాడుకోవాలి.



డాక్టర్ ప్రవీణ్ మర్రెడ్డి
సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్,
స్టార్ హాస్పిటల్స్,
నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్

పరిశోధన

సంగీతం సామర్థ్యం



ఢిల్లీకి చెందిన మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్, లోక్ నాయక్ హాస్పిటల్ చేపట్టిన అధ్యయనంలో, సర్జరీ సమయంలో సంగీతాన్ని వినిపించడం ద్వారా రోగి కోలుకునే వేగం పెరుగుతుందని స్పష్టమైంది. సాధారణ అనస్థీషియా సమయంలో రోగికి సంగీతాన్ని వినిపించడం ద్వారా, ఔషధ అవసరతను గణనీయంగా తగ్గించవచ్చని, అలాగే రోగి కోలుకునే సమయాన్ని కుదించవచ్చనీ ఈ అధ్యయనంలో తేలింది. సర్జరీలో సమయంలో రోగికి అనస్థీషియా ఇవ్వడం సర్వసాధారణం. అయితే ఆధునిక అనస్థీషియాలో రోగికి నొప్పి తెలియకుండా నిద్రమత్తులో ఉంచడం కోసం, ఐదు, నుంచి ఆరు రకాల మిశ్రమ ఔషధాలను ఉపయోగిస్తూ ఉంటారు. మరీముఖ్యంగా గాల్‌బ్లాడర్‌ను తొలగించే ల్యాప్రోస్కోపిక్ సర్జరీలో పొత్తికడుపు గోడల్లోని నాడులను మొద్దుబార్చే ఇంజెక్షన్లను ఇవ్వడం జరుగుతుంది. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సర్జరీ సమయంలో శరీరం స్పందిస్తూ, గుండె వేగం, రక్తపోటు పెరగడం లాంటి మార్పులు చోటుచేసుకుంటూనే ఉంటాయి. ఈ లక్షణాలను అదుపు చేయడానికి సంగీత చికిత్స తోడ్పడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఇందుకోసం పరిశోధకులు 20 నుంచి 45 ఏళ్ల రోగులను రెండు జట్లుగా విభజించి, రెండు జట్లకూ... శస్త్రచికిత్స సమయంలో, వాంతులను నివారించడం కోసం మత్తును అందించడం కోసం ఔషధాలను ఇవ్వడంతో పాటు ఫెంటనిల్ అనే నొప్పిని నివారించే ఔషధం, ప్రొపొఫాల్ అనే హిప్నాటిక్ ఔషధాన్ని కూడా రోగులకు అందించారు. రెండు జట్లలో ఒక జట్టుకు అదనంగా హెడ్‌ఫోన్లతో మురళి లేదా పియానో సంగీతాన్ని వినిపించినప్పుడు, ఈ జట్టుకు తక్కువ మోతాదు ప్రొపొఫోల్, ఫెంటనిల్‌లు అవసరమయ్యాయి. అలాగే వీరిలో సర్జరీ తదనంతరం కోలుకునే వేగం కూడా ఎక్కువగా ఉండడం, ఒత్తిడి హార్మోన్ల మోతాదులు తక్కువగా ఉండడం, సర్జరీ సమయంలో రక్తపోటు అదుపులో ఉండడం లాంటి ప్రయోజనాలను కూడా వైద్యులు గమనించడం జరిగింది.

జన్యు వ్యాధి



కొన్ని జన్యుపరమైన వ్యాధులు, వేర్వేరు అవయవాలను కబళిస్తాయి. అలాంటిదే... ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్. ప్రధానంగా మూత్ర పిండాలు, కాలేయం, పేగులు, గుండె, మెదడు రక్తనాళాలను ప్రభావితం చేసే ఈ ప్రాణాంతక వ్యాధి గురించీ, నివారణ చర్యల గురించీ తెలుసుకుందాం!

మూత్రపిండాల మీద ఓ కన్నేసి...

ప్రతి వెయ్యి మందిలో ఒకరికి ఈ వ్యాధి ఉంటుంది. ఒక తరం నుంచి మరొక తరానికి జన్యుపరంగా సంక్రమిస్తుంది. తల్లితండ్రుల్లో ఒకరికి ఈ వ్యాధి ఉన్నప్పుడు, పిల్లలకు సంక్రమించే అవకాశాలు 50 శాతం మేరకు ఉంటాయి. తరాలు మారేకొద్దీ వ్యాధి తీవ్రత, ఉధృతి మరింత పెరుగుతుంది. కాబట్టి సకాలంలో వ్యాధిని గుర్తించి, నివారణ చర్యలు పాటించాలి. ఈ రుగ్మతను సమూలంగా అరికట్టే వీలు లేకపోయినప్పటికీ, ఉధృతిని అడ్డుకుని మూత్రపిండాలను కాపాడుకోగలిగే వీలుంది. జన్యు చికిత్సలు, ఆర్ఎన్ఎ ఆధారిత చికిత్సలతో మెరుగైన ఫలితాలుంటాయని పరిశోధనల్లో స్పష్టమైంది.

ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్‌లో...

- ద్రవంతో నిండిన చిన్నపాటి తిత్తులు క్రమేపీ కిడ్నీల్లోని కణజాలాన్ని ఆక్రమిస్తాయి. దాంతో ఫిల్టర్ల స్థానంలో బెలూన్లను పోలిన తిత్తులు ఏర్పడతాయి
- ఏళ్లు గడిచేకొద్దీ కిడ్నీలు పూర్తిగా వాచిపోయి, వాటి పనితీరు కుంటుపడుతుంది
- సగానికి పైగా రోగులు కిడ్నీ మార్పిడి, డయాలసిస్ దశకు చేరుకుంటారు
- కొందరికి కాలేయ సమస్యలు, మరికొందరికి మెదడు సమస్యలూ తలెత్తుతాయి
- ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేకుండా ప్రాణాంతక పరిస్థితి తలెత్తవచ్చు
- గుండె కవాట లోపాలు, మూత్రపిండాల్లో రాళ్లు, హెర్నియా కూడా వేధించవచ్చు

లక్షణాల మీద ఓ కన్నేసి...

ఆటోసోమల్ డామినెంట్ పాలీసిస్టిక్ కిడ్నీ డిసీజ్ వ్యాధిని సకాలంలో గుర్తించాలంటే బయల్పడే లక్షణాలను జాగ్రత్తగా గమనించుకుంటూ ఉండాలి. ఎక్కువ మందికి 30 లేదా 40 ఏళ్ల వయసులో లక్షణాలు బయల్పడడం మొదలుపెడతాయి. అవేంటంటే....

- వెన్ను లేదా డొక్కలో నొప్పి
- కడుపు నిండిన భావన
- మూత్రంలో రక్తం
- తలనొప్పి

ఎడిపికెడి నియంత్రణ ఇలా...

- రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి
- వ్యాధి తొలి దశలో రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగాలి
- కాఫీ తగ్గించాలి. కాఫీ వ్యాధి తీవ్రత పెరుగుతుంది
- ఈస్ట్రోజన్ కలిగిన గర్భనిరోధక మాత్రలు మానేయాలి
- కిడ్నీ పనితీరు మెరుగ్గానే ఉన్నప్పటికీ, తరచూ వైద్యులను కలిసి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి
- కిడ్నీలు 50 శాతం దెబ్బతినేవరకూ ఆగకుండా ప్రారంభంలోనే చికిత్స మొదలుపెడితే, కిడ్నీలు పూర్తిగా విఫలమయ్యే ప్రమాదం తప్పుతుంది

ఇలా అప్రమత్తం

- కుటుంబ చరిత్రలో ఎడిపికెడి ఉంటే, అల్ట్రా సౌండ్, ఎమ్మారై పరీక్షలు చేయించుకోవాలి. ఫలితాల్లో సిస్టులు ఉన్నట్టు తేలితే, వెంటనే చికిత్స మొదలుపెట్టాలి
- టోల్వాప్టాన్ అనే ఔషధంతో వైద్యులు మూత్ర పిండాల వైఫల్యాన్ని అరికట్టగలుగుతున్నారు. ధర ఎక్కువే అయినప్పటికీ ఈ ఔషధంతో డయాలసిస్‌ను కొన్నేళ్లపాటు వాయిదా వేయవచ్చు
- ఈ వ్యాధి ఉన్న జంటలు గర్భానికి ముందే ఐవిఎఫ్, ప్రీ ఇంప్లాంటేషన్ జెనెటిక్ డయాగ్నసిస్ ద్వారా అండాలను పరీక్షించుకుని వ్యాధికి ఆస్కారం లేని అండాలతోనే గర్భం దాల్చాలి.



డాక్టర్ శ్రీకాంత్ బత్తిని
సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్,
కిమ్స్ హాస్పిటల్, గచ్చిబౌలి, హైదరాబాద్

తెలుసుకుందాం

నిస్సత్తువను తరిమే 'మైటోకాండ్రియా' ఆహారం

కణాల శక్తి భాండాగారాలు 'మైటోకాండ్రియా' అని మనం దరం చదువుకున్నాం. ఈ శక్తి భాండాగారాలు బలహీనపడితే అకారణంగా నిస్సత్తువ వేధిస్తూ ఉంటుంది. ఇలాంటప్పుడు మైటోఖాండ్రియాను బలపరిచే ఆహారాన్ని ఎంచుకోవాలి. అవేంటంటే...

మనం తినే ప్రతి భోజనంలో మైటోకాండ్రియా పదార్థం ఉండేలా చూసుకోవాలి. ఈ కోవకు చెందిన ఆకుకూరలు, కూరగాయలు, మాంసాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



ఆకుకూరలు: పాలకూర, ఇతరత్రా ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే ఆకుకూరలన్నీ యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంటాయి.

క్రూసిఫెరస్ కూరగాయలు: బ్రొకొలి, కాలిఫ్లవర్

బెర్రీస్: స్ట్రాబెర్రీ, బ్లాక్‌బెర్రీస్, బ్లూ బెర్రీ

రంగుల పండ్లు, కూరగాయలు: బీట్‌రూట్, క్యారట్స్, టమాటా, పర్పుల్ క్యాబేజ్... వీటన్నింట్లో ఫైటోన్యూట్రియంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఆహారంలో వీటిని చేర్చుకుంటూ ఉండాలి

నూనెలు: ఆలివ్ నూనె, అవిసెగింజల నూనెల్లో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి

నట్స్, సీడ్స్: వాల్‌నట్స్, గుమ్మడి విత్తనాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, పోషకాలు ఉంటాయి

అవకాడో: మోనోశాచురేటెడ్ కొవ్వుల కోసం అవకాడొ తినాలి

చేపలు: చేపల్లో ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువ. మరీముఖ్యంగా కొవ్విన చేపల్లో ఈ పోషకాలు మరింత ఎక్కువగా ఉంటాయి

బోన్ బ్రాత్: ఎముకలతో తయారైన బ్రాత్ లోపలి పొరతో పాటు మైటోకాండ్రియాల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది

గ్రీన్ టీ: కణ శక్తి ఉత్పత్తికి తోడ్పడుతుంది

స్పైసెస్: పసుపు, లవంగాలు, దాల్చిన చెక్క, తులసి కణ నష్టాన్ని అరికడతాయి

పీఎస్‌బీల్లో మరో మెగా విలీనం!

12 నుంచి 4కి తగ్గించే యోచన..

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా– కెనరా బ్యాంక్ మెర్జర్?


పెద్ద బ్యాంకుల్లో చిన్న బ్యాంకుల విలీనానికి కసరత్తు

ప్రభుత్వం ముందుకు ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) స్వరూపం మరింత మారనుంది. విలీనాల ద్వారా వీటి ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 12గా ఉన్న పీఎస్‌బీలను 2027 మార్చి నాటికి విలీనాల ద్వారా నాలుగుకు కుదించాలని యోచిస్తోంది. ఇందుకోసం మరో మెగా విలీనాలకు కసరత్తు చేస్తోంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)లను పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), ఎస్‌బీఐ వంటి పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయాలని యోచిస్తోంది. అంతేకాకుండా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కెనరా బ్యాంక్‌ను విలీనం చేయనున్నట్టు తెలుస్తోంది.

ఎందుకంటే?

2047 నాటికి ప్రపంచంలోని టాప్-50 బ్యాంకుల్లో కనీసం రెండు మూడు భారతీయ బ్యాంకులు ఉండాలని ప్రభుత్వం యోచిస్తోంది. చిన్న పీఎస్‌బీలను పెద్ద పీఎస్‌బీల్లో విలీనం చేయడమే ఇందుకు మార్గమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. నీతి ఆయోగ్ ఇప్పటికే ఐఓబీ, సీబీఐ వంటి చిన్న పీఎస్‌బీలను ప్రైవేటీకరణ అయినా చేయండి లేదా పెద్ద పీఎస్‌బీల్లోనైనా విలీనం చేయండి అని సిఫారసు చేసింది. విలీనాలైతే ఉద్యోగ సంఘాల నుంచి పెద్దగా వ్యతిరేకత కూడా ఉండకపోవచ్చని అంచనా. దీంతో ప్రభుత్వం కూడా మరో విడత పీఎస్‌బీల విలీనానికే మొగ్గు చూపుతుందని భావిస్తున్నారు.



త్వరలో ప్రతిపాదన

ప్రస్తుతం ఈ విలీన యోచన ఇంకా అధికారుల స్థాయిలోనే ఉంది. త్వరలోనే దీనిపై మరింత కూలంకషంగా చర్చించి ఆ ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్, ప్రధానమంత్రి కార్యాలయాలకు పంపిస్తారని తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై మాట్లాడేందుకు బ్యాంకులు, ప్రభుత్వ అధికార వర్గాలు నిరాకరిస్తున్నాయి. మొత్తం మీద త్వరలోనే పీఎస్‌బీల్లో మరో విలీనం చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

ప్రస్తుతానికైతే ఆ ఆలోచనే లేదు

మరోవైపు ప్రభుత్వం ఈ వార్తలను తోసిపుచ్చింది. ప్రస్తుతం తమ వద్ద అలాంటి ప్రతిపాదనే లేదని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఒక లిఖిత పూర్వక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పీఎస్‌బీల విలీనాలు గానీ, స్థిరీకరణ గానీ ప్రస్తుతం తమ పరిశీలనలో లేవన్నారు.

నేటి నుంచి బీఓఎం ఓఎఫ్ఎస్

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) ఈక్విటీలో ఆరు శాతం వాటాను ప్రభుత్వం విక్రయిస్తోంది. మంగళవారమే ఈ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ప్రారంభం కానుంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ అమ్మకం ద్వారా ప్రభుత్వానికి రూ.2,600 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. 2026 మార్చిలోగా అన్ని లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ వాటా కనీసం 25 శాతం ఉండాలన్న సెబీ ఆదేశాలకు అనుగుణంగా బీఓఎం ఈ ఓఎఫ్ఎస్ జారీ చేస్తోంది.

ఏడాది కనిష్ఠానికి జీఎస్‌టీ వసూళ్లు

నవంబరులో రూ.1.70 లక్షల కోట్లే..
పన్ను రేట్ల తగ్గుదలతో ఆదాయానికి గండి

న్యూఢిల్లీ: నవంబరు నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1.70 లక్షల కోట్లకు పరిమితం అయ్యాయి. గత ఏడాది నవంబరులో పరిహార సుంకం ద్వారా సమకూరిన రూ.12,950 కోట్లను మినహాయించగా నమోదైన రూ.1.69 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే కేవలం 0.7 శాతం వృద్ధి చెందాయి. సెప్టెంబరు 22 నుంచి కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ శ్లాబులను హేతుబద్ధీకరించడంతో పాటు 375 వస్తువులపై పన్నును గణనీయంగా తగ్గించడం ఇందుకు కారణమైంది. అయితే, పన్ను రేట్ల తగ్గుదలతో వస్తు వినియోగం భారీగా పుంజుకోవడం వసూళ్ల స్వల్పంగానైనా వృద్ధి చెందాయి. కాగా, ఈ అక్టోబరులో పరిహార సుంకంతో కూడిన జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లుగా ఉన్నాయి.

లాభాల స్వీకరణతో రికార్డు గరిష్ఠాల నుంచి వెనక్కి

సెన్సెక్స్ 65 పాయింట్లు డౌన్

ముంబై: సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల్లో జీడీపీ వృద్ధి రేటు 6 త్రైమాసికాల గరిష్ఠం 8.2 శాతానికి ఎగబాకడంతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం ప్రారంభ ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ట్రేడింగ్ తొలి గంటలోనే సెన్సెక్స్ 452.35 పాయింట్ల వృద్ధితో 86,159.02 వద్ద, నిఫ్టీ 122.85 పాయింట్ల పెరుగుదలతో 26,325.80 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డులను నమోదు చేశాయి. అయితే, వృద్ధి అంచనాలను మించడంతో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేటును మరింత తగ్గించకపోవచ్చన్న ఆందోళనలతో పాటు జీఎస్‌టీ వసూళ్లు అంత ఆశాజనకంగా లేకపోవడంతో మదుపరులు రికార్డు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సెన్సెక్స్ 64.77 పాయింట్ల నష్టంతో 85,641.90 వద్ద ముగిసింది. నిఫ్టీ 27.20 పాయింట్లు కోల్పోయి 26,175.75 వద్ద స్థిరపడింది.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం ఉదయం రూ.89.45 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 34 పైసలు క్షీణించి రూ.89.79 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు కనిష్ఠాన్ని నమోదు చేసింది. మళ్లీ కాస్త కుదురుకున్నప్పటికీ, 8 పైసల నష్టంతో రూ.89.53 వద్ద ముగిసింది.

భారీగా పెరిగిన పసిడి: బంగారం, వెండి ధరలు మళ్లీ దూసుకెళ్తున్నాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి(99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర సోమవారం రూ.3,040 పెరిగి రూ.1,33,200కు చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో పెరిగి రూ.1,32,600గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.5,800 ఎగబాకి రూ.1.77 లక్షలు పలికింది.

హైదరాబాద్‌లో మరో హౌసింగ్ ప్రాజెక్ట్

గోద్రెజ్ ప్రాపర్టీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గోద్రెజ్ ప్రాపర్టీస్ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇటీవల కోకాపేటలోని నియోపోలిస్ వద్ద హెచ్ఎండీఏ నిర్వహించిన వేలంలో కంపెనీ ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో రూ.4,150 కోట్ల ఆదాయానికి అవకాశం ఉన్న ప్రీమియం నివాస గృహ సముదాయాన్ని నిర్మించబోతున్నట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. హెచ్ఎండీఏ నుంచి కేటాయింపు ఉత్తర్వులు అందుకున్న తర్వాత ఈ ప్రాజెక్ట్ పనులను చేపట్టనున్నట్లు కంపెనీ పేర్కొంది. గోద్రెజ్ ప్రాపర్టీస్ ఈ ఏడాది ఆగస్టులోనూ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో 7.825 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది.

రూ. 3 లక్షల కోట్లు..

6 నెలల్లో భారత్‌లోకి వచ్చిన ఎఫ్‌డీఐ ఇది

న్యూఢిల్లీ: భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) గాడిన పడుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల్లో వివిధ దేశాల నుంచి మన దేశం 3,518 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.15 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 18 శాతం ఎక్కువ. ఈ ఆరు నెలల్లో అమెరికా నుంచి వచ్చిన ఎఫ్‌డీఐ అయితే రెట్టింపునకుపైగా పెరిగి 662 కోట్ల డాలర్లకు చేరింది. మరోవైపు ఎఫ్‌డీఐలను ఆకర్షించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర 1,057 కోట్ల డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక (940 కోట్ల డాలర్లు), తమిళనాడు (357 కోట్ల డాలర్లు), హరియాణా (322 కోట్ల డాలర్లు), గుజరాత్ (224 కోట్ల డాలర్లు), తెలంగాణ (114 కోట్ల డాలర్లు) ఉన్నాయి.

వాటర్‌టెక్ ప్రత్యేక క్యాంపెయిన్ షురూ



WATERTEC The perfect flow. For life.

హైదరాబాద్: పాలిమర్ బాత్‌వేర్, ప్లంబింగ్ సొల్యూషన్స్ సంస్థ వాటర్‌టెక్ ఇండియా తొలిసారిగా ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా 'కిక్ అవుట్ ది ఆర్డినరీ' పేరుతో దేశవ్యాప్తంగా టీవీ అడ్వర్టైజింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా సంస్థ.. ప్రొప్రైటరీ సూపర్‌సీల్ టెక్నాలజీ, పీఓఎం మెటీరియల్‌తో తయారు చేసిన ఉత్పత్తుల గురించి వివరించనుంది. కంపెనీ ఉత్పత్తులు 100 శాతం లీక్ ప్రూఫ్‌తో సహా దీర్ఘకాలం పాటు మన్నికగా ఉంటాయని పేర్కొంది. 9 భారతీయ భాషల్లో ఈ టీవీ క్యాంపెయిన్‌ను రూపొందించినట్లు వాటర్‌టెక్ వెల్లడించింది. ప్రధానంగా దక్షిణ, తూర్పు భారతంలో కార్యకలాపాలు సాగిస్తున్న వాటర్‌టెక్ ఈ మధ్యనే దేశవ్యాప్తంగా తన కార్యకలాపాలు విస్తరించింది. ప్రస్తుతం కంపెనీ పోర్టుఫోలియోలో పాలిమర్ బాత్‌వేర్, పైపులు,ఫిట్టింగ్స్, సీపీ ఫిట్టింగ్స్, శానిటరీ వేర్ ఉత్పత్తులు ఉన్నాయి.

కార్.. టాప్ గేర్

న్యూఢిల్లీ: నవంబరు నెలలో కూడా కార్ల మార్కెట్ జోరును కొనసాగించింది. పండగల సీజన్ అనంతర డిమాండు మార్కెట్‌ను వృద్ధి పథంలో నడిపించింది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాలు మారుతి సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా అమ్మకాల్లో బలమైన వృద్ధిని నమోదు చేయడం మార్కెట్‌కు కలిసి వచ్చింది. మారుతి సుజుకీ నాలుగు దశాబ్దాల అత్యుత్తమ అమ్మకాల రికార్డును (ఎగుమతులు సహా) నమోదు చేసింది. గత ఏడాది నవంబరుతో పోల్చితే 26% వృద్ధితో 2,29,021 యూనిట్లు విక్రయించింది. 40 ఏళ్ల కాలంలో నవంబరు నెలలో నమోదైన గరిష్ఠ అమ్మకాలు ఇవే. మరోవైపు 57,436 కార్ల అమ్మకంతో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది నవంబరులో విక్రయించిన 47,063 యూనిట్లతో పోల్చితే అమ్మకాల్లో 22% వృద్ధి నమోదైంది. మహీంద్రా అమ్మకాలు 22 శాతం, హ్యుండయ్ మోటార్ విక్రయాలు 4 శాతం పెరగగా, టయోటా కిర్లోస్కర్ అమ్మకాలు 28 శాతం, కియా ఇండియా 24 శాతం, రెనో ఇండియా విక్రయాలు 30 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహన కంపెనీలైన హీరో మోటో, హోండా మోటార్‌సైకిల్, సుజుకీ మోటార్ సైకిల్ రెండంకెల స్థాయిలో పెరగగా బజాజ్ ఆటో విక్రయాలు స్వల్పంగా తగ్గాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,480	1,19,600	1,96,000
విజయవాడ	1,33,000	1,24,000	1,80,000
విశాఖపట్నం	1,33,080	1,19,000	1,96,000
రాజమండ్రి	1,30,470	1,19,600	1,76,000
ప్రొద్దుటూరు	1,27,900	1,17,670	1,75,000
ముంబై	1,28,800	1,17,981	1,75,180

సాయి పేరెంటరల్స్ చేతికి ఆస్ట్రేలియా కంపెనీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి పేరెంటరల్స్ తన ఉత్పత్తి కార్యకలాపాలను ఆస్ట్రేలియాకు విస్తరిస్తోంది. ఇందుకోసం ఆ దేశానికి చెందిన నోమెడ్ ఫార్మాలో 74.6 వాటాను రూ.125 కోట్లకు కొనుగోలు చేసినట్టు ప్రకటించింది. దాదాపు 6 కోట్ల ఆస్ట్రేలియా డాలర్ల ఆదాయం ఉన్న నోమెడ్ ఫార్మా ఆస్ట్రేలియాలో దాదాపు 451 ప్రైవేట్ లేబుల్ ఓటీసీ ఔషధాలను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల్లోని వివిధ ఫార్మా చెయిన్స్‌కు సరఫరా చేస్తోంది. ఈ కంపెనీ ప్రస్తుతం అడిలైడ్ వద్ద 5.3 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లతో ఒక అధునాతన ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్ వచ్చే ఏడాది డిసెంబరు కలా వాణిజ్య స్థాయిలో ఉత్పత్తి ప్రారంభించనుంది. ఈ కొనుగోలుతో ఫార్ములేషన్స్, సీడీఎంఓ మార్కెట్లో తమ స్థానం మరింత పటిష్ఠమవుతుందని సాయి పేరెంటరల్స్ ఎండీ కేకే అనిల్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ



హైదరాబాద్	640	విజయవాడ	665
వరంగల్	642	గోదావరి	640
చిత్తూరు	663	విశాఖపట్నం	630
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	113
వరంగల్	117	గుంటూరు	118
కరీంనగర్	117	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	111
కర్నూలు	117	నెల్లూరు	116
విశాఖపట్నం	112	అనంతపురం	116
గోదావరి	113		


స్పోర్ట్స్

బోర్డు అత్యవసర సమావేశం!

బుధవారం సౌతాఫ్రికాతో రెండో వన్డే జరుగనుండగా.. అంతకంటే ముందే కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ ఇతర అధికారులతో బీసీసీఐ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటోంది. ఇందులో ముఖ్యంగా రో-కోతో కోచ్ గంభీర్ సంబంధాలతో పాటు వారి భవిష్యత్‌పై చర్చించనున్నట్టు సమాచారం. 2027 వన్డే వరల్డ్‌కప్‌లో ఈ ద్వయం ఆడాలనుకుంటోంది. అలాగే జట్టులో ఇటీవల ఎక్కువగా మార్పులు చేర్పులు జరుగుతుండడంతో ఫలితంపై ప్రభావం పడుతోంది. అందుకే ఆటగాళ్ల ఎంపికలో నిలకడ ఉండేలా చూడాలనుకుంటోంది. టెస్టు సిరీస్‌లో కోచ్ వ్యూహాలు, ఆటగాళ్ల స్థానాల మార్పులు బెడిసికొట్టి చివరికి వైట్‌వాష్ అవ్వాల్సి వచ్చింది. మరో ఎనిమిది నెలల తర్వాత టెస్టు సిరీస్ ఉండడంతో ఇప్పటి నుంచే మరింత స్పష్టత, ముందస్తు ప్రణాళికలపై కోచ్‌తో చర్చించే అవకాశం ఉంది.

ఏదో తేడాగా ఉందే..!







రో-కో X గంభీర్!

క్షీణిస్తున్న సంబంధాలు

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా భారత క్రికెట్‌కు మూల స్తంభాలుగా విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ నిలుస్తూ వచ్చారు. దశాబ్దకాలంగా ఎంతో మంది కోచ్‌లుగా వచ్చినా జట్టు ప్రయాణం సాఫీగానే సాగింది. కానీ ప్రధాన కోచ్‌గా గౌతం గంభీర్ ఆగమనంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కాస్త దూకుడు స్వభావం కలిగిన గౌతీ తన కోసమే ప్రత్యేకంగా జట్టును రూపొందించుకోవాలనే అభిప్రాయంతో ఉన్నాడు. యువ ఆటగాళ్లు, ఆల్‌రౌండర్ల వైపే అతను ఎక్కువగా మొగ్గు చూపుతుంటాడు. దీనికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ కూడా వంత పాడుతుండడంతో ఇప్పుడు టీమిండియాలో కోచ్‌దే హవా. దీంతో వెటరన్ స్టార్లు రోహిత్, విరాట్‌ల పరిస్థితి పొమ్మనలేక పొగబెట్టినట్టయ్యింది. అందుకే గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలిచిన వెంటనే ఈ ఇద్దరు దిగ్గజాలు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. టెస్టు కెప్టెన్‌గా రోహిత్ ఉన్నప్పటికీ భవిష్యత్ దృష్ట్యా శుభ్‌మన్ గిల్ వైపు గంభీర్ చూడడంతో కినుక వహించిన రోహిత్ ఆ ఫార్మాట్ నుంచి కూడా వైదొలిగాడు. అభిమానులు ఈ షాక్ నుంచి తేరుకునే లోపే అనూహ్యంగా విరాట్ సైతం గుడ్‌బై చెప్పడంతో జట్టులో అసలేం జరుగుతోందనే సందేహం మొదలైంది. ఇప్పుడు రో-కో కేవలం వన్డేలకు మాత్రమే పరిమితమయ్యారు. మరోవైపు 2027లో జరిగే వన్డే వరల్డ్‌కప్‌లో ఈ ఇద్దరికి చోటు కల్పించేందుకు గంభీర్ అంత ఆసక్తి ప్రదర్శించడం లేదు. వారు ఫామ్‌లో ఉంటేనే పరిశీలిస్తామని గతంలోనే గంభీర్ తేల్చి చెప్పాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు జట్టులో చేరిన రో-కో గంభీర్‌తో అంటీ ముట్టనట్టుగానే ఉంటున్నారు. అతడికి సమాధానంగా అన్నట్టు రాంచీలో జరిగిన తొలి వన్డేలో ఈ ద్వయం కసిదీరా చెలరేగి 'ఇదుగో ఇదీ మా సత్తా' అంటూ కోచ్‌కు బ్యాట్‌తో గట్టిగానే బదులిచ్చారు. రాహుల్ ద్రవిడ్ స్థానంలో కోచ్‌గా వచ్చినప్పుడు గంభీర్‌కు ఈ ఇద్దరితో సంబంధాలు మెరుగ్గానే ఉన్నా, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. అటు ముంబైకే చెందిన చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌తో రోహిత్‌కు కూడా అంతగా సత్సంబంధాలు లేకపోవడం గమనార్హం.

ఎడమొహం పెడమొహంగా..

టెస్టు ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాక రో-కో ఆస్ట్రేలియా టూర్‌లోనే తొలిసారిగా కనిపించారు. అక్కడ జరిగిన మూడు వన్డేల్లో రోహిత్ అదరగొట్టగా.. తొలి రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ సున్నాకే అవుటైనా.. ఆఖరి మ్యాచ్‌లో రాణించాడు. ఇప్పుడు దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్ కోసం జట్టులో చేరిన వీరికి కోచ్‌తో సంభాషణలు వేళ్ల మీద లెక్కపెట్టవచ్చని సమాచారం. ఈ ముగ్గురి చుట్టూ నెలకొన్న ప్రతిష్టంభన అటు బీసీసీఐని కూడా ఆందోళనపరుస్తోంది. 'ఆసీస్ టూర్‌లో అగార్కర్-రోహిత్ అసలు మాట్లాడుకోలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా కోహ్లీ-గంభీర్ ఒకరికొకరు పెద్దగా మాట్లాడుకున్నది లేదు. అంతేకాకుండా ఈ ఇద్దరి అభిమానులు సోషల్ మీడియాలో గంభీర్‌పై విరుచుకుపడుతున్న తీరు బీసీసీఐని కలవరపెడుతోంది' అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి తెలిపాడు. తొలి వన్డేలో గెలిచాక డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిన కోహ్లీ.. అక్కడే ఉన్న కోచ్‌ను కనీసం చూడకుండానే మరో వైపునకు వెళ్లడం వీడియోలో కనిపించింది.

సంబరాలకు దూరంగా..

తొలి వన్డేలో దక్షిణాఫ్రికాపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ శతకంతో చెలరేగిన విషయం తెలిసిందే. అయితే విజయం సాధించాక భారత జట్టు ఆటగాళ్లంతా తమ హోటల్‌కు చేరగా.. అక్కడి సిబ్బంది వీరి కోసం కేక్‌ను సిద్ధం చేశారు. కెప్టెన్ రాహుల్ కట్ చేస్తుండగా పక్క నుంచి విరాట్ వెళ్లడం కనిపించింది. ఆటగాళ్లంతా తమతో జాయిన్ కావాలని కోరినా.. అతను మాత్రం 'వద్దులే.. మీరే ఎంజాయ్ చేయండి' అన్నట్టుగా చేయి ఊపుతూ లిఫ్ట్ వైపు వెళ్లడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విరాట్ గురించి ఆలోచన ఎందుకు?



సితాన్షు కోటక్


రాంచీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వన్డే భవిష్యత్ గురించి ఆలోచనలు అనవసరమని టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తేల్చాడు. 'జట్టులో కోహ్లీ స్థానం గురించి, ఎంతకాలం ఆడతాడనే విషయంపై ఎందుకు ఆలోచిస్తున్నారు? అతడు అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. ఈ సమయంలో తన భవిష్యత్ గురించి మాట్లాడుకోవడం అవసరమా? తన ప్రదర్శన, ఫిట్‌నెస్ మెరుగ్గా ఉన్నంతకాలం జట్టులో ఉంటాడు' అని కోటక్ స్పష్టం చేశాడు. మరోవైపు 37 ఏళ్ల కోహ్లీలో పరుగుల దాహం ఇంకా తీరలేదని దక్షిణాఫ్రికా మాజీ పేసర్ స్టెయిన్ చెప్పాడు. ఆ వయస్సుగల క్రికెటర్లు రిటైర్మెంట్ తీసుకుని హాయిగా ఇంట్లో సేద తీరుతున్నా.. మైదానంలో చిరుతలా పరిగెత్తుతూ, అద్భుత ఫీల్డింగ్‌తో విరాట్ అదరగొడుతున్నాడని కితాబిచ్చాడు.

పికెల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ బోణీ

న్యూఢిల్లీ: ఇండియన్ పికెల్‌బాల్ లీగ్‌లో హైదరాబాద్ రాయల్స్ జట్టు బోణీ కొట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4-2తో క్యాపిటల్ వారియర్స్ గుర్‌గావ్‌పై గెలిచింది. ఇతర మ్యాచ్‌ల్లో లఖ్‌నవూ లెపార్డ్స్ 4-1తో బెంగళూరు బ్లాస్టర్స్‌పై, చెన్నై సూపర్ వారియర్స్ 5-1తో ముంబై స్మాషర్స్‌పై నెగ్గాయి.

హార్దిక్ ఫిట్

- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సీఓఈ
- 'ముస్తాక్ అలీ'లో ఆడనున్న ఆల్‌రౌండర్



న్యూఢిల్లీ: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. ఈ ఏడాది ఆసియా కప్‌లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా గాయపడి రెండు నెలలకు పైగా ఆటకు దూరంగా ఉన్న హార్దిక్ ఇప్పుడు పూర్తి ఫిట్‌గా ఉన్నాడు. ఈ మేరకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ).. హార్దిక్ ఫిట్‌గా ఉన్నాడని ప్రకటించింది. అతను బౌలింగ్ చేయడానికి కూడా ఓకే చెప్పింది. దీంతో హార్దిక్.. మంగళవారం హైదరాబాద్ వేదికగా పంజాబ్‌తో జరిగే సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. ఈ టోర్నీలో పాండ్యా ఫిట్‌నెస్, ప్రదర్శనను పరిశీలించిన తర్వాత.. ఓకే అనిపిస్తే అతడిని దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు కూడా ఎంపిక చేసే అవకాశముంది.

మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర రాజీనామా



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు ప్రధాన కోచ్ హరేంద్ర సింగ్ తన పదవికి రాజీనామా చేశాడు. వ్యక్తిగత కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నాని, వెంటనే ఇది అమల్లోకి వస్తుందని అతను వెల్లడించాడు. ఇదే విషయాన్ని హాకీ ఇండియా (హెచ్ఐ)కు ఈమెయిల్ ద్వారా తెలిపాడు. గతేడాది ఏప్రిల్‌లో కోచ్‌గా జట్టు బాధ్యతలు స్వీకరించిన హరేంద్ర.. తన హయాంలో గత నవంబరులో జట్టును ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిపాడు. అయితే, ఆ తర్వాత అనూహ్యంగా భారత మహిళల హాకీ జట్టు ప్రదర్శన ఆశించిన మేర లేదు. ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్ 2024-25లో 16 మ్యాచ్‌లు ఆడితే రెండింట్లో మాత్రమే గెలిచింది. దీంతో తర్వాతి సీజన్‌కు జట్టు అర్హత సాధించలేకపోయింది. మరోవైపు నెదర్లాండ్స్‌కు చెందిన జోయెర్డ్ మరిజ్నే మరోసారి మహిళల జట్టు చీఫ్ కోచ్‌గా వచ్చే అవకాశముంది. మరిజ్నే ఆధ్వర్యంలోనే మహిళల జట్టు 2021 టోక్యో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచింది.

అర్జున్‌కు 5.. గుకేష్‌కు 10

ఫిడే ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: ఫిడే చెస్ ర్యాంకింగ్స్‌లో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి ఓ ర్యాంక్ మెరుగుపరచుకోగా.. ప్రపంచ చాంపియన్ గుకేష్ ఓ స్థానం కోల్పోయాడు. ఫిడే సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో క్లాసికల్ విభాగంలో అర్జున్ ఆరు నుంచి ఐదో స్థానానికి ఎగబాకాడు. ఇటీవల జరిగిన వరల్డ్‌కప్‌లో అర్జున్ క్వార్టర్స్ దాకా చేరగా.. గుకేష్ మూడో రౌండ్‌లోనే ఓడాడు. దీంతో గుకేష్ 9 నుంచి 10వ ర్యాంక్‌కు పడిపోయాడు. ప్రజ్ఞానంద ఏడో ర్యాంక్‌లో, దిగ్గజ గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ 13వ, విదిత్ గుజరాతి 29వ స్థానంలో కొనసాగుతున్నారు.



మనమ్మాయిల శుభారంభం

జూనియర్ హాకీ ప్రపంచకప్

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తమ తొలి మ్యాచ్‌లో భారత్ 13-0తో నమీబియాపై ఘన విజయం సాధించింది. భారత జట్టులో హీనా బానో, కనికా సివాచ్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించగా.. సాక్షి రాణా రెండు గోల్స్‌తో సత్తా చాటింది. సాక్షి శుక్లా, ఇషిక, మనీషా తలో గోల్ కొట్టారు.

సీఓఈలో చేరిన గిల్



న్యూఢిల్లీ: మెడ నొప్పితో బాధపడుతున్న భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)లో చేరాడు. పునరావాస శిబిరంలో భాగంగా సోమవారం తను బెంగళూరుకు చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో ఈనెల 9 నుంచి ఐదు టీ20ల సిరీస్ జరుగనుంది. ప్రస్తుతం వన్డేలకు దూరమైన తను పొట్టి పోరుకల్లా సిద్ధంగా ఉండాలని భావిస్తున్నాడు. ఈనేపథ్యంలో వేగంగా కోలుకుంటున్న గిల్‌కు సీఓఈలో ఫిట్‌నెస్ టెస్టు నిర్వహించనున్నారు. అన్నీ అనుకూలంగా జరిగితే ఈనెల 6-7వరకల్లా కటక్‌లో టీ20 జట్టుతో పాటు చేరే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి.

తెలుగు లిఫ్టర్లకు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టర్లు పతకాల మోత మోగించారు. రాజస్థాన్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో మహేష్ (ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం) స్వర్ణం కొల్లగొట్టాడు. మహేష్ 79 కిలోల విభాగంలో విజేతగా నిలిచాడు. తరుణ్ (ఆంధ్ర విశ్వవిద్యాలయం) 88 కిలోల కేటగిరీలో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. 94 కిలోల విభాగంలో ఏలూరు లిఫ్టర్ కోమల్ శ్రీకాంత్ (ఎల్‌పీ విశ్వవిద్యాలయం) రెండో స్థానంతో రజతం, అశోక్ (నాగార్జున యూనివర్సిటీ) మూడో స్థానంతో కాంస్యం దక్కించుకున్నారు. 79 కిలోల విభాగంలో ఏలూరు లిఫ్టర్ వెంకటకృష్ణ (చండీగఢ్) యూనివర్సిటీ) మూడో స్థానంతో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.

బోయింగ్ విమానాలను నడపండి

- విజయవాడ నుంచి ముంబయి, ఢిల్లీకి సర్వీసులు పెంచండి
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌కు ఎంపీలు హరీశ్, చిన్ని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడ-హైదరాబాద్, రాజమండ్రి-విజయవాడ మధ్య బోయింగ్ వైడ్-బాడీ విమానాలను నడపాలని టీడీపీ ఎంపీలు జీఎం హరీశ్, కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు. సోమవారం పార్లమెంటులోని పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుతో ఎంపీలు భేటీ అయ్యారు. 'ప్రస్తుతం ఏటీఆర్ విమానాలు నడుపుతున్నారు. వాటిలో లగేజీ సామర్థ్యం తక్కువ. దీంతో ప్రయాణీకుల లగేజీ వేరే విమానాల ద్వారా పంపిస్తున్నారు. ఇందువల్ల ముఖ్యంగా విదేశాలకు వెళ్లే ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా కనక్టెడ్ విమానాలను అందుకోవడంలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇంటర్నేషనల్ కనెక్టివిటి ఉండే విధంగా ముంబయి, ఢిల్లీ విమానాశ్రయాలకు విమాన సర్వీసులను నడిపేలా చూడండి' అని విజ్ఞప్తి చేశారు. అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ చిన్ని తెలిపారు.

సీ ప్లేన్ సేవల్లో ఏపీ ముందడుగు

- 10 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌లకు ప్రతిపాదనలు: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీ ప్లేన్ సేవలను అందించేందుకు ఏపీలో 10 ప్రాంతాలను ఎంపిక చేసింది. ఆ ప్రాంతాలను వాటర్ ఏరోడ్రోమ్‌లుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్రంలో సీప్లేన్ సేవలపై రాజ్యసభలో టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ఒక ప్రశ్నను అడిగారు. దానికి పౌర విమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'అరకు, గండికోట, కాకినాడ, కోనసీమ, లంబసింగి, నర్సాపురం, ప్రకాశం బ్యారేజ్, రుషికొండ, శ్రీశైలం, తిరుపతి ప్రాంతాలను సీప్లేన్ సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ అధ్వర్యంలో అమలవుతున్న ప్రాంతీయ విమాన అనుసంధాన పథకం ఉడాన్ కింద దేశవ్యాప్తంగా సీప్లేన్ సేవలను విస్తరిస్తున్నాం. సీప్లేన్ కార్యకలాపాలకు సంబంధించిన వాటర్ బాడీల సాధ్యాసాధ్యాలను అంచనా వేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని కేంద్ర మంత్రి తెలిపారు.

'ఇండియా ఏఐ సిటీ'గా అమరావతిని గుర్తించండి

- లోక్‌సభలో ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరావతిని 'ఇండియా ఏఐ సిటీ'గా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ తెన్నేటీ కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో 377 నియమం కింద ఆయన మాట్లాడారు. 'అమరావతిని ఏఐ సిటీగా గుర్తించడం ద్వారా 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాలు నెరవేరతాయి. 'స్వర్ణాంధ్రప్రదేశ్' దీర్ఘకాలిక లక్ష్యం సాకారమవుతుంది. తద్వారా భారత్ ప్రపంచ సాంకేతిక నాయకత్వంలో ముందుంటుంది. అమరావతిని అత్యాధునిక సాంకేతిక నగరంగా అభివృద్ధి చేయడానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం(పీఎల్ఐ), మాడిఫైడ్ స్పెషల్ ఇన్సెంటివ్ ప్యాకేజ్ స్కీమ్(ఎం-సిప్స్) వంటి పథకాల కింద తగిన ఆర్థిక సహాయం అందించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం... ఉన్నత ఏఐ పరిశోధనా కేంద్రాలు, క్వాంటం టెక్నాలజీ సౌకర్యాల కల్పన, ఇన్నోవేషన్ క్లస్టర్‌లు, ఒక ఏఐ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది.' అని ఎంపీ వివరించారు.

సోలార్ రూఫ్ టాప్‌నకు నాబార్డు రుణం

- 3,762.26 కోట్లకు ప్రభుత్వ గ్యారెంటీ

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రూఫ్ టాప్ సోలార్ పథకం కోసం నాబార్డు నుంచి రూ.3,762.26 కోట్ల రుణాన్ని తీసుకోవాలని విద్యుత్తు పంపిణీ సంస్థలు నిర్ణయించాయి. ఈ రుణానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వనుంది. ఈమేరకు సోమవారం జీవో నంబరు 95 విడుదల చేశారు. పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా ఏర్పాటు చేయనున్న సోలార్ రూఫ్ టాప్‌లను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనికి నాబార్డు నుంచి రుణంగా తీసుకుంటున్నారు.

వాయిదాల్లో 'నైపుణ్యం'

- పోర్టల్ ప్రారంభంలో నైపుణ్యాభివృద్ధి శాఖ తీవ్ర కాలయాపన
- సీఎం, మంత్రి ఆదేశించినా పరిస్థితి మారలేదు
- యువతకు ఎదురుచూపులు తప్పట్లేదు
- నైపుణ్య గణన అడ్రస్ గల్లంతు.. పైలెట్‌తోనే సరి
- సర్వేనీ దాచిపెట్టిన నైపుణ్యాభివృద్ధి సంస్థ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఉద్దేశించిన 'నైపుణ్యం' పోర్టల్‌పై నైపుణ్యాభివృద్ధి శాఖ తీవ్ర కాలయాపన చేస్తోంది. పోర్టల్ అదిగో ఇదిగో అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా, వెబ్‌సైట్ మాత్రం ప్రారంభం కావడం లేదు. మరోవైపు ప్రతిష్ఠాత్మకం అని ప్రకటించి చేపట్టిన నైపుణ్య గణన అడ్రస్ లేకుండా పోయింది. ఆరు నెలల్లో రాష్ట్రమంతా నైపుణ్య గణన పూర్తిచేస్తామని అప్పట్లో కూటమి ప్రభుత్వం ప్రకటించగా ఇప్పటికి ఏడాదిన్నర దాటినా అసలు పైలెట్ ప్రాజెక్టు ఏమైందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కనీసం నైపుణ్యం పోర్టల్ అయినా అందుబాటులోకి వస్తే ఉద్యోగాలు, నైపుణ్యం, జాబ్ మేళాలకు సంబంధించిన సమాచారం సులభంగా తెలుసుకోవచ్చని యువత ఎంతగానో ఎదురుచూస్తోంది. కానీ నైపుణ్యాభివృద్ధి శాఖ మాత్రం అసలు ఆ వెబ్‌సైట్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వట్లేదు. పోర్టల్ ప్రారంభించేస్తున్నాం అంటూ మూడు, నాలుగు నెలలుగా హడావుడి చేస్తున్నారు. సెప్టెంబరులోనే పోర్టల్ ప్రారంభించాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ ఆదేశించినా ఫలితం లేదు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో పోర్టల్ ప్రారంభించాలని ఆ సదస్సుకు ముందు జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అయినా దానిపై ఎలాంటి పురోగతి కనిపించలేదు. నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు కూడా దీనిపై ఎలాంటి ప్రకటన చేయట్లేదు. కనీసం ఎప్పుడు పోర్టల్ అందుబాటులోకి వస్తుందనే సమాచారం కూడా యువతకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

సమగ్రంగా పోర్టల్ తయారీ

నైపుణ్యం వెబ్‌సైట్‌ను సమగ్రంగా రూపొందిస్తున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే అనేకసార్లు వెల్లడించింది. యువత వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారి వివరాలను ఇస్తే ఆటోమేటిక్‌గా రెజ్యూమ్ తయారవుతుంది. అలాగే వారి నైపుణ్యాలకు తగ్గ ఉద్యోగాలు దేశంలో ఎక్కడెక్కడ అందుబాటులో ఉన్నాయనే సమాచారం కూడా అందుబాటులో ఉంచుతారు. నైపుణ్య కోర్సులు వాటి వివరాలు, నైపుణ్య కేంద్రాలు ఎక్కడున్నాయనే సమాచారం కూడా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్వహించే జాబ్‌మేళాల సమాచారం కూడా అందులో పెడతారు. యువత వారికి ఉన్న నైపుణ్యాలతో కెరీర్‌ను ఎలా మలుచుకోవాలి? అనే అవకాశం కూడా లభిస్తుంది. ఈ పోర్టల్‌ను స్కిల్ ఇండియా పోర్టల్‌తోనూ అనుసంధానం చేస్తున్నారు.

నైపుణ్య గణన ఏమైంది?

మరోవైపు నైపుణ్య గణన అడ్రస్ లేకుండా పోయింది. రాష్ట్రంలో 18 నుంచి 59ఏళ్ల మధ్య వయసున్న ప్రతి ఒక్కరి నైపుణ్యాలపై సర్వే చేయడం దీని ఉద్దేశం. తద్వారా రాష్ట్రంలో ఏ నైపుణ్యాలున్న వారు ఎంతమంది ఉన్నారు? వారి నైపుణ్యాలకు తగ్గట్టుగా ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పించాలి? నైపుణ్యాలను మరింతగా ఎలా మెరుగుపరచాలి? అనేవి తెలుసుకునేందుకు, దానికి తగ్గట్టుగా చర్యలు తీసుకునే లక్ష్యంతో దీనిని చేపట్టారు. తొలుత మంగళగిరి నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా నైపుణ్య గణన ప్రారంభించారు. దీనిపై పలుమార్లు సీఎంకు కూడా ప్రజెంటేషన్ ఇచ్చారు. కానీ ఆ తర్వాత నైపుణ్యాభివృద్ధి సంస్థ దానిపై మౌనాన్ని పాటిస్తోంది. చివరికి మంగళగిరి పైలెట్ సర్వే వివరాలను కూడా బయటపెట్టకుండా దాచిపెట్టింది.



క్వాంటమ్ కంప్యూటింగ్ సంస్థలకు భారీగా ప్రోత్సాహకాలు

- సానుకూల వాతావరణ కల్పనకు ప్రభుత్వ నిర్ణయం
- పెట్టుబడులకు అనుగుణంగా రాయితీలు
- స్టార్టప్‌లకూ పలు ఇన్సెంటివ్‌లు
- 2025-30కు మార్గదర్శకాలు విడుదల

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో పెట్టుబడులు పెట్టే సంస్థలకు భారీగా ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ 2025-30కు సంబంధించి సోమవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. క్వాంటమ్ కంప్యూటింగ్, అనుబంధ సంస్థల నిర్వహణలో అనుభవాన్ని వినియోగించుకోవడం, స్టార్టప్‌లకు ప్రోత్సాహకాలను ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో సానుకూల వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మార్గదర్శకాల ఉత్తర్వుల్లో ఐటీశాఖ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని ప్రభుత్వం ప్రకటించింది. ఆ సంస్థలకు 'టైలర్‌మేడ్ ఇన్సెంటివ్' విధానంలో ప్రోత్సాహకాలను ఇచ్చి మరింత ప్రోత్సహించనుంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సమయంలోనే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుని, అనుమతులు పొందాలి. పెద్ద కంపెనీయా? స్టార్టప్ కంపెనీయా? అనేది కూడా అప్పుడే చెప్పాలి. దీని ఆధారంగా నిపుణుల కమిటీ ప్రోత్సాహకాలను ఇస్తుంది. స్టార్టప్ కంపెనీలు నిర్వహించే కార్యక్రమాలు, వాటికి అయ్యే వ్యయాన్ని, అర్హతగల స్టార్టప్‌లకు రెంటల్ సబ్సిడీని ఐటీ శాఖ భరిస్తుంది. హార్డ్ వేర్ సేవలకూ ప్రోత్సాహకాలను అందిస్తారు. స్టాంప్ డ్యూటీలో వంద శాతం రాయితీని ఇస్తారు. మెషినరీ కొనుగోలు పన్నులను పూర్తిగా చెల్లిస్తారు. విద్యుత్తు చార్జీల్లోనూ రాయితీని ఇస్తారు. సంస్థ స్థాపించిన ఆరు నెలల్లోనే ఎస్‌జీఎస్‌టీ సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇస్తుంది. రూ. 10 కోట్లు వరకూ, ఆపైబడి పెట్టుబడులు పెట్టే సంస్థలకూ సమయానుకూలంగా ప్రోత్సాహకాలను అందిస్తారు. ప్రోత్సాహకాలను మూడు దశల్లో ప్రభుత్వం చెల్లిస్తుంది. మొదటిదశలో 15 శాతం, రెండో దశలో 30 శాతం, మూడో దశలో 55 శాతం చొప్పున చెల్లిస్తారు. ప్రోత్సాహకాల కోసం రాష్ట్ర క్వాంటమ్ మిషన్ కార్యనిర్వాహక కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. ఎర్లీ బర్డ్ పథకం కింద మొదటి 20 సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తారు. సంస్థల్లోని టాలెంట్‌ను కూడా ప్రోత్సహిస్తారు. పెట్టుబడులకు అనుగుణంగా రాయితీలను ఇస్తారు. ఈ మార్గదర్శకాలకు లోబడి క్వాంటమ్ కంప్యూటింగ్, స్టార్టప్ సంస్థలకు ప్రోత్సాహకాలు వెంటనే విడుదల అవుతాయి.

ప్రైవేట్ ఆలయాల్లో రద్దీకి తగ్గట్లు బందోబస్తు ఉండాలి

- అధికారులకు సీఎస్ విజయానంద్ ఆదేశం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగల సీజన్‌లో రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాల్లో భక్తుల రద్దీ, బందోబస్తు విషయాల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో సోమవారం జరిగిన సమీక్షలో పలు ఆదేశాలు ఇచ్చారు. "వైకుంఠ ఏకాదశి, ధనుర్మాసం తదితర పర్వదినాలు, పండుగల రోజుల్లో ఆలయాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల విషయంలో నిబంధనావళి రూపొందించి అన్ని ప్రైవేటు ఆలయాలకు జారీ చేయాలి. ప్రైవేటు ఆలయాలు మీ పరిధికాదనే నిర్లక్ష్యం వద్దు. జిల్లాల్లో అధికారులు తమ పరిధిలోని ప్రైవేటు ఆలయాల పర్యవేక్షణపైన కూడా దృష్టి పెట్టాలి. రద్దీ నియంత్రణకు పోలీసుల అనుమతి తీసుకుని, తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసేలా చూడాలి. తొక్కిసలాటలకు ఆస్కారం లేకుండా చూడాలి" అని ఆదేశించారు.

రబీకి ఎరువుల కొరత ఉండదు..

రబీ సీజన్‌కు ఎరువుల కొరత ఉండకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. దీనిపై వ్యవసాయశాఖ అధికారులు స్పందిస్తూ, రైతులకు కావాల్సినంతగా ఎరువులు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. రబీలో ఎక్కడా కొరత ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలు మరింతగా ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ సూచించారు.

'పీఎం ఉష' కింద ఏపీకి రూ.378 కోట్లు

- మహిళా వర్సిటీకి 100 కోట్లు.. ఆరు వర్సిటీలకు 120 కోట్లు
- లోక్‌సభలో ఎంపీ కలిశెట్టి ప్రశ్నలపై కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'ప్రధాన మంత్రి ఉన్నత శిక్షా అభియాన్ (పీఎం ఉష)' పథకం కింద ఏపీలో ఉన్నత విద్యారంగంలో మౌలిక సదుపాయాలు, నాణ్యతను పెంచేందుకు 33 యూనిట్లను ఆమోదించి రూ.378.75 కోట్లు మంజూరు చేసినట్లు కేంద్రం తెలిపింది. సోమవారం లోక్‌సభలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు.. ఈ పథకంపై అడిగిన ప్రశ్నలకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లు, శ్రీకృష్ణదేవరాయ, ఆదికవి నన్నయ, యోగి వేమన, కృష్ణా, విక్రమ సింహపురి, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలకు రూ.20 కోట్ల చొప్పున రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 21 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు ఒక్కొక్క దానికి రూ.5 కోట్లు చొప్పున మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలు, అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్యలో సమాన అవకాశాలు కల్పించేందుకు అనంతపురం, విజయనగరం, అల్లూరి సీతారామ రాజు, కృష్ణా, వైఎస్సార్ జిల్లాలకు ఒక్కో జిల్లాకు రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.50 కోట్లు మంజూరు చేశామన్నారు.

ఏపీకి రూ.88 వేల కోట్ల ముద్రా రుణాలు

పీఎం ముద్ర యోజన కింద ఏపీలో రూ.88 వేల కోట్లకు పైగా రుణాలను పంపిణీ చేసినట్లు కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని 72 లక్షలకు పైగా ఖాతాలకు ఈ రుణాలను జమ చేసినట్లు పేర్కొంది. సోమవారం, లోక్‌సభలో టీడీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

భర్త మహాశయులకు బెల్లా.. బెల్లా!



రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు టైటిల్ గ్లింప్స్ విడుదల చేసిన నిర్మాత తాజాగా 'బెల్లా బెల్లా' పాటను రిలీజ్ చేశారు. 'స్పెయిన్ కే అందాల నిట్ట.. అద్దిన ఓ పూలబుట్టా' అంటూ సురేశ్ గంగుల రాసిన పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచారు. నకాశ్ అజీజ్, రోహిణి సోరాట్ పాడిన ఈ పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సంక్రాంతి సందర్భంగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం విడుదల కానుంది.

మధ్యతరగతి యువకుడి ప్రేమకథ



సంచలన విజయం సాధించిన 'బేబీ' చిత్రం తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కలసి నటిస్తున్న చిత్రం 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్‌తో అందరినీ ఆకట్టుకున్న ఆదిత్య హాసన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టైటిల్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ 'తెలుగులో పూర్తి స్థాయిలో రొమాంటిక్ కామెడీ చిత్రాలు రావడం లేదు. ఈ లోటుని మా సినిమా భర్తీ చేస్తుంది. లండన్‌లో జరిగే కథే అయినా ఇది మన ఇంట్లో జరిగే కథలా ఉంటుంది. వైష్ణవి బాగా నటించారు' అని అన్నారు. యువతకు నచ్చే అందమైన ప్రేమ కథ ఇదని హీరోయిన్ వైష్ణవి చెప్పారు. హీరో పాత్రకు చాలా మంది అబ్బాయిలు కనెక్ట్ అవుతారు. ఆదిత్య హాసన్ మనలాంటోడు. మనలో ఒకడిగా కనిపిస్తారు. జీవితంలో మనం దాటి వచ్చిన చిన్న చిన్న అందమైన జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని ఆమె చెప్పారు. ఓ మధ్యతరగతి యువకుడి ప్రేమకథ ఇదని దర్శకుడు ఆదిత్య హాసన్ చెప్పారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'ఉత్తేజకరమైన, భావోద్వేగాలు కలిగిన మృదువైన ప్రేమకథ ఇది. దీనికి కొన సాగింపు ఉంటుంది కనుకే 'ఎపిక్. ఫస్ట్ సెమిస్టర్' అని పేరు పెట్టాం' అని ఆయన తెలిపారు.

ఫ్యూచర్ సిటీలో మరో ఫిల్మ్‌సిటీ!

- హైదరాబాద్‌లో ఏర్పాటుకు ముందుకొచ్చిన అజయ్ దేవ్‌గన్
- ఇప్పటికే సల్మాన్ ఖాన్‌కు అవకాశమిచ్చిన ప్రభుత్వం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోనే ఒప్పందాలు



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయనున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలోనే దీన్ని ఏర్పాటు చేస్తారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సందర్భంగా ఫిల్మ్‌సిటీకి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం(ఎంఓయూ) చేసుకుంటారు. ఇప్పటికే, మరో బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు కూడా ఇక్కడే భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫ్యూచర్ సిటీలో ఇది రెండో ఫిల్మ్ సిటీ. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం వినోదం, పర్యాటక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి భారీ స్పందన లభిస్తోందని ప్రభుత్వం తెలిపింది. ఈ సమిట్‌లోనే అజయ్ దేవగన్ ప్రపంచ స్థాయి ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు వెల్లడించింది.

అంచనాలకు మించి ఉంటుంది

నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'అఖండ 2.. తాండవం' చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట సోమవారం విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

- బాలయ్యబాబు, బోయపాటి లది బ్లాక్‌బస్టర్ కాంబినేషన్. హ్యాట్రిక్ విజయాల తర్వాత వస్తున్న సినిమా ఇది. బిగ్ స్పాన్ ఉన్న కథ ఇది. బాలయ్యలో ఎనర్జీ ఇంకా పెరిగింది. ఆయనతో కాసేపు మాట్లాడితే ఆ ఎనర్జీ మనకీ వస్తుంది.
- ఈ సినిమాలో కొంత భాగాన్ని కుంభమేళాలో షూట్ చేశాం. అక్కడ షూటింగ్ చేయాలంటే ఎన్నో అనుమతులు కావాలి. అవన్నీ మాకు దొరికాయి. డ్రోన్ పర్మిషన్ కూడా లభించింది. సినిమాలో మీరు చూడబోయే ప్రతి సన్నివేశం ఈ సినిమా కోసం తీసిందే. బోయపాటి అహర్నిశలు కష్టపడి కుంభమేళా సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారు.
- ఈ సినిమా మొదలుపెట్టినప్పుడే దేశం మొత్తం విడుదల చేయాలనుకున్నాం. అయితే పాన్ ఇండియా కోసం అంటూ ప్రత్యేకంగా చేసిన మార్పులు ఏమీ లేవు. ఇది పాన్ ఇండియా కంటెంట్. సినిమాలో గూస్ బంప్స్ మూమెంట్స్ చాలా ఉంటాయి. బాలయ్య , బోయపాటిల నుంచి ఏమి ఆశిస్తారో ఆ అంచనాలను మించి సినిమా ఉంటుంది.
- సినిమాలో పతాక సన్నివేశాలను జార్జియాలో చిత్రీకరించాం. నిజానికి కశ్మీర్‌లో చేయాల్సిన సన్నివేశాలు అవి. కానీ అదే సమయంలో పెహల్గాం దాడి జరగడంతో అనుమతులు రాలేదు. మైనస్ డిగ్రీ చలిలో జార్జియాలో షూటింగ్ చేశాం. బాలయ్య అఘోరా గెటప్‌లో అంత చలిలో కూడా అద్భుతంగా చేశారు.
- దక్షిణాదిలో అన్ని భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నాం. హిందీలో కూడా విడుదలవుతోంది. బీహార్‌లో అవధి అనే భాషలో కూడా అనువదించి విడుదల చేస్తున్నాం.

పాట పాడుకొన్న ద్రౌపది



రిచర్డ్ రిషి హీరోగా నేతాజీ ప్రొడక్షన్స్, జీఎం ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలు నిర్మిస్తున్న భారీ చిత్రం 'ద్రౌపది 2'. మోహన్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో రక్షణ చంద్రచూడన్ టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'నెలరాజే' అనే పాటను సోమవారం మేకర్స్ విడుదల చేశారు. యువతి కాబోయే వరుడిని మనసులో ఊహించుకుంటూ పాడే ఈ పాటను సామ్రాట్ రాయగా, పద్మలత పాడారు. జిబ్రాన్ స్వరాలు సమకూర్చారు. అన్ని కార్యక్రమాలు త్వరలో పూర్తి చేసి విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత సోల చక్రవర్తి చెప్పారు.

వివాహ బంధంలోకి సమంత - రాజ్

- 'భూత శుద్ధి వివాహం'తో ఒక్కటైన జంట



హీరోయిన్ సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు భూత శుద్ధి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌లో వున్న లింగ భైరవ ఆలయంలో వీరి వివాహం సోమవారం ఉదయం జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వివాహానికి హాజరయ్యారు. ఆ తర్వాత సమంత, రాజ్ నిడిమోరు తమ ఇన్‌స్టాఖాతాల్లో పెళ్ళి ఫోటోలను షేర్ చేసి అధికారికంగా వెల్లడించారు. ఈ పెళ్ళిలో సమంత ఎర్రరంగు చీర, జాకెట్ ధరించగా, రాజ్ నిడిమోరు క్రీమ్ గోల్డ్ కలర్ కుర్తాను ధరించారు. నాగచైతన్యతో సమంత వివాహం ఎంత ఆర్భాటంగా జరిగిందో, దానికి భిన్నంగా రాజ్‌తో ఆమె పెళ్లి సింపుల్‌గా జరగడం గమనార్హం. కాగా, హిందీ బుల్లితెర జంట వరుణ్ జైన్, గియో మానిక్‌లది కూడా భూతశుద్ధి వివాహమే. సమంత, రాజ్ నిడిమోరుల పెళ్లి భూతశుద్ధి పద్ధతిలో జరిగిందని ఈషా ఫౌండేషన్ ప్రకటించడంతో ఇప్పుడు ఆ వివాహ పద్ధతి గురించి అన్వేషణ మొదలైంది.

భూత శుద్ధి వివాహం అంటే...

భూత శుద్ధి వివాహం అనేది యోగా సంప్రదాయ విధానంలో వేలాది సంవత్సరాలుగా జరుగుతున్న అత్యంత పవిత్రమైన వివాహ పద్ధతి. ఇందులో పేరుకు తగ్గట్టుగానే ఆలోచనలు, భావోద్వేగాలు, భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరిచేందుకు రూపొందించిన విశిష్టమైన ప్రక్రియ. లింగ భైరవి ఆలయాల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించే ఈ వివాహ క్రతువు వధూవరుల దేహాన్ని శుద్ధి చేస్తుంది. వారి దాంపత్య ప్రయాణంలో సామరస్యం, శ్రేయస్సు, ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా దేవీ అనుగ్రహాన్ని ప్రసాదిస్తుందని నమ్ముతారు. సాధారణంగా హిందూ జంటలకు చేసే సంప్రదాయ మంత్రోచ్చారణలతో పాటూ వధూవరుల శరీరం, మనసు, జీవశక్తి స్థాయులను సమన్వయం చేసే యోగిక క్రతువులతో ఈ వివాహం జరుపుతారు. ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ నిర్వహించే కార్యక్రమాల్లో తరచూ పాల్గొనేవారు సమంత. ఆ ప్రదేశంతో ఉన్న ప్రత్యేక అనుబంధమే ఆమె ఈ వివాహ ప్రక్రియను ఎన్నుకోవడానికి కారణమని అంటున్నారు.

ఎవరీ రాజ్ నిడిమోరు?

'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న రాజ్ నిడిమోరు స్వస్థలం తిరుపతి. ఆయన పూర్తి పేరు రాజేశ్. అమెరికాలో కొన్నాళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. సినిమాలపై ఆసక్తితో తన మిత్రుడు డీకేతో కలసి పని చేయడం మొదలుపెట్టారు. 'రాజ్ అండ్ డీకే'గా వీరిద్దరూ పేరు తెచ్చుకున్నారు. ఈ దర్శక ద్వయం తెరకెక్కించిన తొలి సినిమా 'ఫ్లేవర్స్'. ఆ తర్వాత '99', 'గో గోవా గాన్', 'హ్యాపీ ఎండింగ్' చిత్రాలు చేశారు. 2019లో వీరు రూపొందించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్ సిరీస్ తొలి సీజన్ ఈ దర్శకద్వయానికి మంచి బ్రేక్‌నిచ్చింది.

పరిచయం నుంచి పెళ్లి వరకూ...

సమంత, రాజ్ నిడిమోరుకు మొదటిసారి ఓ పెర్ఫ్యూమ్ యాడ్‌లో పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సినిమాల పరంగా వీరు తొలిసారి 'ఫ్యామిలీ మ్యాన్ 2' కలసి పనిచేశారు. 2021లో ఇది విడుదలవ్వగా, ఆ తర్వాత 'సిటాడెల్ : హనీ.. బన్నీ'లో కలసి మరోసారి రాజ్ దర్శకత్వంలో సమంత నటించారు. ఆమె సొంతంగా 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' సంస్థను నెలకొల్పిన సంగతి తెలిసిందే. అందులో రాజ్ నిడిమోరు కూడా ఓ భాగస్వామి. ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం'కు ఆయన క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. నాగచైతన్యతో విడాకులు తీసుకున్న కొంతకాలానికి సమంత, రాజ్ నిడిమోరు కలసి పబ్లిక్‌లో కనిపించడం మొదలుపెట్టారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఆ ఊహాగానాలను మరింత పెంచుతూ ఇద్దరూ కలసి 'శుభం' ప్రమోషన్స్‌లో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఆ తర్వాత ఇద్దరూ కలసి విహార యాత్రలకు, సినిమాలకు వెళ్లడం.. పండగలు సెలబ్రేట్ చేసుకోవడమే కాకుండా అప్పుడు తీసుకున్న ఫొటోలను తమ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తుండడంతో ఆ ఊహాగానాలకు మరింత బలం చేకూరింది.



మాజీ భార్య శ్యామాలితో...

ఇద్దరికీ ద్వితీయ వివాహమే..

దర్శకుడు రాజ్ నిడిమోరు 2015లో రచయిత శ్యామాలిని పెళ్లి చేసుకున్నారు. 'ఓంకార', 'రంగ్ దే బసంతి' చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారామె. ఏడేళ్ల వైవాహిక జీవితం గడిపాక 2022లో ఈ జంట విడాకులు తీసుకుంది. మరోవైపు సమంతకు కూడా ఇది రెండో వివాహమే. 2010లో విడుదలైన 'ఏ మాయ చేశావే'లో అక్కినేని నాగచైతన్యతో కలసి నటించారు సమంత. ఆ సినిమా సమయంలోనే వీరిద్దరి పరిచయం ప్రేమగా మారింది. 2017లో వివాహబంధంలోకి అడుగుపెట్టారు. అనుకోని కారణాల వల్ల 2021లో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. 2024లో శోభిత ధూళిపాలను నాగచైతన్య పెళ్ళాడిన సంగతి తెలిసిందే.

వైరల్‌గా మారిన రాజ్ మాజీ భార్య పోస్టు

రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. 'తెగించిన వ్యక్తులు దానికి తగినట్టుగానే వ్యవహరిస్తారు' అని పేర్కొన్నారు. ఆమె వీరిని ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు అందరూ అనుకుంటున్నారు. మరోవైపు నటి పూనమ్ కౌర్ 'నీకంటూ సొంత జీవితం సృష్టించుకోవడానికి ఓ పచ్చటి కాపురాన్ని కూల్చావు' అని పేర్కొన్నారు.

పీఎంకేఎస్‌వై 3.0లో వాటర్‌షెడ్లు

» కొత్తగా 405 ప్రాజెక్టుల కోసం కేంద్రానికి విజ్ఞప్తి

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ చొరవతో ప్రధానమంత్రి కిసాన్ సంచయి యోజన(పీఎంకేఎస్‌వై) ద్వారా రాష్ట్రానికి భారీ సంఖ్యలో వాటర్‌షెడ్ ప్రాజెక్టుల రానున్నాయి. ఇప్పటికే పీఎంకేఎస్‌వై 2.0 ద్వారా 59 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు అమల్లో ఉన్నప్పటికీ అవి పరిమితంగా 13 జిల్లాల్లోనే ఉన్నాయి. తాజాగా పీఎంకేఎస్‌వై 3.0 కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ 23 జిల్లాల్లోని 2259 గ్రామ పంచాయతీల్లో సుమారు 405 ప్రాజెక్టులకు ప్రతిపాదనలను పంపించింది. ఈ ప్రాజెక్టులన్నీ మంజూరైతే సుమారు 16 లక్షల హెక్టార్లలో వాటర్‌షెడ్ పనులు ప్రారంభమవుతాయి. మార్చినాటికి ఇవి వస్తాయంటున్నారు.

మల్టీపర్పస్ తుఫాను ఆశ్రయ కేంద్రాలు కట్టండి

» లోక్‌సభలో ఎంపీ వల్లభనేని బాలశౌరి

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గం వరదలు, తుఫానులకు నిలయంగా మారిందని, అందువల్ల కొత్తగా బహూళార్థసాధక తుఫాను ఆశ్రయ కేంద్రాలను నిర్మించాలని ఎంపీ వల్లభనేని బాలశౌరి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. మచిలీపట్నం, కృష్ణా డెల్టా ప్రాంతాల్లో 40 ఏళ్ల క్రితం నిర్మించిన తుఫాను షెల్టర్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయని తెలిపారు.

రేపటి నుంచి ఏకలవ్య స్కూల్స్ 'ఉద్భవ్-2025'

» 22 రాష్ట్రాల నుంచి గిరిజన విద్యార్థుల రాక

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ఈనెల 3 నుంచి 5వరకు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు.. 'ఉద్భవ్-2025'కు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. కేఎల్ యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు 22 రాష్ట్రాలకు చెందిన 405 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నుంచి 1644 మంది విద్యార్థులు, 278 మంది సంబంధిత ప్రతినిధులు పాల్గొంటున్నారు.

ఇరిగేషన్, హౌసింగ్ అధికారులపై ఆరోపణలు

» విచారణకు ఆదేశిస్తూ సర్కారు ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలం నెల్లిమట్ట గ్రామం దాకా రెల్లిగడ్డ కాలువ నిర్మాణంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో పది మంది జల వనరుల శాఖ, ఐదుగురు ఆర్థిక విభాగం అధికారులపై దర్యాప్తు చేయాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. విచారణ అధికారిగా ధవళేశ్వరం గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీరు కె.శేషుబాబును నియమించారు. అలాగే, గృహ నిర్మాణశాఖకు సంబంధించి.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లా నూజివీడు మండలంలో పనిచేసిన కాలంలో ఐదుగురు అధికారులపై అభియోగాలు వచ్చాయి. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం అమలులో వీరు పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అదే శాఖకు చెందిన డిప్యూటీ సెక్రటరీ బి.సహదిత్ వెంకట త్రివినాగ్‌ను విచారణాధికారిగా నియమించారు.

ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేయొద్దు: సీపీఎం

రాష్ట్రంలోని రహదారుల నిర్మాణం, మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన విలువైన భూములు, భవనాలు, డిపోలు, ఇతర స్థిరాస్తులను కార్పొరేట్ కంపెనీలకు నామమాత్రపు ధరకే లీజుకు, తనఖాకు ఇవ్వాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సోమవారం ఆయన లేఖ రాశారు.

రేపు 'రైతన్నా.. మీకోసం' వర్క్‌షాప్‌లు

» నల్లజర్ల-2 ఆర్ఎస్‌కేలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 3న రాష్ట్రవ్యాప్తంగా రైతుసేవా కేంద్రాల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే అంశాలతో నవంబరు 24 నుంచి 29 వరకు 'రైతన్నా.. మీకోసం' వారోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా ప్రస్తుత రబీ, వచ్చే ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వ్యవసాయ ఉత్పత్తులకు స్థూల విలువ పెంపు దిశగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించేందుకు రైతుసేవా కేంద్రం స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల-2 రైతు సేవా కేంద్రంలో జరిగే వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు పాల్గొనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సోమవారం తెలిపారు.

వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):గ్రామ, వార్డు సచివాలయాల్లో నకిలీ సర్టిఫికెట్లతో 1,200 మంది పశుసంవర్ధకశాఖ సహాయకులు పనిచేస్తున్నారంటూ మీడియా ద్వారా నిరాధార ఆరోపణలు చేసిన ఏపీ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్యపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ సహాయకుల సంఘ అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడుకు సంఘం తరపున వినతి పత్రం అందజేశారు.

అటవీ శాఖ సీవీవోగా వినయ శ్రీనివాస్

రాష్ట్ర అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ సి.వినయ శ్రీనివాస్‌ను నియమిస్తూ అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఫోన్ నంబర్లు 0863-2444606, 9440399670గా ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

సెంట్రల్ లైబ్రరీ డిజైన్ల పరిశీలనకు కమిటీ

అమరావతిలో నిర్మించతలపెట్టిన సెంట్రల్ లైబ్రరీకి డిజైన్ల పరిశీలన, అనంతర ప్రక్రియ కోసం పాఠశాల విద్యాశాఖ కమిటీని నియమించింది. ఈ కమిటీకి ఆ శాఖ కార్యదర్శి చైర్మన్‌గా, పౌర గ్రంథాలయాల డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. లైబ్రరీ నిర్మాణానికి ఆసక్తిగల కంపెనీల నుంచి డిజైన్ ప్రతిపాదనలను విద్యాశాఖ ఆహ్వానించింది. ఆ గడువు సోమవారంతో ముగిసింది. ఆ డిజైన్ ప్రతిపాదనల పరిశీలన అనంతరం సాంకేతిక పరిశీలన, ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టనున్నారు.

లీన్ కన్‌స్ట్రక్షన్ సేవలు వినియోగించుకుంటాం

» మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

ఏర్పేడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యర్థాలను తగ్గించడానికి లీన్ కన్‌స్ట్రక్షన్ ఉపయోగపడుతుందని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. మున్సిపల్, పట్టణాల అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి ఈ పని విధానం ఉపకరిస్తుందని అన్నారు. ఈ సేవలను రాష్ట్రంలో వినియోగించుకుంటామని చెప్పారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో సివిల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ విభాగం, ఇండియన్ లీన్ కన్‌స్ట్రక్షనల్ ఎక్సలెన్సీ(ఐఎల్‌సీఈ)తో కలిసి ఇండియన్ లీన్ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ నెల 3వ తేదీ వరకు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన సోమవారం ఇండస్ట్రీ డే కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ఈ కాన్ఫరెన్సులో పరిశ్రమలు, విద్యా సంస్థలు, ప్రభుత్వం నుంచి నిపుణులు.. నిర్మాణ రంగంలో లీన్ కన్‌స్ట్రక్షన్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులపై చర్చించారు. లీన్ కన్‌స్ట్రక్షన్ డిజిటలైజేషన్‌లో భాగంగా బీఐఎం, ఏఐ, డిజిటల్ టూల్స్ ద్వారా ప్రాజెక్టు డెలివరీ మెరుగుదల అంశాలను నారాయణ పరిశీలించారు.

గృహ హింస బాధిత మహిళలకు మరింత రక్షణ!

» ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా సీడీపీవోలు, ఏసీడీపీవోలు

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గృహ హింస బాధిత మహిళలకు రక్షణ అధికారుల నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గృహ హింస నివారణ చట్టం-2005 ప్రకారం ఇప్పటి వరకు జిల్లాల వారీగా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు రక్షణ అధికారులుగా వ్యవహరిస్తుండగా, ఇకపై సీడీపీవోలు, ఏసీడీపీవోలను కూడా ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించింది. అలాగే, బాధిత మహిళలకు ఆశ్రయం కల్పించే షెల్టర్ హోమ్స్‌ను గుర్తిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది.

హనుమాన్ రక్ష..!

వన్యప్రాణుల సంరక్షణ, పర్యవేక్షణకు కొత్త ప్రాజెక్ట్

'హనుమాన్' ప్రాజెక్ట్‌లో కృత్రిమ మేధ వినియోగం

» రూ.11.62 కోట్లతో పరికరాలు, వసతులు

» తొలుత చిత్తూరు జిల్లాలో అమలు

» త్వరలో రాష్ట్రమంతా విస్తరణ.. మార్చిలోగా కొత్త యాప్

» డిప్యూటీ సీఎం చొరవతో చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



మానవులు-వన్యప్రాణుల మధ్య సంఘర్షణలు, ముఖ్యంగా ఏనుగులతో ఎదురవుతున్న నష్టాలను నివారించడంతోపాటు అడవి జంతువుల సంరక్షణ కోసం రాష్ట్ర అటవీ శాఖ ఇటీవలే 'హనుమాన్' ప్రాజెక్టును ప్రారంభించింది. అడవి జంతువుల వల్ల కలిగే ప్రమాదాలు, నష్టాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలు, పంటలు, పశువులను రక్షించడంతోపాటు అడవి జంతువులను నిరంతరం పర్యవేక్షించడం, వాటిని సంరక్షించడం, వాటికి అవసరమైన సహాయం అందించాలనేది 'హనుమాన్' (హీలింగ్ అండ్ నర్చరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్, ఎయిడ్ అండ్ నర్సింగ్ ఆఫ్ వైల్డ్‌లైఫ్) ప్రాజెక్టు లక్ష్యం. కృత్రిమ మేధ వంటి అత్యాధునిక సాంకేతికతతో నిర్వహించే ఈ ప్రాజెక్ట్ కోసం రూ.11.62 కోట్లు ఖర్చు చేయనున్నారు. ప్రకృతి, అడవులు, వన్యప్రాణులు, జీవవైవిధ్యం మెండుగా ఉన్న ఉత్తర, దక్షిణాంధ్రల్లో ఏనుగులు, పాపికొండల ప్రాంతంలో పులులు, రాష్ట్రవ్యాప్తంగా చిరుతలు, అడవి పందులు, పాములు, కోతులు, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎలుగుబంట్లు, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కృష్ణ జింకలు, అటవీ సరిహద్దుల్లో చుక్కల జింకలు ఉన్నాయి. ఈ హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఇటీవల మానవ-వన్యప్రాణుల సంఘర్షణలు పెరిగాయి. ముఖ్యంగా ఏనుగుల గుంపు దాడులతో పంటలు, జనావాసాలు ధ్వంసం అవుతుండగా... పశువులతోపాటు మనుషులు కూడా చనిపోతున్నారు. ఇలాంటి సంఘటనల కారణంగా గత దశాబ్దకాలంలో 71 మంది మనుషులు మృతిచెందగా 29 మంది గాయపడ్డారు. అలాగే 722 జంతువులు కూడా చనిపోయాయి. 17,192 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. దీనికోసం అటవీశాఖ రూ.14.94 కోట్లు పరిహారంగా చెల్లించింది. ఈ నేపథ్యంలో వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణలను తగ్గించేందుకు ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో అటవీశాఖ 'హనుమాన్' (వన్యప్రాణుల పర్యవేక్షణ, సహాయం, వైద్యం, పోషణ కేంద్రాలు)కు రూపకల్పన చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా.. ఏనుగులతో సహా అడవి జంతువులను గుర్తించడానికి, అధికారులకు రియల్ టైమ్‌లో హెచ్చరికలు పంపడానికి కృత్రిమ మేధ, సౌరశక్తితో నడిచే వ్యవస్థలను ఉపయోగిస్తారు.

24/7 అందుబాటులో ర్యాపిడ్ రెస్పాన్స్ వ్యాన్లు

వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకంగా రూపొందించే ర్యాపిడ్ రెస్పాన్స్ వ్యాన్లలో ప్రథమ చికిత్స పరికరాలతో పాటు కెమెరా ట్రాప్‌లు, డ్రోన్, రియల్‌టైమ్ మానిటరింగ్ సిస్టమ్, నిఘా కోసం నైట్ విజన్ పరికరాలు, జీపీఎస్‌లు ఉంటాయి. ఈ వాహనం 24/7 ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటుంది. ఈ వ్యాన్లలో వెటర్నరీ డాక్టర్, డ్రైవర్ కం ఫీల్డ్ అసిస్టెంట్, నలుగురు రెస్క్యూ సిబ్బంది ఉంటారు.ఈ వ్యాన్లను అల్లూరి, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, కడప, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 4 ఆర్‌డబ్ల్యూఆర్‌టీసీ ప్రధాన కార్యాలయాల్లో ఏర్పాటు చేసే మొబైల్ వైల్డ్‌లైఫ్ అంబులెన్స్‌లతో పాటు పార్వతీపురం, అనంతపురం, మంగళగిరిలోనూ అదనపు అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తారు. హనుమాన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటికే ఉన్న 'గజ' యాప్ స్థానంలో జంతువుల సమాచారాన్ని ప్రజలకు చేరవేసేలా కొత్త యాప్‌ను రూపొందించి, మార్చి 3వ తేదీలోగా అందుబాటులోకి తేవాలని అటవీశాఖ నిర్ణయించింది.

రాజమహేంద్రవరంలో వన్యప్రాణుల డిస్పెన్సరీ

ప్రాంతీయ వన్యప్రాణుల రక్షణ, చికిత్స కేంద్రాలు (ఆర్‌డబ్ల్యూఆర్‌టీసీ)గా ప్రస్తుతం తిరుపతిలో ఉన్న శ్రీవెంకటేశ్వర జూలాజికల్ పార్కు, విశాఖ, బైర్లుటి వద్ద ఉన్న వన్యప్రాణుల డిస్పెన్సరీలను వినియోగించనున్నారు. అవసరాన్ని బట్టి ఈ డిస్పెన్సరీలను అప్‌గ్రేడ్ చేస్తారు. మరిన్ని సౌకర్యాలతో రాజమహేంద్రవరంలో ఒక డిస్పెన్సరీ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి డిస్పెన్సరీలో ఒక పశువైద్యుడు, ఇద్దరు పారా స్టాఫ్, ఒక జీవశాస్త్రవేత్త, నలుగురు జంతు సంరక్షకులు, ఒక నర్సు లేదా వెటర్నరీ టెక్నీషియన్, అంబులెన్స్ డ్రైవర్ అందుబాటులో ఉంటారు. ఈ నాలుగు ప్రాంతీయ వన్యప్రాణుల రక్షణ, చికిత్స కేంద్రాలకు వన్యప్రాణులకు సేవలందించాల్సిన జిల్లాల పరిధిని నిర్ణయించారు. హాట్‌స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో అడవి జంతువుల సంఖ్య, వాటి ప్రవర్తనను గమనించడం, స్థానిక అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడం, వేగంగా ప్రతిస్పందించడం, స్థానికులకు హెల్ప్‌లైన్‌పై అవగాహన కల్పించడం, మొబైల్ అంబులెన్స్ టీమ్‌లకు శిక్షణ ఇవ్వడం, జంతువుల రోగ నిర్ధారణ, పరిశోధన కోసం ప్రాంతీయ పశువైద్య కళాశాలలతో అనుసంధానమయ్యేలా ఆర్‌డబ్ల్యూఆర్‌టీసీలకు నిర్దేశించారు.

పకడ్బందీగా హనుమాన్ ఫౌండేషన్ చర్యలు

చిత్తూరు జిల్లాలో మాదిరిగానే.. మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏనుగుల కదలికలు, గమనాన్ని ఆధునిక సాంకేతికతతో గుర్తిస్తారు. వాటితో పాటు ఏవైనా వన్యప్రాణులు అటవీ హద్దులు దాటినప్పుడు స్థానికులకు హెచ్చరికలు పంపడం, పొలాల చుట్టూ రాత్రిపూట ఆటోమేటిక్ లేజర్ ఫెన్సింగ్, కృత్రిమ మేధతో వర్చువల్ జియో ఫెన్సింగ్‌తో జంతువులను నిరోధించేలా సోలార్ లైన్ల ఏర్పాటు, జంతువులు పారిపోయేలా సైరన్లు మోగించడం, బాగా కాంతి వచ్చే ఫ్లాష్ లైట్లు వంటివి వినియోగిస్తారు. ఇటీవల తిరుపతి, చిత్తూరు జిల్లాల పర్యటనలో 'హనుమాన్' వివరాలను తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... దీనిని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సమాచారంతో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అందుకే 'హనుమాన్' పేరు

అడవులతో హనుమంతుడికి ఉన్న ప్రత్యేక అనుబంధం నేపథ్యంలో ఈ ఫౌండేషన్‌కు 'హనుమాన్' అనే పేరు పెట్టినట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు లక్ష్యం మేరకు... ఏనుగులు, పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, జింకలు, కోతులు వంటి వన్యప్రాణులను కాపాడుతూనే.. వాటి నుంచి మనుషులను రక్షించడానికి చర్యలు తీసుకుంటున్నారు. వేటగాళ్ల నుంచి వన్యప్రాణులకు హాని లేకుండా చూడటం కూడా ప్రాజెక్టు లక్ష్యాల్లో ఒకటి. ప్రతి జంతు జాతికీ ఒక బృందాన్ని ఏర్పాటు చేసి... వాటి సంరక్షణ, పోషణ, అవసరమైన వైద్యసేవలు కూడా అందించనున్నారు. అటవీశాఖలోని ప్రతి డివిజన్‌కు ఒక అంబులెన్స్ ఏర్పాటుచేసి జంతువుల వైద్యానికి అవసరమైన మందుల్ని అందుబాటులో ఉంచుతారు. అటవీ జంతువులతో పాటు పట్టణాలు, గ్రామాల్లోనూ జనవాసాల్లోకి వచ్చే విష సర్పాల నుంచి ప్రజలకు హాని జరగకుండా 'సర్పమిత్ర' పేరిట ప్రతి పంచాయితీలోనూ వలంటీర్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.

ఒక్కొక్క పేపర్‌ను 12 నిమిషాలు దిద్దాల్సిందే!

టెన్త్ మూల్యాంకనంపై నిర్ణయం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనంపై పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 పబ్లిక్ పరీక్షల అనంతరం జరిగే మూల్యాంకనంలో ప్రతి పేపర్‌ను టీచర్లు కనీసం 12 నిమిషాల పాటు దిద్దాలని పేర్కొంది. గరిష్ఠ సమయం 15 నిమిషాలుగా నిర్ణయించింది. అలాగే ఇప్పటివరకు రోజుకు 40 పేపర్లను అన్ని రోజులకు కలిపి సగటు తీసుకునే విధానం ఉండగా, ఇక నుంచి ప్రతిరోజూ 40 పేపర్లు దాటకూడదని తెలిపింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి. విజయరామరాజు సోమవారం అధికారులతో నిర్వహించిన వెబ్ ఎక్స్ సమావేశంలో దీనిపై స్పష్టతనిచ్చారు. 2025 పబ్లిక్ పరీక్షల మూల్యాంకనంలో పొరపాట్లు వచ్చాయి. మార్కుల నమోదులో జరిగిన పొరపాట్లు వివాదానికి దారితీశాయి. ఈ నేపథ్యంలో ఈసారి ముందస్తు చర్యలు చేపట్టారు. ఇక నుంచి పేపర్లు దిద్దే సమయంపై కచ్చితత్వం ఉండేలా మార్పులు చేశారు. ఉదాహరణకు వారం పాటు మూల్యాంకనం జరిగితే ఒక టీచర్ కొన్ని రోజులు తక్కువ పేపర్లు, కొన్ని రోజులు ఎక్కువ పేపర్లు దిద్దుతున్నారు. ఒక్కో పేపర్‌ను నాలుగైదు నిమిషాల్లో దిద్దేస్తున్నారు. ఫలితంగా పొరపాట్లు వస్తున్నాయని భావించిన పాఠశాల విద్యాశాఖ ఇకపై తప్పనిసరిగా 12 నిమిషాల సమయం పేపర్‌కు కేటాయించాలని స్పష్టంచేసింది. ఒకరోజు ఎక్కువ, ఒకరోజు తక్కువ విధానానికి కూడా స్వస్తి పలికింది. ఒకవేళ ఏవైనా కారణాలతో ఒకరోజు ఒక టీచర్ 40 కంటే తక్కువ పేపర్లు దిద్దితే ఆ లోటును తర్వాత రోజు భర్తీ చేసుకునే అవకాశం ఇక ఉండదు. కాగా, డిసెంబరు 15 తర్వాత పదో తరగతి విద్యార్థులను ఇతరత్రా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయొద్దని డైరెక్టర్ ఆదేశించారు. డిసెంబరు 6 నుంచి టెన్త్ విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలన్నారు. అలాగే 2026 పబ్లిక్ పరీక్షల్లో ఇన్విజిలేటర్లుగా 20 శాతం మంది ప్రైవేటు టీచర్లను తీసుకోవాలని విద్యాశాఖ భావిస్తోంది.

బీఈడీ-ఎస్జీటీలకు బ్రిడ్జి కోర్సు తప్పనిసరి

» ఆరు నెలల కోర్సు పూర్తిచేయాలి: విద్యాశాఖ

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఈడీ అర్హతతో ఎస్జీటీలుగా నియమితులైనవారు తప్పనిసరిగా ఆరు నెలల బ్రిడ్జి కోర్సు పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓపెన్ స్కూల్ సొసైటీ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2018-23 మధ్య కాలంలో బీఈడీతో ఎస్జీటీలుగా నియమితులైన టీచర్లు డిసెంబరు 25 వరకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది. కాగా, ఎస్జీటీ ఉద్యోగాలకు డీఈడీ చేసినవారు మాత్రమే అర్హులని గతేడాది సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. బీఈడీ చదివిన వారు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు పరిమితం కావాలని ఆదేశించింది. అందుకు అనుగుణంగా అప్పటికే బీఈడీతో ఎస్జీటీలుగా నియమితులైనవారు బ్రిడ్జి కోర్సు పూర్తిచేయాలని ఎన్‌సీటీఈ ఉత్తర్వులు జారీచేసింది. అందులో భాగంగా ఇప్పుడు దేశవ్యాప్తంగా బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 24 నుంచే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. దానిపై ఇప్పటివరకూ నిర్లక్ష్యం ప్రదర్శించిన రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ వారం తర్వాత తీరిగ్గా ఇప్పుడు ఉత్తర్వులు జారీచేసింది.

విద్యుత్ ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు

» ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అసైన్డ్ భూములను కేటాయించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వచ్చింది. ఇప్పటిదాకా చట్టపరంగా ఉన్న అడ్డంకులు తొలగిస్తూ.. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధం-1979) (చట్టసవరణ) ఆర్డినెన్స్-2025ను ప్రభుత్వం జారీచేసింది. ఈ మేరకు గెజిట్ విడదల చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పుడున్న చట్ట నిబంధనల ప్రకారం వాణిజ్య, వ్యాపార అవసరాల కోసం అసైన్డ్ భూములను ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు, కంపెనీలకు కేటాయించడానికి వీల్లేదు. పేదల జీవనోపాధికి, వారి ఆర్థికాభివృద్ధి కోసం కేటాయించిన భూములను ఇతరులకు అమ్ముకోవడానికి, అలాగే, ప్రభుత్వం ప్రైవేటు అవసరాల పేరిట తీసుకోవడానికి వీల్లేకుండా నిషేధం అమల్లో ఉంది. అందుకే ఈ చట్టాన్ని బదలాయింపు నిషేధ చట్టం (పీవోటీ)గా పిలుస్తారు. పేదల భూములకు ఇదే రక్షణ కవచం. అయితే, కొన్నిరకాల ప్రభుత్వ అవసరాలకోసం రైతులకు నిర్దేశిత ధర చెల్లించి అసైన్డ్ భూములు సేకరించే వెసులుబాటును ప్రభుత్వానికి కల్పిస్తోంది ఈ చట్టం. కానీ ప్రభుత్వ కార్పొరేషన్లు, వాటి ద్వారా ప్రైవేటు సంస్థలు, కంపెనీలకు ఇచ్చే అధికారం ఎవరికీ లేదు. ఈ అడ్డంకులను జగన్ సర్కారు 2020లో తొలగించగా, ఇప్పుడు కూటమి సర్కారు మరో ముందడుగు వేసింది. అసైన్డ్ భూముల చట్టంలో కొత్త సెక్షన్లను జోడించి రెండు ప్రభుత్వ రంగ సంస్థలకు పీవోటీ నుంచి మినహాయింపులు ఇస్తూ మంత్రివర్గం ఇటీవల ఆర్డినెన్స్‌ను ఆమోదించింది. దానికి గత నెల 28నే గవర్నర్ ఆమోదం లభించింది. దీంతో ఆర్డినెన్స్‌పై గెజిట్ విడుదల చేస్తూ న్యాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

నాడు ఆ సర్కారు.. నేడు ఈ ప్రభుత్వం

విద్యుత్ ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు ఇచ్చే విధానానికి తొలుత జగన్ సర్కారే శ్రీకారం చుట్టింది. సోలార్ విద్యుత్ ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు ఇచ్చేందుకు గాను 2020 డిసెంబరు 24న తొలిసారిగా ఏపీ అసైన్డ్ భూముల చట్టం-1977లో సవరణ చేసింది. సెక్షన్ 2, 3లను సవరించి, ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్‌కు అసైన్డ్ భూములు కేటాయించవచ్చని నిషేధ మినహాయింపులు ఇచ్చింది, దీంతో వేల ఎకరాల అసైన్డ్ భూములను తొలుత గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్‌కు కేటాయించి, ఆ సంస్థ ద్వారా ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు, సంస్థలకు కేటాయించింది. కాగా.. నేడు సోలార్‌కే కాదు, పవన విద్యుత్ ఉత్పత్తి (విండ్ పవర్) ప్రాజెక్టులకు కూడా అసైన్డ్ భూములివ్వాలని కూటమి సర్కారు నిర్ణయించింది. దీర్ఘకాలిక ప్రాతిపదికన ఈ రెండు కేటగిరీల ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు కేటాయించాలని అసైన్డ్ భూముల చట్టంలో సెక్షన్ 2ను సవరించింది. జగన్ సర్కారు సెక్షన్ 2 ద్వారా ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ (ఏపీజీఈసీఎల్)కు భూములివ్వాలని పీవోటీ మినహాయింపులు ఇస్తూ చట్టసవణ చేసింది. అయితే, కూటమి సర్కారు ఆ సంస్థ పేరును తీసేసి కొత్తగా ఏపీ గ్రామీణ వ్యవసాయ విద్యుత్ లిమిటెడ్, నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ)లను చేర్చింది. సెక్షన్ 2(ఎ)లోనూ ఆ రెండింటి పేర్లను పేర్కొని వాటికి పీవోటీ నిబంధనలు వర్తించవని తెలిపింది.

ఆ ఎమ్మెల్సీలకు చైర్మన్ 'కౌన్సెలింగ్'!

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామా చేశారా.. రాజీనామా లేఖ అసలైనదేనా అన్న విషయాలను మాత్రమే నిర్ధారించుకోవలసి ఉండగా.. చైర్మన్ మాత్రం తమ రాజీనామాను ఉపసంహరించుకుని, వైసీపీ సభ్యులుగానే కొనసాగేలా కౌన్సెలింగ్ ఇస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీలు తమ రాజీనామా లేఖలను సమర్పించాక నెల రోజుల్లోపే వాటిని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయాలి. కానీ ఆ ఆరుగురిలో నలుగురు రాజీనామాలు చేసి ఏడాది దాటినా ఆయన తన నిర్ణయాన్ని వెల్లడించలేదు. దీంతో వారిలో ఒకరైన జయమంగళ వెంకటరమణ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చైర్మన్ తీరును తప్పుబట్టిన హైకోర్టు.. నాలుగు వారాల్లోపు ఎమ్మెల్సీల రాజీనామాలపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడంతో ఆయన హడావుడిగా ఆరుగురు ఎమ్మెల్సీలు.. కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణచక్రవర్తి, పోతుల సునీత, జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకియా ఖానంలకు డిసెంబరు 1న తన ఎదుట హాజరుకావాలని నోటీసులు పంపారు.

ఎవరి ప్రోద్బలంతో రాజీనామా చేశారు..?

రాజీనామా చేసిన ఆరుగురూ సోమవారం మండలి చైర్మన్‌తో సమావేశమయ్యారు. ఆయన వారితో ముఖాముఖి భేటీలు జరిపారు. 'మీరు రాజీనామా ఎందుకు చేశారు.. ఎవరైనా పదవి ఆశ చూపారా.. రాజీనామాపై పునరాలోచన చేస్తారా.. రాజీనామా చేయడానికి ముందు మీరు ఎవరిని కలిశారు.. ఆ తర్వాత ఎవరిని కలిశారు.. రాజీనామా చేయాలని మీకు ఎవరు చెప్పారు.. రాజీనామా లేఖ ప్రింట్ ఎక్కడ తీసుకున్నారు..' వంటి ప్రశ్నలతో ఆయన కౌన్సెలింగ్ సాగించారని వారు విమర్శించారు. తాను ఈ ఏడాది మార్చిలో ఎమ్మెల్సీ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశానని, దానికి కట్టుబడి ఉన్నట్లు చైర్మన్‌కు స్పష్టంగా చెప్పానని మర్రి రాజశేఖర్ మీడియాకు తెలిపారు. 'నా రాజీనామాను నెల రోజుల్లో ఆమోదించాల్సి ఉన్నా తాపీగా ఇప్పుడు విచారణకు పిలిపించారు. స్వచ్ఛందంగా రాజీనామా చేశానని చెబుతున్నా.. చైర్మన్ మాత్రం బలవంతంగా రాజీనామా చేశాననే సాకుతో నా రాజీనామాను తిరస్కరించే ఉద్దేశంతో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రశ్నలు అడిగారు' అని ఆక్షేపించారు. జనసేన నీకు ఏమిస్తోంది.. మంత్రి పదవి, ఎమ్మెల్సీ ఇస్తామన్నారా అని చైర్మన్ అడిగారు. నాకు పదవుల సంగతి తర్వాత.. ముందు నా రాజీనామా ఆమోదించాలని ఆయన్ను కోరాను' అని జయమంగళ వెంకటరమణ తెలిపారు. చెప్పారు.

ఎందుకిలా..?

రాజీనామా చేసిన ఆరుగురు వైసీపీ ఎమ్మెల్సీల్లో ఒక్క జాకియా ఖానం పదవీకాలం మాత్రమే 2026 జూలైతో ముగియనుంది. కల్యాణచక్రవర్తి పదవీకాలం 2027 వరకు ఉండగా మిగిలిన నలుగురి పదవీకాలం 2029 వరకు ఉంది. ఈ కారణంగానే వారి రాజీనామాలను ఆమోదించకుండా సాగదీస్తూ వస్తున్నారు. న్యాయస్థానం జోక్యంతో 4 వారాల్లో ఏదో ఒక నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితుల్లో.. మండలి చైర్మన్ కౌన్సెలింగ్‌కు తెరదీశారని ఆ ఎమ్మెల్సీలు చెబుతున్నారు. కౌన్సెలింగ్ ఫలించని పక్షంలో బలవంతంగా రాజీనామాలు చేశారన్న సాకుతో తమ రాజీనామాలను తిరస్కరించే యోచనలో చైర్మన్ ఉన్నారని అంటున్నారు. సభ్యుడు స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదనే అనుమానం ఉన్నప్పుడు మాత్రమే విచారణ జరపాలని రాజ్యాంగం చెబుతోందని.. తామే స్వయంగా రాజీనామా పత్రాలు ఇచ్చినా.. స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామని చెబుతున్నా.. ఆయన విచారణకు పిలిపించడం.. ఇక్కడ రాజీనామాలు ఉపసంహరించుకునేలా కౌన్సెలింగ్ ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఎమ్మెల్సీలు పేర్కొన్నారు.

జాకియా ఉపసంహరణ లేఖ

చైర్మన్ కౌన్సెలింగ్ పేరుతో చేసిన మంత్రాంగం ఫలితాన్నిచ్చింది. మండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానంతో మాట్లాడే సమయంలో.. పదవీకాలం మరో 7 నెలలే ఉన్నందున రాజీనామా వల్ల ఉపయోగం లేదని, తక్కువ కాలమే ఉన్నందున పదవిలో కొనసాగాలని ఆయన సూచించారు. దీంతో భేటీ అనంతరం ఆయన సూచనలకు అంగీకరించి రాజీనామా ఉపసంహరించుకుంటూ ఆమె లేఖ ఇవ్వడం గమనార్హం. వాస్తవానికి ఈ ఏడాది మేలో ఆమె ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. వెంటనే బీజేపీ కండువా కప్పుకొన్నారు. నిబంధనల ప్రకారం ఆమెపై అనర్హత వేటు వేయాల్సిన చైర్మన్.. బుజ్జగించి.. రాజీనామా లేఖను ఉపసంహరించుకునేలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ ఎమ్మెల్సీల రాజీనామాలు ఎప్పుడెప్పుడు..?

- **కర్రి పద్మశ్రీ..:** 2023 ఆగస్టు 10న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నిక.. 2024 ఆగస్టు 30న రాజీనామా.
- **బల్లి కల్యాణచక్రవర్తి:** 2021 మార్చి 30న ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా ఎన్నిక.. 2024 ఆగస్టు 30న రాజీనామా.
- **పోతుల సునీత:** 2023 మార్చి 30న ఎమ్మెల్యేల కోటాలో ఎన్నిక.. 2024 ఆగస్టు 30న రాజీనామా.
- **జయమంగళ వెంకటరమణ:** 2023 మార్చి 30న ఎమ్మెల్యేల కోటాలో ఎన్నిక.. 2024 నవంబరు 24న రాజీనామా.
- **మర్రి రాజశేఖర్:** 2023 మార్చి 30న ఎమ్మెల్యేల కోటాలో ఎన్నిక.. ఈ ఏడాది మార్చి 20న రాజీనామా.
- **మయాన జాకియా ఖానం:** 2020 జూలై 28న గవర్నర్ కోటాలో ఎన్నిక.. 2021 నవంబరులో మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నిక.. ఈ ఏడాది మే 14న పదవికి రాజీనామా.. తాజాగా ఉపసంహరణ.

నవంబరులో 2,697 కోట్ల జీఎస్టీ వసూళ్లు

» గత ఏడాది కంటే 4.6 శాతం క్షీణత

» సంస్కరణలతో ఆదాయం తగ్గుముఖం

» వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నవంబరు నెలలో రాష్ట్రానికి జీఎస్టీ ఆదాయం తగ్గిపోయింది. జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల ఆదాయం తగ్గిందని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నవంబరులో నికర జీఎస్టీ రూ.2,697 కోట్లు వసూలు కాగా.. గత ఏడాది నవంబరులో సాధించిన ఆదాయం కంటే ఇది 4.6 శాతం తక్కువ. ప్రకటనలోని వివరాల ప్రకారం.. ఆటో రంగం, సిమెంట్, ఎఫ్ఎంసీజీ, ఎలక్ట్రానిక్, పాల ఉత్పత్తులు ఇతర వస్తువులపై రేట్లు తగ్గడం వల్ల నవంబరులో జీఎస్టీ ఆదాయం తగ్గింది. పెట్రోలియం అమ్మకాలు, లిక్కర్‌పై వ్యాట్, వృత్తి పన్ను, జీఎస్టీ కలిపి మొత్తం నవంబరులో రూ.4,124 కోట్ల పన్ను ఆదాయం వసూలైంది. గతేడాది వసూలైన ఆదాయం కంటే ఇది 3.17 శాతం తక్కువ. ఎస్‌జీఎస్టీ 7.35 శాతం మేర తగ్గి రూ.1,109.17 కోట్లకు పరిమితమైంది. ఐజీఎస్టీ సెటిల్‌మెంట్ కూడా రూ.1,588.15 కోట్లకు తగ్గింది. గత ఏడాది నవంబరులో వచ్చిన ఐజీఎస్టీ కంటే ఇది 2.57 శాతం తక్కువ. మొంథా తుఫాను కారణంగా పెట్రోలియం అమ్మకాల ఆదాయం తగ్గింది. గత నవంబరు కంటే 1.06 శాతం తగ్గి రూ.1,306.61 కోట్లు వసూలైంది. లిక్కర్‌పై వ్యాట్ ఆదాయం 4.82 శాతం మేర తగ్గింది. గత నవంబరులో రూ.74 కోట్ల వ్యాట్ వసూలు కాగా, ఈ నవంబరులో అది రూ.70.40 కోట్లకు పడిపోయింది. వృత్తి పన్ను వసూళ్లు గత ఏడాది నవంబరు కంటే 46.22 శాతం పెరిగి రూ.43 కోట్లకు చేరుకున్నాయి. సెప్టెంబరు 22వ తేదీ నుంచే జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అక్టోబరులో దసరా, దీపావళి కారణంగా జీఎస్టీ ఆదాయం పెరిగింది.


మంత్రి లోకేశ్‌కు తమ సమస్యలను వివరిస్తున్న అఖిల భారత నాయీబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సేవ, సంక్షేమ, జాతి ప్రక్షాళన సమితి ప్రతినిధులు

సమస్యల పరిష్కారమే ఎజెండా

- 76వ రోజు మంత్రి లోకేశ్ ప్రజా దర్బార్
- వినతులు స్వీకరించి అండగా ఉంటామని భరోసా

మంగళగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ప్రజాదర్బార్ కొనసాగుతోంది. మంత్రి నారా లోకేశ్ 76వ రోజు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి స్వయంగా ఆయన అర్జీలు, వినతిపత్రాలను స్వీకరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ కార్యకర్తలు లోకేశ్‌ను కలసి సమస్యలు విన్నవించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవదాయ శాఖ కింద వివిధ దేవాలయాల్లో ఖాళీగా వున్న నాదస్వరం, డోలు, శృతి, తాళం వాయిద్య కళాకారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిల భారత నాయీబ్రాహ్మణ హక్కుల పరిరక్షణ సేవ, సంక్షేమ, జాతి ప్రక్షాళన సమితి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వివిధ దేవాలయాల్లో సంప్రదాయ నిత్య కైంకర్య సేవలు, పూజల కోసం శిక్షణ పొంది, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయా పోస్టుల్లో అవకాశం కల్పించడంతోపాటు వయస్సు సడలింపు ఇవ్వాలని కోరారు. 70 ఏళ్లుగా బంజరు భూముల్లో నివాసం వుంటున్న తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేటకు చెందిన గ్రామస్తులు విన్నవించారు. అన్నమయ్య జిల్లా ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గ్రామమైన కోటావూరులో 60 కుటుంబాలు భూములు, ఇళ్లు కోల్పోయాయని, బాధితుల సమస్యలు పరిష్కరించడంతోపాటు త్వరితగతిన నష్టపరిహార నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముంపు గ్రామ రైతులు వినతిపత్రం అందజేశారు. టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో వైసీపీ పాలనలో తనపైన, తన కుటుంబంపైన 42 అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని, తగిన న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా, రామకుప్పం మండలం గోవిందపల్లికి చెందిన మహాదేవి జయశంకర్ విన్నవించారు. ఆయా విజ్ఞప్తులను పరిశీలించిన లోకేశ్ తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

సీమ ప్రాజెక్టుల్లో వైసీపీ తట్టెడు మట్టి తీయలేదు

- మేం వాటిని పరుగులు పెట్టిస్తున్నాం: మంత్రి పయ్యావుల


అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవిలో దివ్యాంగుడు సుంకన్నకు పింఛన్ అందజేసి, మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల

ఉరవకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులలో తట్టెడు మట్టిని కూడా తీయలేదని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలో ఆయన లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్‌ఎంఎస్‌ఏ కింద రూ.43.75 లక్షలతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నాం. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టు సహా అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం మీద సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారు. వైసీపీ పాలనలో గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల గురించి పట్టించుకోలేదు. దెబ్బతిన్న శ్రీశైలం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించలేదు. కానీ మేం రాయలసీమ ప్రాజెక్టులను మళ్లీ పరుగులు పెట్టించేదిశగా ముందుకుపోతున్నాం' అని పయ్యావుల అన్నారు.

భూమనకే పరకామణి చోరీ ఆస్తులు: అనగాని



తిరుపతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి కేసులో సూత్రధారి, పాత్రధారి వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డే అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. సోమవారం తిరుపతిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. 'దేవుడి సొమ్మును దొంగతనం చేసిన వ్యక్తిని కాపాడేందుకు రాజీ చేయడం చరిత్రలోనే వినని, చూడని విషయం. పరకామణిలో చోరీ చేసిన దొంగ నుండి ఆస్తుల బదలాయింపు కరుణాకరెడ్డికే జరిగింది. దేవుడంటే ఎటువంటి నమ్మకం లేని కరుణాకరెడ్డి పింక్ డైమండ్, గోశాలతోపాటు ఇతర అంశాలపై అబద్ధాలు ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు.' మంత్రి మండిపడ్డారు.

మాతోనే సుస్థిరాభివృద్ధి

"నేను తొలిసారి సీఎం అయ్యేనాటికి హైదరాబాద్ శివార్లలో జూబ్లీహిల్స్ ఉండేది. ఆ ప్రాంతానికి కారు కూడా పోయేది కాదు. హైదరాబాద్ గుట్టలు, రాళ్లతో నిండి ఉండేది. హైటెక్ సిటీతో ప్రారంభించి.. అభివృద్ధి చేయడంతో చుట్టుపక్కల ఉన్న కోకాపేటలో ఎకరం రూ.పది కోట్ల నుంచి ఇప్పుడు రూ.160 నుంచి రూ.170 కోట్లు పలుకుతోంది. ఇటీవలే 10 ఎకరాలు అమ్మితే రూ.1,350 కోట్ల ఆదాయం తెలంగాణకు వచ్చింది. ఇలాంటివన్నీ జరగాలంటే భూ వినియోగం పక్కాగా ఉండాలి." - సీఎం చంద్రబాబు


ఉంగుటూరు మండలంలోని గోపీనాథపట్నంలో పేదలకు సేవ కార్యక్రమంలో ప్రజలకు చంద్రబాబు అభివాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పాల్గొన్నారు. డయాలసిస్ చేయించుకుంటున్న గుడ్ల నాగలక్ష్మి ఇంటికి వెళ్లి రూ.10 వేలు పెన్షన్ అందించారు. అనంతరం నల్లమాడు ప్రజావేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "విశాఖ సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. విశాఖ సహా మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేశాం. దీంతో విశాఖ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. ప్రపంచంలోనే సుందరమైన అమరావతిని రూపొందించే బాధ్యత తీసుకున్నా. తిరుపతిని డెవలప్ చేస్తా. గతంలో అనంతపురంలో రాయదుర్గం ఎడారిగా మారే పరిస్థితి నుంచి కాపాడా. ఆర్థికంగా ఇప్పుడది అగ్ర జిల్లాగా ఎదిగింది. ఇదీ తెలుగుదేశం, నేను, నా మిత్రుడు పవన్ కల్యాణ్ ఆలోచించే విధానం. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా తలసరి ఆదాయాన్ని మూడు లక్షల నుంచి 58 లక్షలకు పెంచటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. డెల్టాలో కంటే మెట్టలో భూముల ధరలు పెరిగాయి. విజన్‌కు ఉండే ప్రభావం అది." అని తెలిపారు.

టెక్నాలజీ వినియోగంపై దృష్టి

"మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు తీరు మారాలి. ఒక పంట తప్పకుండా వరి వేసి, ఆ తర్వాత మిగతా పంటలు కూడా వేయాలి. ఐటీని అందిపుచ్చుకుని తమ పంటల ఉత్పాదకతను రైతులు పెంచుకోవాలి. డ్రోన్‌లను పామాయిల్ తోటపై పనిచేసేలా చేస్తే.. ఎదుగుదల లేని చెట్లను గుర్తించడం, అవసరమైన చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుంది. రాయలసీమలో హార్టికల్చర్.. కోస్తాలో ఆక్వా కల్చర్‌ను వృద్ధి చేస్తున్నాం. ఆక్వా అభివృద్ధికి యూనిట్ రూపాయిన్నరకే కరెంట్ ఇస్తున్నాం. మొన్న ఒకతను విశాఖలో సీ 3 పరిశ్రమ స్థాపనకు ముందుకొచ్చారు."

జనవరి నాటికి గుంతలు ఉండవు

"రోడ్ల విషయంలో సమస్యలు ఉన్నాయి. మొన్న రోడ్లన్నీ వేశాం. వర్షాల వల్ల ఆ రోడ్లు దెబ్బతిన్నాయి. జనవరిలోగా గుంతలను పూడ్చే బాధ్యత ప్రభుత్వానిదే. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రూ.52 వేల కోట్లను పెన్షన్లకు వెచ్చిస్తున్నాం. 2027 నాటికి గోదావరి పుష్కరాలకంటే ముందుగానే పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇది చిరకాల వాం ఛ. కొల్లేరు సమస్యను పరిష్కరిస్తాం. 'సూపర్ సిక్స్' హామీ అమలుపై ఎగతాళి చేశారు. అయినా ఎక్కడా తగ్గకుండా అన్నీ చేసి హిట్ కొట్టాం. 16,347 మందికి టీచర్ ఉద్యోగాలిచ్చాం. స్త్రీ శక్తి పథకం కింద ఉచితంగా బస్సుల్లో ఇప్పటి వరకు 25 కోట్ల మంది ఆడబిడ్డలు తిరిగారు. దీనికి ఆర్టీసీకి రూ.855 కోట్లు చెల్లించాం. పంచసూత్రాల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి చేసే ప్రయత్నం మొదలెట్టాం."

ముగ్గురు పిల్లలను కనాల్సిందే

"రాష్ట్ర జనాభా 4.83 కోట్లే ఉంది. కనీసం ఆడ బిడ్డ ముగ్గురు సంతానాన్ని కనాలి. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు లేకపోవడం వల్ల మధ్య వయస్సులోనే చనిపోతున్నారు. 1995లో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు బహిరంగ చర్చ చేయాలని చెప్పా. ఇప్పుడు ఆ మహమ్మారిని పూర్తిగా తగ్గించిన రాష్ట్రంగా మనమే ప్రథమంగా నిలిచాం" అని చంద్రబాబు అన్నారు. కాగా, చంద్రబాబును వరి కంకుల దండతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సత్కరించారు. తృణధాన్యాలతో తయారుచేసిన చంద్రబాబు చిత్రపటాన్నిబహూకరించారు.

మీకు పెద్దన్నగా ఉంటా..

'ఏమ్మా ఆరోగ్యం ఎలా ఉంది? మందులు సకాలంలో వేసుకుంటున్నావా? డయాలసిస్ ఎక్కడ చేయించుకుంటున్నావు?' అంటూ కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మిని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. 'ఆరోగ్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. నా భర్త నాగేశ్వరరావు కూలి పని చేస్తుంటాడు. కుమారుడు పవన్‌సాయి ఎంసీఏ పూర్తి చేశాడు. కుమార్తె వాసవి పదో తరగతి చదువుతోంది. నన్ను, నా కుటుంబాన్ని మీరే ఆదుకోవాలి." అంటూ నాగలక్ష్మి సీఎంను ప్రాధేయపడింది. దీనిపై సీఎం స్పందిస్తూ.. 'అధైర్యపడవద్దు. మీ కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటా. మీకు పెద్దన్నగా ఉంటా. నాగేశ్వరరావుకు, పవన్‌కు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తాం." అని వారికి ఆయన భరోసా కల్పించారు. సీఎం సూచనతో ఆమెను తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య సహాయం అందించారు. నల్లమాడులో సోమవారం జరిగిన 'పేదల కోసం ప్రజావేదిక' సమావేశంలో బంగారు కుటుంబాల సమస్యలు గురించి వారి మార్గదర్శులతో ముఖాముఖి నిర్వహించారు. బంగారు కుటుంబ సభ్యురాలు శాఖమూరి మణితో మాట్లాడారు.

బాబు దశాబ్దం కిందటే తెచ్చారు!

బంగారు కుటుంబ మార్గదర్శి పసుపులేటి రామారావు మాట్లాడుతూ... "నేను ఈ కార్యక్రమం కోసం ముంబై నుంచి వచ్చాను. శనివారం ముంబైలో వికసిత్ భారత్ సమ్మిట్ - 2047లో పాల్గొన్నా. ఈ సమ్మిట్‌కు లండన్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ సుభాష్‌జీ హాజరయ్యారు. నేను ఆయనతో మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చినట్టు తెలపగా, ఆయన సంతోషించారు. "మోదీ వికసిత్ భారత్ 2047 అన్నారు. కానీ మీ చంద్రబాబు దశాబ్దం క్రితమే తీసుకొచ్చారు. చంద్రబాబును 1996లో కలిశాను.. 2025లో మరలా కలిశాను. అందరికీ వయస్సు ముందుకు పోతుంది.. కానీ మీ చంద్రబాబుకు వయస్సు వెనక్కి వస్తుంది' అని వ్యాఖ్యానించినట్టు తెలపగా సభలో నవ్వులు విరిశాయి.

పెన్షన్‌తో పాటు శ్రీవారి ప్రసాదం


సామాజిక పింఛన్లతోపాటు శ్రీవారి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం తదితరులు

కుప్పం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం మండలం కంగుంది పంచాయతీ ఎస్సీ ఎస్టీ కాలనీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పాటు తిరుమల శ్రీవారి లడ్డూలను అందజేశారు. నెలకు ఒక్కో కాలనీ చొప్పున సుమారు 100-150 మంది పింఛనుదారులకు శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఇలా అందించనున్నట్లు టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు.


ఉత్తర్వుల కాపీని చూపుతున్న కానిస్టేబుల్ ప్రకాశ్

థ్యాంక్యూ.. సీఎం సర్!

- విధుల్లోకి ఏఆర్ కానిస్టేబుల్
- అనంతపురం ఎస్పీని కలిసిన వైసీపీ బాధిత కానిస్టేబుల్ ప్రకాశ్

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఉద్యోగం కోల్పోయిన అనంతపురం జిల్లా ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాశ్ సోమవారం తిరిగి విధుల్లోకి చేరారు. తనకు తిరిగి ఉద్యోగం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సమస్యలపై ప్రశ్నించినందుకు జగన్ ప్రభుత్వం మూడేళ్ల కిందట కక్ష గట్టి విధుల నుంచి ఆయనను తొలగించింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన అభ్యర్థనను పరిశీలించిన సీఎం చంద్రబాబు తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు, డీజీపీ ఉత్తర్వుల మేరకు ఎస్పీ జగదీశ్ ఆయనకు విధులు అప్పగించారు. దీంతో కానిస్టేబుల్ ప్రకాశ్ సోమవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయానికి ఉత్తర్వుల కాపీని తీసుకుని వెళ్లి ఎస్పీని కలిసి రిపోర్ట్ చేశారు. ఆయనను జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నియమించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మీడియాతో మాట్లాడారు. 2014-19 మధ్య సీఎంగా ఉన్న చంద్రబాబు తమకు సరెండర్, టీఏ, డీఏలు, మెడికల్ బిల్స్, ఇతర బకాయిలు ప్రతి ఏటా ఇచ్చేవారని తెలిపారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక అలవెన్సులు తీసేసి పోలీసులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. 2022లో అప్పటి సీఎం జగన్ చెన్నేకొత్తపల్లికి రాగా, సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాలని ప్లకార్డు పట్టుకున్నానని తెలిపారు. దీంతో తనపై కక్షగట్టి ఉద్యోగం నుంచి తొలగించారని చెప్పారు. సీఎం చంద్రబాబు అప్పట్లో ఇచ్చిన మాట మీద నిలబడి.. తనను విధుల్లోకి తీసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, మంత్రి లోకేశ్, ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగకు ధన్యవాదాలు తెలిపారు.

10 నుంచి రవాణా వాహనాల బంద్

విజయవాడ సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ చార్జీలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వులకు నిరసనగా దేశవ్యాప్తంగా బంద్ పాటించాలని సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఎస్ఐఎంటీఏ) నిర్ణయించింది. ఈ నెల 10వ తేదీ నుంచి రవాణా వాహనాల బంద్ పాటించేందుకు ఎస్ఐఎంటీఏ నిర్ణయించిందని ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ సౌత్ జోన్ ఉపాధ్యక్షుడు వైవీ ఈశ్వరరావు తెలిపారు. తమిళనాడులో జరిగిన ఎస్ఐఎంటీఏ ప్రతినిధుల సమావేశంలో తీర్మానించిన అంశాలను ఈశ్వరరావు సోమవారం మీడియాకు విడుదల చేశారు. 12 ఏళ్లు పైబడిన వాహనాల యజమానులు ఈ బంద్‌లో పాల్గొంటారని వెల్లడించారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఈ బంద్ కొనసాగుతుందని వివరించారు.

పార్టీ లేకపోతే మనం లేం!


టీడీపీ మండల అధ్యక్షుల కాఫీ కబుర్లు సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్


ఢిల్లీలో లోకేశ్, అనితలకు స్వాగతం పలుకుతున్న రామ్మోహన్, దగ్గుమళ్ల

- అందరూ ఇది గుర్తుంచుకోవాలి: లోకేశ్
- వైసీపీ రాక్షస పాలన ఎలా ఉందో చూశాం
- గ్రామ పార్టీ అధ్యక్షుడూ రాష్ట్ర స్థాయికి ఎదగాలి
- ప్రభుత్వ కార్యక్రమాలను వారి వద్దకు తీసుకెళ్లాలి
- వారంలో ఒకరోజు కార్యాలయంలోనే ఉంటా
- 'మై టీడీపీ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి
- మండల నేతలతో మంత్రి లోకేశ్ కాఫీ కబుర్లు
- టీడీపీ శ్రేణుల శిక్షణ తరగతులు ప్రారంభం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'పార్టీ లేకపోతే మనమెవరమూ లేమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. మనకు గుర్తింపు గౌరవం దక్కుతున్నాయంటే దానికి కారణం పార్టీయే. ఇదెవరూ విస్మరించకూడదు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ అన్నారు. గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్రస్థాయి నేతలుగా ఎదగాలనేది టీడీపీ సిద్ధాంతమని, పార్టీ విధానం కూడా అదేనని స్పష్టంచేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన పార్టీ శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అనేది యూనివర్సిటీలాంటిదన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు 2012లో మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారని, అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం మంత్రి స్థాయిలో ఉన్నారని తెలిపారు. గ్రామ, మండల పార్టీ అధ్యక్షులు.. రాష్ట్ర స్థాయి నేతలుగా, ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఉప ముఖ్యమంత్రులుగా పనిచేయాలనేది పార్టీ సిద్ధాంతం.. విధానమని చెప్పారు. తొలిరోజు శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది వరకు మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, ఎన్.అమరనాథ్‌రెడ్డి, బెందాళం అశోక్, గౌతు శిరీష, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..

ఒక్కసారి నిర్ణయం తీసుకుంటే..

పార్టీలో సంస్కరణల కోసం రెండేళ్లు పోరాడాను. మండల పార్టీ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా మిమ్మల్ని నియమించింది పార్టీ. ప్రజలు మిమ్మల్ని ఎంచుకున్నారు కాబట్టి నియమించింది. పార్టీకి నిబద్ధతతో పనిచేయాలి. పార్టీ పిలుపిచ్చిన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి. పార్టీ కుటుంబం లాంటిది. చిన్న చిన్న సమస్యలు సహజం. ఒక్కసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ తు.చ. తప్పకుండా ఆ నిర్ణయాలను పాటించాలి. పార్టీ నేతలు అలకవీడాలి. సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకురావాలి.

ప్రజలతో అనుబంధం పెంచుకోవాలి

ప్రజల మనసులు గెలుచుకునే విధంగా పనిచేయాలి. వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలన ఎలా ఉందో చూశాం. గతంలో ఒక్క అనంతపురం జిల్లాలోనే 67 మంది టీడీపీ కార్యకర్తలను హత్యచేశారు. సైకో జగన్‌రెడ్డి.. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు. మనం సైకోతో పోరాడుతున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందరం ఒకే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేయాలి. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, కుటుంబ సాధికార సారథులతో కలిసి కూర్చుని సమస్యలు పరిష్కరించుకోవాలి. అహంకారం చూపితే ప్రజలు సహించరు. కష్టం లేనిదే ఫలితం రాదు. పాదయాత్ర చేయడం వల్లే ఈ స్థాయికి వచ్చాను. వారంలో ఒకరోజు కేంద్ర కార్యాలయంలోనే ఉంటాను. సమయం కేటాయిస్తాను. మీ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. ప్రతి ఒక్కరూ 'మై టీడీపీ' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ద్వారానే పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తాం. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఈ స్థాయిలో పింఛన్లు ఇవ్వడం లేదు. చేసే పని చెప్పుకోవాలి.

నేడు అమిత్‌షాతో భేటీ

- 'మొంథా' తుఫాను నష్టంపై కేంద్ర మంత్రులకు సమగ్ర నివేదిక

న్యూఢిల్లీ/అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా మంత్రి లోకేశ్ సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన కేంద్ర హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి అమిత్ షా, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమవుతారు. ఇటీవల రాష్ట్రంలో 'మొంథా' తుఫానుతో జరిగిన పంటలు, ఇతర నష్టాల అంచనాల సమగ్ర నివేదికను వారికి అందించి.. వీలైనంత వేగంగా సాయం చేయాలని కోరనున్నారు. ఆయన వెంట రాష్ట్ర హోం మంత్రి అనిత కూడా ఉన్నారు. కాగా.. ఢిల్లీ చేరుకున్న లోకేశ్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, టీడీపీ ఎంపీలు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, దగ్గుమళ్ల ప్రసాదరావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సానా సతీశ్, కేశినేని శివనాథ్, కలిశెట్టి అప్పలనాయుడు, బి.నాగరాజు, బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ తదితరులతో లోకేశ్ సమావేశమయ్యారు.

కార్యకర్తల సంతృప్తే లక్ష్యం

- పక్షం రోజుల్లో పార్టీ కమిటీలు: లోకేశ్

పార్టీ కార్యకర్తల సంతృప్తే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని లోకేశ్ సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో, అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కమిటీలు.. నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాల ఏర్పాటుపై చర్చించారు. కార్యకర్తల్లో అసంతృప్తి లేకుండా చూడాలని.. తరచూ వారితో సమావేశాలు నిర్వహించాలని కోరారు. జిల్లా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులకు సంబంధించిన కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చిందని, పక్షం రోజుల్లో కమిటీ భర్తీ వ్యవహారాన్ని కొలిక్కి తీసుకురావాలని పల్లాకు సూచించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాల ఏర్పాటును వేగవంతం చేయాలని, కార్యాలయాలన్నిటినీ ఒకే విధానంలో నిర్మించాలన్నారు. వీటికి బీఎస్‌డీ ఆర్కిటెక్ట్ సంస్థ రూపొందించిన డిజైన్లను లోకేశ్ పరిశీలించారు.

పేదల సేవలో.. 120 మంది ఎమ్మెల్యేలు

- ఫలితం చూపిన బాబు, లోకేశ్ సూచనలు

టీడీపీ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేసిన సూచనల ప్రభావం కనిపించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 'పేదల సేవలో' పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో 19 మంది మంత్రులు సహా 120 మంది ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమమైన పింఛన్ల పంపిణీని టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ కార్యక్రమంలో నేతలందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు, లోకేశ్ స్పష్టంగా చెబుతున్నారు. వీరి సూచనల ప్రభావంతో సోమవారం నేతల హాజరు 90 శాతం నమోదైనట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

సీసీఐ అక్రమాలపై సీఐడీ విచారణ

- 140 కోట్ల రూపాయల అక్రమాలపై దృష్టి
- 3.75 లక్షల బేళ్లకు 40 వేల బేళ్లు బయ్యర్ల సొంతం
- 10 శాతం 'పత్తి మాయం'పై అధికారుల దృష్టి
- గుంటూరు కార్యాలయంలో వివరాలుసేకరణ


గుంటూరు సీసీఐ కార్యాలయానికి వచ్చిన సీఐడీ అధికారులు

గుంటూరు సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)లో గత ఏడాది జరిగిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. సుమారు రూ.140 కోట్లు విలువ చేసే పత్తి బేళ్లు మాయమయ్యాయని ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం విచారణకు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సీఐడీ డీఎస్పీ సునీల్ నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం గుంటూరు సీసీఐ కార్యాలయానికి వచ్చి సమాచారం సేకరించారు. సీసీఐ మేనేజర్ రాజేంద్ర షాతో భేటీ అయిన సీఐడీ అధికారులు గత ఏడాది జరిగిన కొనుగోళ్లు, అమ్మకాలపై ఆరా తీసినట్లు సమాచారం. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా సీసీఐ సుమారు 19 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. దాని నుంచి 3.75 లక్షల పత్తి బేళ్లను తీశారు. దీనిలో సుమారు 40 వేల బేళ్లను బయ్యర్లు అక్రమంగా అమ్ముకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఒక్కో బేలు విలువ రూ.27 వేల నుంచి రూ.28 వేల వరకు ఉంది. ఈ లెక్కన గతేడాది రాష్ట్రవ్యాప్తంగా రూ.140 కోట్లు విలువ చేసే బేళ్లను కొందరు బయ్యర్లు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. రైతుకు మద్దతు ధర ఇస్తున్నారన్న పేరుతో కొనుగోలు సమయంలోనే క్వింటాల్ పత్తికి సుమారు 4 నుంచి 5 కేజీల వరకు కోత విధిస్తున్నారు. ఇది కొన్నేళ్లుగా జరుగుతున్నప్పటికీ గతేడాది జరిగిన అవకతవకలపై ప్రభుత్వానికి భారీ సంఖ్యలో ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని సీఐడీని ఆదేశించింది.

స్టాండింగ్, క్వాలిటీ కటింగ్

రైతులు కష్టపడి పండించి సీసీఐ కేంద్రంలో అమ్మకానికి తీసుకువచ్చిన పత్తిని అనేక రకాల పేర్లతో బయ్యర్లు కొల్లగొడుతున్నారు. స్టాండింగ్ అంటే దూది పింజ పొడవు 32 నుంచి 34 మిల్లీమీటర్లు ఉండాలి. అయితే, అంత పొడవు ఇక్కడ ఉండవు. దాంతో వాటికి ధరలో కోత పెడతారు. స్టాండింగ్‌తో పాటు క్వాలిటీ కటింగ్ పేరుతో ఒక్కో క్వింటాల్‌కు 4 నుంచి 5 కేజీల పత్తిని అక్రమంగా తీసుకుంటున్నారు. ఆ పత్తిని యథావిధిగా జిన్నింగ్ చేసిన తర్వాత అదనపు దూది బేళ్లను పక్కకు తీసి అమ్మకాలు జరుపుతారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒక క్వింటాల్ పత్తిలో 63 శాతం విత్తనాలు, 32 శాతం దూది, 2 నుంచి 5 శాతం ఉత్పత్తి నష్టం కింద లెక్కిస్తారు. అక్టోబరు తర్వాత వచ్చే పత్తిలో ఔట్ రన్ (సైజు తక్కువగా ఉండే) దూది శాతం పెరుగుతుంది. ఉదాహరణకు 500 క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ వేస్తే 100 బేళ్ల దూది, సుమారు 6 లారీల విత్తనాలు వస్తాయి. అదే లెక్కన బయ్యర్లు రైతుల వద్ద కటింగ్ చేసిన పత్తికి కూడా దూది, విత్తనాలు పక్కకు తీస్తారు.

రంగంలోకి సీబీఐ కూడా!

విశ్వసనీయ సమాచారం ప్రకారం 10 బేళ్ల దూది వస్తే ఒక బేలు అనధికారికంగా బయ్యర్ ఖాతాలో జమ అవుతోందని తెలిసింది. ఈ లెక్కన రాష్ట్రంలో గతేడాది 3.75 లక్షల పత్తి బేళ్లు సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన పత్తి నుంచి తీశారు. దానికి తగినట్లుగానే అదనపు బేళ్లు బయటకు పంపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పత్తి క్యాండీ(రెండు దూది బేళ్లు కలిపి ఒక క్యాండీ) విలువ రూ.50 వేల పలుకుతోంది. కొందరు బయ్యర్లు, మిల్లుల యజమానులకే వాటిని విక్రయించినట్లు సమాచారం. వీటన్నింటిపై సీఐడీ విచారణ జరిగి అక్రమాలు రుజువు అయితే ఈ వ్యవహారంపై సీబీఐ కూడా రంగంలోకి దిగే అవకాశం ఉంది.

పుట్టుకతోనే పాల దంతం..!



» ఆరు రోజుల శిశువుకు పన్ను తొలగింపు

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా శిశువు జన్మించిన ఆరు నెలలకు పాల దంతాలు వస్తుంటాయి. కానీ, ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన దుర్గ అనే మహిళకు జన్మించిన పాపకు పుట్టకతోనే పన్ను ఉంది. దీంతో నూజివీడుకు చెందిన దంత వైద్యుడు దేవిశెట్టి దినేశ్ బాబు 6 రోజుల పసికందుకు ఆ పన్నును తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిశువుకు అరుదైన జన్యు సమస్య వల్ల ఇలా పుట్టకతోనే పన్ను వచ్చిందని చెప్పారు. ఆ పన్ను పన్ను కోరగా ఉండడంతో దాన్ని తొలగించినట్టు పేర్కొన్నారు.

విశాఖలో పర్యాటకులకు అదనపు ఆకర్షణ

దేశంలోనే అతి పొడవైన గాజు వంతెన: ఎంపీ భరత్



కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని ప్రారంభించిన అనంతరం వంతెన మీదుగా నడుస్తున్న ఎంపీ శ్రీభరత్, మేయరు పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు



విశాఖపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై సముద్రానికి అభిముఖంగా నిర్మించిన గ్లాస్ బ్రిడ్జి (గాజు వంతెన)ని సోమవారం ప్రారంభించారు. ఇది దేశంలోనే అతి పొడవైన గ్లాస్ బ్రిడ్జి అని విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ స్థలం సమకూర్చగా 'శ్రీసాయిమోక్ష షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్, భారత్ మాత వెంచర్స్, ఆర్‌జే అడ్వెంచర్స్' సంయుక్తంగా రూ.7 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించాయి. వీఎంఆర్‌డీఏకి గ్యారెంటీ ఫీ కింద ఆదాయంలో వాటా ఇస్తారు. ఈ గ్లాస్ బ్రిడ్జి పొడవు 55 మీటర్లు. ఇందులో 20 మీటర్లు భూమి మీద, మిగిలిన 35 మీటర్లు గాలిలో ఉండేలా నిర్మించారు. వెడల్పు మూడు మీటర్లు. సముద్ర మట్టానికి 1,020 అడుగున ఎత్తున ఏర్పాటు చేశారు. ఒకేసారి వంద మీద బ్రిడ్జి మీదకు వచ్చినా చెక్కుచెదరనంత బలంగా నిర్మించారు. అయితే భద్రతా కారణాల రీత్యా విడతకు 40 మందిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. పర్యాటకులను బృందాల వారీగా గాజు వంతెన మీదుకు పంపుతారు. ఒక్కో బృందం 5-7 నిమిషాలపాటు సందర్శించేందుకు అనుమితిస్తారు. గంటకు 250 కి.మీ.ల వేగంతో గాలులు వీచినా చెక్కు చెదరకుండా గ్లాస్ బ్రిడ్జిని రూపొందించారు. జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 40 ఎం.ఎం. మందం కలిగిన గ్లాస్‌తో తయారు చేశారు. పర్యాటకుల భద్రత కోసం బ్రిడ్జికి రెండు వైపులా 1.5 మీటర్ల ఎత్తున స్టెయిన్‌లెస్ స్టీల్ రెయిలింగ్ పెట్టారు.

'పరకామణి చోరీ'పై విచారణ పూర్తి

నేడు హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో నివేదిక.. కోర్టు ఆదేశంతో 25 రోజులు విచారణ

ఇద్దరు టీటీడీ మాజీ చైర్మన్లు, అప్పటి ఈవోను ప్రశ్నించిన సీఐడీ

తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీకి సంబంధించిన కేసులో సీఐడీ విచారణ సోమవారంతో ముగిసింది. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్ మంగళవారం హైకోర్టులో సీల్డ్ కవర్‌లో నివేదికను సమర్పించనున్నారు. విచారణలో సీఐడీ ఏమి తేల్చింది...నివేదికలో ఏముంది...నివేదిక పరిశీలించాక హైకోర్టు తీసుకునే చర్యలెలా ఉంటాయి... వాటి పర్యవసానం ఎలా ఉంటుందనేది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో, 2023 ఏప్రిల్‌లో పరకామణిలో హుండీ లెక్కింపు సమయంలో పెద్ద జియ్యంగార్ మఠం గుమస్తా కోయంబత్తూరు రవికుమార్ అమెరికన్ డాలర్లు దొంగలించి పట్టుబడ్డారు. ఈ కేసులో రవికుమార్‌పై నమోదు చేసిన క్రిమినల్ కేసును టీటీడీ విజిలెన్స్ అధికారులు హడావిడిగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. రవికుమార్ నుంచి టీటీడీకి విరాళంగా ఆస్తులు రాయించుకున్నారు. ఈ వ్యవహారం వెనుక భారీ కుట్ర జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

హైకోర్టు ఆదేశాలతో....

పరకామణి చోరీ కేసును హడావిడిగా మూసివేయడంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతికి చెందిన జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులు హైకోర్టులో ఈ ఏడాది రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, తిరుమల వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, టీటీడీ కార్యాలయాల్లోని సంబంధిత కేసు ఫైళ్లను, రికార్డులను స్వాధీనం చేసుకుని కోర్టుకు అందజేయాలంటూ సీఐడీని ఆదేశించింది. సీఐడీ చీఫ్ అయ్యనార్ స్వయంగా రంగంలోకి దిగి రికార్డులు స్వాధీనం చేసుకుని హైకోర్టుకు అందజేశారు. అనంతరం అక్టోబరు 27న హైకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసింది. సీఐడీ చీఫ్ స్వయంగా ఈ వ్యవహారంపై విచారణ జరిపి డిసెంబరు 2వ తేదీన నివేదిక అందజేయాలని ఉత్తర్వులిచ్చింది.

భూమన సహా 35 మంది విచారణ

గత నెల 4వ తేదీనఅయ్యనార్ తిరుపతి చేరుకున్నారు. సీఐడీ ఎస్పీ గంగాధర్, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితోపాటు అదనంగా టెక్నికల్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్, లీగల్ టీమ్ వంటివి ఏర్పాటు చేశారు. ఆ రోజు నుంచి పాతిక రోజుల పాటు విచారణ చేపట్టారు. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులను, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తులను కూడా విచారించారు. అలాగే పరకామణి చోరీ జరిగినప్పుడు, కేసు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నప్పుడు పనిచేసిన అప్పటి టీటీడీ, విజిలెన్స్, పోలీసు అధికారులను, ఉద్యోగులను కూడా ప్రశ్నించారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీకి సంబంధించి కోర్టు సిబ్బంది నుంచి కూడా వివరాలు సేకరించారు. రవికుమార్ పరకామణిలో చోరీ చేయగా పట్టుకుని, ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు తిరిగి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న అప్పటి టీటీడీ ఏవీఎస్‌వో వై సతీశ్‌కుమార్‌ను కూడా విచారించారు.

ఫిర్యాదుదారు మృతి

అనూహ్యంగా రెండోసారి విచారణకు బయల్దేరి వస్తూ గత నెల 14వ తేదీన అనంతపురం జిల్లా పరిధిలో రైలు పట్టాల పక్కన సతీశ్‌కుమార్ తీవ్ర గాయాలతో శవమై కనిపించారు. పోలీసులు హత్య కేసుగా దీనిని విచారిస్తున్నారు. దీనివల్ల వారం రోజుల పాటు తిరుపతిలో సీఐడీ విచారణకు బ్రేక్ పడింది. నవంబరు 21న తిరిగి విచారణ మొదలైంది. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని సైతం సీఐడీ అధికారులు విచారించారు. అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని, చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని విజయవాడ సీఐడీ కార్యాలయంలో విచారించారు.

ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య

» భర్త, అత్తింటి వేధింపులే కారణం: మాధురి తల్లిదండ్రులు

» వాళ్లే చంపేశారంటున్న భర్త రాజేశ్



మంగళగిరి ఎయిమ్స్ మార్చురీ వద్ద యువతి తండ్రి చిన్నరాముడు



దంపతులు రాజేశ్ నాయుడు, మాధురి సాహితి (ఫైల్)

నంద్యాల/తాడేపల్లి/మంగళగిరి సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి కుమార్తె ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కలకలం రేపింది. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వారి నివాసంలో ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆత్మహత్య చేసుకున్న యువతిది కులాంతర ప్రేమ వివాహం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాడేపల్లి పోలీసులు యువతి తల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె తండాకు చెందిన చిన్నరాముడు, లక్ష్మీభాయి దంపతులకు కుమారుడు, కుమార్తె మాధురి సాహితి బాయి (25) ఉన్నారు. ఐఏఎస్ హోదాలో ఉన్న చిన్నరాముడు ప్రస్తుతం రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా గుంటూరులో పనిచేస్తూ.. తాడేపల్లిలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె మాధురి బుగ్గానిపల్లెకు చెందిన బోయ రాజేశ్ నాయుడు అనే వ్యక్తిని ప్రేమించింది. ఈ ఏడాది మార్చి 5న నంద్యాల జిల్లా మహానంది ఆలయంలో వివాహం చేసుకొన్నారు. రాజేశ్ తమ కుమార్తెను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని మాధురి తల్లిదండ్రులు అప్పట్లో నంద్యాల ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్పీ ఇరువర్గాలను పిలిపించి మాట్లాడగా.. మాధురి తన భర్తతో వెళ్తానని చెప్పడంతో ఆమెను భర్త వెంట పంపించారు. మార్చి 7న యువతి తల్లిదండ్రుల ఆమోదంతో బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహ రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. మాధురి 3 నెలల క్రితం 'మిమ్మల్ని చూడాలని ఉంది. మీతో ఉండాలని ఉంది' అంటూ తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపింది. దీంతో వారు బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్‌కు వచ్చారు. ఇరువర్గాలు బేతంచెర్ల పోలీసులను సెప్టెంబరు 3న ఆశ్రయించాయి. పోలీసులు ఇరువర్గాల సమక్షంలో మాధురిని విచారించి ఆమె ఇష్టపూర్వకంగానే తల్లిదండ్రులకు అప్పగించారు. తన భర్తకు ఉద్యోగం లేదని, ఉద్యోగం వచ్చిన తర్వాత వస్తానంటూ మాధురి పోలీసులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చి తల్లిదండ్రులతో వెళ్లిపోయింది.

భర్త వేధింపులకు తాళలేకే..: తల్లిదండ్రులు

తమ కుమార్తెను రాజేశ్ నాయుడు ప్రేమ పేరుతో ట్రాప్ చేసి, పెళ్లి చేసుకొని వేధింపులకు గురిచేశాడని, ఆ వేధింపులకు తాళలేకే బలవన్మరణానికి పాల్పడిందని మాధురి తల్లిదండ్రులు లక్ష్మీభాయి, చిన్నరాముడు ఆరోపించారు. మంచి ఉద్యోగం, జీతం వస్తుందని చెప్పి నమ్మబలికాడని పేర్కొన్నారు. తమ కుమార్తెపై వున్న మమకారంతో రాజేష్ డిమాండ్ మేరకు 20 తులాల బంగారం, కొంత నగదు ఇచ్చామని వెల్లడించారు. పెళ్లయిన రెండు నెలల తర్వాత తమ కుమార్తె భర్త వేధింపుల గురించి చెప్పిందన్నారు. అత్తింటికి వెళ్లి అనేక మార్లు ప్రాధేయపడినప్పటికీ.. వేధింపులు తగ్గకపోవడంతో తమ కుమార్తెను పుట్టింటికి తీసుకొచ్చామని తెలిపారు. భర్త వేధింపులను గుర్తుచేసుకుని, మానసిక క్షోభను భరించలేక ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాళ్లే చంపేశారు..: రాజేశ్ నాయుడు

తన భార్య మాధురి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ రాజేశ్ నాయుడు సోమవారం నంద్యాల ఎస్పీని ఆశ్రయించారు. ఆమె తల్లిదండ్రులే హత్య చేశారంటూ మీడియా ఎదుట ఆరోపించారు. తనకు కూడా ప్రాణహాని ఉందని.. తన భార్య గర్భవతి కూడా అని పేర్కొన్నారు. తన భార్య మృతిపై లోతుగా దర్యాప్తు చేసి అసలు విషయాలు బయటకు తీయాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ మంగళవారం బేతంచెర్ల మండలం బుగ్గానపల్లె తండాకు వెళ్లనున్నారు.

ఈ శీతాకాలం గజగజ

» చలి గుప్పిట దేశంలోని అనేక ప్రాంతాలు

» రాష్ట్రంలో చలి ప్రభావం సాధారణమే

» డిసెంబరులో ఉత్తర కోస్తాలో ఎక్కువ వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈసారి శీతాకాలం గజగజా వణికించనుంది. దేశంలోని అనేక ప్రాంతాలు తీవ్రమైన చలిగాలుల గుప్పెట్లో చిక్కుకోనున్నాయి. మధ్య, వాయవ్య భారతం, పశ్చిమ, తూర్పుభారతంలో కొన్ని రాష్ట్రాలు, దక్షిణాదిలో తెలంగాణ, ఉత్తర కర్ణాటకలో అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండనుంది. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు 3 నెలల శీతాకాలంలో దేశంలో ఉష్ణోగ్రతలు, వర్షపాతంపై సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నివేదిక విడుదల చేసింది. ఈ మూడు నెలల్లో వాయవ్య, మధ్య భారతంతోపాటు తూర్పు, పశ్చిమ, దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాల్లో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని, ఈ ప్రాంతాల్లో చలిగాలులు వీచే రోజులు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. ఏపీలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం, అంత కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వెల్లడించింది. డిసెంబరులో దక్షిణ భారతంలో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఏపీ వరకు ఉత్తర కోస్తాలో సాధారణం కంటే ఎక్కువగా, మిగిలిన ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది.

లా నినా ప్రభావంతో చలి గాలులు..

ఈ ఏడాది పుష్కలంగా కురిసిన వర్షాలతో దేశంలో ఇప్పటికే వాతావరణం చల్లబడింది. దీనికితోడు పసిఫిక్ మహాసముద్రంలో కొనసాగుతున్న లా నినా పరిస్థితుల ప్రభావంతో ఆ సముద్రం మీదుగా చల్లని గాలులు దేశంపైకి వీస్తున్నాయి. వీటి ప్రభావంతో నవంబరులోనే అనేక ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో శీతాకాలంలో దేశంలో అనేక ప్రాంతాల్లో చలితీవ్రత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. శీతల గాలుల తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గుడారాల్లో నివసించే సంచార జాతుల వారు ఇబ్బందులకు గురవుతాయని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది. వ్యవసాయ, ఉద్యానవన పంటలపై ప్రభావం ఉంటుందని, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, ప్రభుత్వ యంత్రాంగాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. శీతాకాలంలో రోజువారీ బులెటిన్లు విడుదల చేస్తామని పేర్కొంది.

సంతకాల కోసం కోటి పాట్లు!

» పీపీపీకి వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాల సేకరణకు స్పందన శూన్యం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో వైద్యకళాశాలల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమం ఉసూరుమంటోంది. 175 నియోజకవర్గాల్లోనూ అక్టోబరులో సంతకాల సేకరణ మొదలుపెట్టి.. నవంబరు 27న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సమర్పిస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అప్పట్లో అట్టహాసంగా ప్రకటించారు. ఒక్కో నియోజకవర్గంలో 57,500 మందితో సంతకాలు సేకరిస్తే తప్ప కోటి సంతకాలు పూర్తికావు. వైసీపీ శ్రేణులేవీ జనంలోకి వెళ్తున్న దాఖలాలే లేవు. ఒక వేళ పొరపాటున ఎవరైనా వెళ్లి.. పీపీపీకి వ్యతిరేకంగా సంతకాలు అడిగితే ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో 17 మెడికల్ కాలేజీల్లో ఎన్ని పూర్తి చేశారని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. దీంతో నేతలు మౌనం దాలుస్తున్నారు. జగన్ విశాఖ రుషికొండపై ఆర్భాటంగా రూ.500 కోట్లతో నిర్మించిన ప్యాలెస్ వైసీపీకి గుదిబండగా మారింది. రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తే మెడికల్ కాలేజీలను నిర్మించేయొచ్చని ఆయన వాదిస్తున్నారు. ఇప్పుడు వైసీపీ నేతలను జనం ఇదే అడుగుతున్నారు. జగన్ తన ఒక్కరి కోసం 500 కోట్లతో విలాసవంతమైన భవనాన్ని నిర్మించుకున్నారని.. ఆ నిధులను మెడికల్ కాలేజీలకు వాడితే తమకు మేలు జరిగేది కదా అని నిలదీస్తున్నారు. సగం సీట్లను యాజమాన్య కోటా కింద విక్రయించే అవకాశమివ్వడంపైనా అడుగుతున్నారు. దీంతో సంతకాల సేకరణ అంటేనే వైసీపీ నేతలు జంకుతున్నారు. సంతకాలు చేయడానికి జనం ముందుకు రాకపోవడంతో.. కొందరు వైసీపీ నేతలు హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రుల నుంచి సేకరణకు సిద్ధమయ్యారు. ఆ ప్రయత్నమూ బెడిసికొట్టడంతో వెనుదిరిగారు. కోటి సంతకాలు ఎప్పటికి పూర్తవుతాయి.. గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఎప్పుడు సమర్పిస్తారని వైసీపీ శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి.

మార్కెట్లు పడిపోవడానికి జగన్ ప్రచారాలే కారణం: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతు సంక్షేమం, వ్యవసాయ రంగంపై వైఎస్ జగన్ సామాజిక మాధ్యమాల్లో చేస్తున్న వ్యాఖ్యలు ఆయన ఐదేళ్ల పాలనలో వ్యవసాయాన్ని ఎలా దెబ్బతీశారో గుర్తు చేస్తున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'రైతుల కోసం ఒక్క ఉపశమన చర్య తీసుకోకుండా మార్కెట్ వ్యవస్థను దెబ్బతీసి, పంటలు పాడైనా.. కనీస మద్దతు ధర అందకుండా చేసి, రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని అట్టడుగు స్థాయికి తీసుకొచ్చింది గత ప్రభుత్వమే. ఉల్లి ధర తగ్గితే రూ.25 వేలు ఉన్న పరిహారాన్ని రూ.50 వేలకు పెంచి, రైతులకు రూ.104 కోట్లు ఇవ్వబోతున్నాం. గతంలో అరటి టన్ను రూ.25 వేలు ఉందంటున్న జగన్... అంత రేటు ప్రభుత్వ ఖజానా నుంచి ఇచ్చారా? అతని గొప్ప వల్ల రేటు వచ్చిందనడం సిగ్గుచేటు. ఉచిత బీమా అని చెప్పి, జగన్‌లా మోసం చేయలేదు. మార్కెట్లు పడిపోవడానికి జగన్ తప్పుడు ప్రచారాలే కారణం' అని అచ్చెన్న ఆరోపించారు.

మరో వివాదంలో ఐపీఎస్ సునీల్

» బహిరంగ సభలో కులాల ప్రస్తావన

» కాపులు, దళితులు ఏకమైతే రాజ్యాధికారం దక్కుతుందని వ్యాఖ్యలు

» సర్వీస్ రూల్స్ ఉల్లంఘించారు: రఘురామ

» చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ఫిర్యాదు



అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఆలిండియా సర్వీస్ అధికారిగా ఉన్న సునీల్ కుమార్ బహిరంగ సభలో కులాల ప్రస్తావన తీసుకొచ్చారు. కాపులు, దళితులు ఏకమైతే రాజ్యాధికారం దక్కుతుందంటూ అనకాపల్లి జిల్లాలోని ఓ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. కాపు సీఎం, దళిత డిప్యూటీ సీఎం కొనసాగవచ్చంటూ సునీల్ బహిరంగంగా చేసిన సూచన రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. సునీల్ వ్యాఖ్యలపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఆలిండియా సర్వీస్ నిబంధనలు అతిక్రమించిన సునీల్ కుమార్‌పై చర్య తీసుకోవాలని డీవోపీటీకి లేఖ రాశారు. అగ్నిమాపక శాఖలో అవినీతికి పాల్పడ్డారంటూ ఏసీబీ కేసు.. అగ్రిగోల్డ్ లబ్ధిదారుల పేరుతో నిధులు పక్కదారి మళ్లించారన్న ఫిర్యాదు.. ప్రభుత్వ అనుమతి లేకుండా పలుమార్లు విదేశాలకు వెళ్లడంతో ఆయన సస్పెండ్ అయిన విషయాలను లేఖలో పేర్కొన్నారు. అఖిల భారత సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలు సస్పెన్షన్‌లో ఉన్నప్పటికీ వర్తిస్తాయని, సునీల్ కుమార్‌ను సర్వీస్ నుంచి తొలగించాలని కేంద్రానికి రఘురామ విజ్ఞప్తి చేశారు. తరచూ వివాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్న సునీల్ కుమార్ ఏపీ పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పని చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఐడీ ఏడీజీగా ఉన్నప్పుడు వైసీపీ మూకలు హైకోర్టు న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్వయంగా రిజిస్ట్రార్ ఫిర్యాదు చేసినా, వారి ఆచూకీ లభించలేదని కోర్టుకు సీఐడీ సమాధానం ఇచ్చింది. ఆ తర్వాత సీబీఐకి ఫిర్యాదు చేయడంతో మొత్తం 18 మందిపై చర్యలు తీసుకుంది. విదేశాల్లో ఉన్న వారిని సైతం అరెస్టు చేసింది. అప్పటి ప్రతిపక్ష టీడీపీకి చెందిన వారిని అర్ధరాత్రి అరెస్టులు చేయించి చితకబాదించినట్లు సునీల్ కుమార్ పలు మార్లు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును అరెస్టు చేయడం, కస్టోడియల్ హింసకు గురిచేయడంతో సునీల్ చర్య దేశవ్యాప్తంగా సంచలనమైంది. కూటమి ప్రభుత్వం వచ్చాక గుంటూరు పోలీసులకు రఘురామ ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. ఈ నెల 4న పోలీసుల ముందు విచారణకు సునీల్ హాజరు కావాల్సి ఉంది. ఇదే సమయంలో కులాల ప్రస్తావన తీసుకొస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

మద్యం ముడుపులతో బంగారం

» 'వైట్'గా మార్చుకున్న కసిరెడ్డి గ్యాంగ్

» సహకరించిన ఏ-49 అనిల్ చోఖ్రా

» ఆదాన్, లీలా, ఎస్పీవై నుంచి 78 కోట్లు షెల్ ఖాతాల్లోకి మళ్లింపు

» స్కామ్‌లో దుబాయ్ ఆర్థిక లింకులు

» సిట్ విచారణలో గుట్టువిప్పిన చోఖ్రా



అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ స్కామ్‌లో ముడుపుల సొమ్మును రకరకాల మార్గాల్లో దారి మళ్లించారు. అందులో కొంత మొత్తాన్ని ముంబైలో బంగారం, నగదు రూపంలో 'వైట్'గా మార్చుకున్నారు. లిక్కర్ స్కామ్‌లో ఏ-49 నిందితుడు అనిల్ చోఖ్రా సిట్ విచారణలో ఆ గుట్టు విప్పాడు. ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి(ఏ-1) బినామీ డిస్టిలరీలైన ఆదాన్, లీలా, ఎస్పీవై ఆగ్రోస్‌కు ఏపీఎస్‌బీసీఎల్ నుంచి వచ్చిన రూ.78 కోట్లను షెల్ కంపెనీల్లోకి మళ్లించినట్టు చెప్పినట్టు తెలుస్తోంది. మనీలాండరింగ్ ద్వారా ఈ సొమ్మును కొంత బంగారం, మరి కొంత నగదు రూపంలో వైట్‌గా మార్చుకున్నారు. ఆ వివరాలు మొత్తం సిట్ విచారణలో చోఖ్రా వెల్లడించాడు. షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్‌కు పాల్పడిన చోఖ్రా తనకు ఎవరెవరితో లావాదేవీలు జరిగాయో వెల్లడించాడు. ఊరూపేరూ లేని వ్యక్తుల ఆధార్, పాన్ కార్డులు సేకరించి, ముంబైలో ముప్పైకి పైగా షెల్ కంపెనీలు సృష్టించి, వాటి బ్యాంకు ఖాతాల్లోకి రూ.కోట్లు జమ చేయించుకున్న వైనాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. చోఖ్రా చేతిలో ఉన్న ఓల్విక్, క్రిపటి, నైస్‌నా, విశాల్ తదితర కంపెనీల ఖాతాల్లోకి చేరిన సొమ్ముతో ముంబైలోని చాముండ బులియన్స్ యజమాని చేతన్ కుమార్ ద్వారా గోల్డ్ డీల్ కుదుర్చుకున్నాడు. మరి కొంత డబ్బును సిండికేట్ గోల్డ్ డీలర్స్ ద్వారా బంగారంగా మార్చేశాడు. అంతిమంగా దుబాయ్‌లోని చేతన్ కుమార్ తండ్రికి సంబంధించిన ఆర్థిక లింకులతో మొత్తం నల్లడబ్బును వాషింగ్ మిషన్‌లో వేసిన దుస్తుల్లా వైట్‌గా మార్చేసినట్లు సిట్ అధికారులకు చోఖ్రా వివరించినట్లు తెలిసింది. మరో రెండు రోజుల పాటు చోఖ్రాను సిట్ విచారించనుంది. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన సుమారు 3,500 కోట్ల మద్యం స్కామ్‌లో కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న మాజీ సీఎం జగన్ ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి(ఏ1)తో పాటు ఎంపీ మిథున్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ మాజీ ఓఎస్‌డీ కృష్ణమోహన్ రెడ్డి, వైసీపీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా 13 మందిని సిట్ అరెస్టు చేసింది. రాజ్ కసిరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితరులు కోట్లాది రూపాయల సొమ్ముతో కొనుగోలు చేసిన స్థిరాస్తులను రెండు తెలుగు రాష్ట్రాల్లో జప్తు చేసింది. మరోవైపు డెన్‌ల నుంచి దొంగలు ఎత్తుకెళ్లిన కోట్ల రూపాయల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తులను ఒడిశా, హైదరాబాద్‌లలో గుర్తించి జప్తునకు సిట్ రంగం సిద్ధం చేసింది. ఇదే క్రమంలో ముంబైకి చెందిన అనిల్ చోఖ్రాను ఇటీవల అరెస్టు చేసింది. చోఖ్రా మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు గుర్తించింది.

మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితుడుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు జనవరి 19కి వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేని కారణంగా విచారణను రెండు వారాలకు వాయిదా వేయాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఆ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

సత్యవర్ధన్ కేసులో ఇద్దరికి రిమాండ్

విజయవాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరులు కొమ్మా కోటేశ్వరరావు(ఏ2), తేలప్రోలు రాము(ఏ3), వజ్రకుమార్(ఏ6), ఎర్రంశెట్టి రామాంజనేయులు(ఏ9), చేబ్రోలు శ్రీనివాసరావు(ఏ11), వేణు(ఏ12) నిందితులుగా ఉన్నారు. వాళ్లంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ ఆరుగురు పరారీలో ఉన్నారని, నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేయాలని అప్పట్లో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనితో కోర్టు వారెంట్లు జారీ చేసింది. నిందితుల్లో తేలప్రోలు రాము, వజ్రకుమార్ ఆ వారెంట్‌ను రీకాల్ చేయించుకోవడానికి సోమవారం కోర్టుకు హాజరయ్యారు. న్యాయాధికారి పి.భాస్కరరావు వారికి ఈనెల 15వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

మద్యం కేసులో చంద్రబాబుకు విముక్తి

» జగన్ హయాంలో పెట్టిన కేసు కొట్టివేసిన ఏసీబీ కోర్టు

విజయవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో మోపిన మరో కేసులో సీఎం చంద్రబాబుకు విముక్తి లభించింది. 2014-19 వరకు సీఎంగా ఉన్నప్పుడు అమలు చేసిన మద్యం విధానంలో అవినీతి జరిగిందంటూ వైసీపీ ప్రభుత్వంలో ఆయనపై నమోదు చేసిన కేసును విజయవాడ ఏసీబీ కోర్టు కొట్టివేసింది. సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 2023లో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపిన తర్వాత.. అప్పటి సర్కారు ఆయనపై వరుసగా కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మద్యం విధానంలో అవినీతి జరిగిందంటూ అప్పటి రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో చంద్రబాబుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న వాసుదేవరెడ్డి 15 రోజుల కిందట కేసును ఉపసంహరించుకుంటున్నట్లు కోర్టులో మెమో దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ కార్పొరేషన్ ఎండీగా ఉన్న సీహెచ్ శ్రీధర్ కూడా కేసు ఉపసంహరణకు అభ్యంతరం లేదని అఫిడవిట్ వేశారు. దీంతో కేసును కొట్టివేస్తూ న్యాయాధికారి పి.భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు.

ఇదీ కేసు..

2014-19 మధ్య అమలు చేసిన మద్యం పాలసీలో అక్రమాలు జరిగాయని వాసుదేవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై 2023 అక్టోబరు 30న సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ-1గా అప్పటి ఎక్సైజ్ కమిషనర్ శ్రీనివాస శ్రీనరేశ్, ఏ-2గా అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, ఏ-3గా చంద్రబాబు పేర్లను చేర్చారు. చంద్రబాబుపై అప్పట్లో పెట్టిన ఫైబర్‌నెట్ స్కాం కేసును కూడా ఇటీవల ఏసీబీ కోర్టు మూసివేసింది. ఫైబర్‌నెట్‌లో అక్రమాలేవీ చోటు చేసుకోలేదని, సంస్థకు ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని సీఐడీ క్లీన్‌చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే.ఫైబర్‌నెట్ పూర్వ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.మధుసూదనరెడ్డి, ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ గీతాంజలి శర్మ కోర్టుకు లిఖితపూర్వకంగా తెలియజేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

బాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

» ఏఏజీగా పనిచేసిన పొన్నవోలు ఫిర్యాదుదారు తరఫున వాదించడంపై లూథ్రా అభ్యంతరం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో సీఐడీ తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, అప్పటి మాజీ మంత్రి పి.నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణను హైకోర్టు 10వ తేదీకి వాయిదావేసింది. ఫిర్యాదుదారు ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హాజరుకావడంపై పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అదనపు అడ్వకేట్ జనరల్(ఏఏజీ) హోదాలో గతంలో సీఐడీ తరఫున హాజరైన పొన్నవోలు.. ఇప్పుడు ఫిర్యాదుదారు తరఫున హాజరుకావడం బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధమని కోర్టుకు నివేదించారు. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి తరఫున హాజరుకావడాన్ని పొన్నవోలు సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు.. ఫిర్యాదుదారు తరఫున పొన్నవోలు హాజరుకావచ్చా లేదా అనే విషయాన్ని తదుపరి విచారణలో తేలుస్తామని తెలిపారు. విచారణను ఈ నెల 10కి వాయిదా వేశారు. రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో అప్పటి వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి 2021 ఫిబ్రవరి 24 ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ పోలీసులు చంద్రబాబు, పి.నారాయణపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంతో పాటు ఏపీ అసైన్డ్ భూముల బదిలీ నిరోధక చట్టం, ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వాటిని కొట్టివేయాలని కోరుతూ వారిద్దరూ వ్యాజ్యాలు దాఖలు చేశారు.

'జోగి' కుమారులకు నోటీసులు

విజయవాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ సోదరుల కుమారులకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. బుధవారం విచారణకు రావాలని రమేశ్ కుమారులు రాజీవ్, రోహిత్, రాము కుమారులు రాకేశ్, రామ్మోహన్‌లకు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.